

పరంజ్యోతి

# ఆత్మ సాధనతో వైరాగ్యం

*యో వివిక్త స్థానం సేవతే యోలోక బన్ధమున్మూలయతి*
*యో నిస్త్రైగుణ్యోభవతి యో యోగక్షేమం త్యజతి*

ఏకాంతంలో ఉండటం బంధాలకు మూలమైన సుఖాభిలాష లేకుండా ఉండటం, త్రిగుణాతీతుడవటం, ధనాదుల సంపాదనపై వ్యామోహాన్ని నిర్మూలించడం వైరాగ్య కారకాలని నారద సూత్రాలు చెబుతున్నాయి. సంసారమనే భయంకర తిమిరాన్ని దృఢమైన సంకల్పం అనే ఆయుధంతో అంతం చేయాలి. కానీ! అది అంత సులభసాధ్యం కాదనీ, గొప్ప అభ్యాసంవల్ల వైరాగ్యంతో సాధ్యమవుతుందని భగవద్గీత చెబుతోంది. అందుకు కొన్ని సాధనలు అవసరం. అవేంటంటే.. సంసారంపై భ్రమ అనిత్యమనే సత్యభావన కలగాలి. సంసారానుభవంలో ఎదురయ్యే సమస్యలను పరిశోధనతో పరీక్షించాలి. సంసార సముద్రం నుంచి బయటపడే మార్గాన్ని అన్వేషించాలి. అందుకు ఉపకరించే మార్గాలు.. బోధ గురువులను సేవించడం, సజ్జనులతో స్నేహం చేయడం, దేవుని అనుగ్రహం కోసం పాటుపడటం.



*దుర్లభం త్రయమేవై తత్ దైవానుగ్రహహేతుకమ్*
*మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుష సంశ్రయః*

అత్యంత దుర్లభమైనటువంటి.. మనుష్య జన్మం, ముక్తి, మహాత్ముల ఆశ్రయం అనే మూడు విధాలైన పరమప్రయోజనాలు దైవానుగ్రహంతో సిద్ధిస్తాయని 'వివేక చూడమణి' వివరిస్తుంది. సత్సాంగత్యం అనే పడవతో సంసారమనే సముద్రాన్ని దాటవచ్చని వశిష్ఠ మహర్షి శ్రీరామునితో 'యోగవాశిష్ఠం'లో తెలిపాడు. రామకృష్ణ పరమహంస, వివేకానందుడు, రమణ మహర్షి లాంటి వారు వైరాగ్య సాధనలో సంపూర్ణులయ్యారు. రాముడు కైకమ్మ కోరిక మేరకు రాజ్యాన్ని తృణీకరించడం, భరతుడు రామపాదుకల పట్టాభిషేకంతో సంతృప్తి వహించడం, తండ్రి కోసం దేవవ్రతుడు భీష్మమైన ప్రతిజ్ఞ చేసి, ఆజన్మాంతం బ్రహ్మచారిగా జీవితం గడపడం వైరాగ్య భావాలుగా పరిగణింపబడుతూ ఉన్నాయి. సమాజ సేవ కోసం తమ జీవితాలను అర్పించి, కలం పట్టి కావ్యాలల్లిన కవివరేణ్యులు ఎందరో వైరాగ్య భావంతో కైవల్య ప్రాప్తినందారు. భక్తపోతన తన భాగవతాన్ని ధనం కోసం ధారుణిపతులకు అంకితమివ్వక.. వైరాగ్యాన్ని చిత్తంలో ధరించి, తన కృతిని భగవంతునకర్పించి భవబంధాలను బాపుకొన్నాడు. భక్తి జ్ఞానవైరాగ్యాలకు నిలయమైన శతక వాఙ్మయ కర్తల్లో కొందరు వైరాగ్యాన్ని తమ రచనల్లో పొందుపరచారు. ఈ వైరాగ్యమే మానవుని ముక్తి దిశగా నడిపిస్తుంది.

**- విద్యాన్ వల్లూరు చిన్నయ్య, 99483 48918**



## సూరీడు చిన్నబోయాడు

సూర్యుడి కాంతిని చందమామ ఎలా అడ్డుకుంటోందో చూశారా! సూర్యగ్రహణం సందర్భంగా గురువారం విశాఖపట్టణంలో కనిపించిన సుందర దృశ్యాలు ఇవి. ఉదయం 8.08 నుంచి 11.16 గంటల వరకు సూర్యగ్రహణం కొనసాగింది.



సూర్యగ్రహణం వేళ కాకినాడలో చెట్టుపై రామ చిలుకల సయ్యాట

# అర్హులందరికీ ఇళ్ల స్థలాలు



దిశా చట్టం అమలుపై హోంమంత్రి, డీజీపీలతో సీఎం జగన్ సమీక్ష

- 'దిశ' కోర్టుల ఏర్పాటులో జాప్యం వద్దు
- ఫోరెన్సిక్ ల్యాబ్‌ల సామర్థ్యాన్నీ పెంచుకోండి
- ఉన్నతాధికారులతో సమీక్షలో సీఎం జగన్

అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చేందుకు ఉగాది నాటికి భూములను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారు. అర్హత ఉండి ఇళ్లులేని ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా లబ్ధిదారుల జాబితా ఉండాలని రెవెన్యూ శాఖను ఆదేశించారు. గురువారం క్యాంపు కార్యాలయంలో పేదల ఇళ్ల స్థలాలు, దిశ చట్టం అమలుపై ఉపముఖ్యమంత్రి సుభాష్ చంద్రబోసు, హోంమంత్రి సుచరిత, సీఎం ప్రధాన సలహాదారు అజయ్‌కల్లాంతోపాటు సంబంధిత ఉన్నతాధికారులతో సీఎం సమీక్షించారు. ఇళ్ల స్థలాల కోసం 22,46,139 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామని రెవెన్యూశాఖ కార్యదర్శి ఉషారాణి వివరించారు. ఇందులో 11,77,260 మంది గ్రామీణ లబ్ధిదారులుకాగా, 10,99,160 మందిని పట్టణాల్లో ఎంపిక చేసినట్లు ఆమె తెలిపారు. ఇళ్లస్థలాలు ఇవ్వడానికి, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కలిపి 22,461 ఎకరాల భూమి అందుబాటులో ఉందని సీఎంకు నివేదించారు. విశాఖ, ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఇళ్లస్థలాల కోసం భారీగా భూములు సేకరించాల్సి ఉందని వివరించారు. అయితే, ఏ మేరకు ప్రైవేటు భూములను గుర్తించారని సీఎం ఆరా తీశారు. అదనంగా ఇంకా 15,363 ఎకరాలు అవసరమని అధికారులు చెప్పారు. ఇప్పటికే భూసేకరణ ప్రక్రియ జిల్లాల్లో చేపట్టామన్నారు.

### పటిష్ఠంగా దిశ అమలు

"మహిళలకు రక్షణగా చట్టం చేసినా అమలు కావట్లేదన్న మాట ఎక్కడా రాకూడదు.. 'దిశ' అమలుకు అన్ని చర్యలు తీసుకోండి" అని జగన్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని, అందుకు అవసరమైన నిధులు వారం రోజుల్లో ప్రభుత్వం విడుదల చేస్తుందని ఈ సందర్భంగా అన్నారు. ఫోరెన్సిక్ ల్యాబ్‌ల సామర్థ్యం పెంచాల్సి ఉంటుందని డీజీపీ గౌతమ్ సవాంగ్ చెప్పగా.. నాలుగు రెట్లు పెంచుకునేందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. అయితే అసెంబ్లీలో ఆమోదం పొందిన దిశ బిల్లు న్యాయశాఖ పరిశీలన నుంచి హోంశాఖకు చేరినట్లు తెలిసింది. అక్కడి నుంచి గవర్నర్‌కు, అనంతరం రాష్ట్రపతి ఆమోదంతో చట్టం అమల్లోకి రానుంది. అనంతరం సుచరిత మీడియాతో మాట్లాడుతూ.. దిశ చట్టం అమలు కోసం మౌలిక సదుపాయాల కల్పనకు రూ.23కోట్లు విడుదల చేస్తున్నామని, రెండు నెలల్లోనే భవనాలు, ఇతర సదుపాయాలు అందుబాటులోకి వస్తాయన్నారు. 3 ఫోరెన్సిక్ ల్యాబ్‌ల ఏర్పాటుతోపాటు 176మంది సిబ్బంది నియామకం కోసం త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు.

# తెలుగుపై పరోక్ష దాడులు

- భావితరాలకు మాతృభాషను అందించడం అందరి బాధ్యత
- ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు విజయవంతం కావాలి
- నిర్వాహకులకు సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ఎన్‌వీ రమణ లేఖ



విజయవాడ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): 'మాతృభాషను కాపాడుకుందాం.. స్వాభిమానం చాటుకుందాం' అనే పిలుపుతో తెలుగు భాషా పరిరక్షణ, వ్యాప్తి కోసం 4వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహించడం ప్రశంసనీయమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడలో ప్రారంభంకానున్న మహాసభల నిర్వాహకులను అభినందిస్తూ ఆయన ఓ లేఖ పంపారు. తెలుగువాడు భాషాభిమానే కానీ దురభిమాని కాడని ఆ లేఖలో పేర్కొన్నారు. 'తెలుగు భాష గొప్పదనాన్ని ప్రజలకు తెలియజెప్పి, తర్వాతి తరాలకు వారసత్వంగా అందజేసేందుకు తెలుగు రచయితలూ, కళాకారులూ, పవిత్ర కృష్ణానదీ తీరాన సమావేశమై, తెలుగు అక్షర బీజాల్ని నాటి, భాషా క్షేత్రాన్ని సస్యశ్యామలం చేసి, భాషా సౌందర్యాన్ని సుసంపన్నం చేయ సంకల్పించడం సంతోషకరం. తెలుగు భాష జవజీవాలను పరిపుష్టం చేసేందుకు రచయితలూ, కవులూ, కళాకారులూ ఉద్యమకారులు కావడం శుభపరిణామం. మొదటి ప్రపంచ తెలుగు మహాసభల్ని విజయవంతంగా నిర్వహించడంలో ప్రధానపాత్ర పోషించిన మండలి వెంకటకృష్ణారావును ఈ సందర్భంగా స్మరించుకోవాల్సిన అవసరం ఉంది. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుతో తెలుగు రాష్ట్రాలేర్పడిన తర్వాత గత కొన్నాళ్లుగా మన భాష ఉనికి మీద పరోక్ష దాడులు జరుగుతున్నాయి. నిరంతర గంగాప్రవాహానికి అడ్డుకట్ట వేయగలమా? అఖండ సూర్య కాంతి పుంజాన్ని అరచేతితో ఆపగలమా? తెలుగు భాష పరిఢవిల్లడానికి నిరంతరం శ్రమించాల్సిందే. ముఖ్యంగా న్యాయస్థానాల్లో తెలుగును పటిష్టంగా అమలు చేయాలి. ఈ దిశగా సుప్రీం కోర్టు ప్రాంతీయ భాషల్లోకి తీర్పులను తర్జుమా చేస్తోంది' అని ఆ లేఖలో పేర్కొన్నారు. అందమైన, మధురమైన మన తెలుగు భాషను భావితరాలకు అందించటం ప్రతి ఒక్కరి బాధ్యతని, ఈ బాధ్యతను విస్మరిస్తే భావితరాలు క్షమించవన్నారు. విజయవాడలో జరిగే ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు దిగ్విజయం కావాలని జస్టిస్ రమణ ఆకాంక్షించారు.

### నేటి నుంచి ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు

విజయవాడ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సాహిత్యవాడ బెజవాడ మరోసారి ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు వేదికైంది. సుమారు 1600 మంది ప్రతినిధులకు ఆతిథ్యం ఇవ్వబోతోంది. కృష్ణాజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రతి మూడేళ్లకు ఒకసారి ప్రపంచ తెలుగు రచయితల మహాసభలను నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు మూడు మహాసభలు నిర్వహించగా, నాలుగో మహాసభలు శుక్రవారం ఉదయం పది గంటల నుంచి ప్రారంభం కానుంది. పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆడిటోరియంలో ఈ మహాసభలను నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంగణానికి కొమర్రాజు లక్ష్మణరావు ప్రాంగణంగా, ప్రధాన వేదికకు గిడుగు రామమూర్తిపంతులు వేదికగా పేరు పెట్టారు. సదస్సులు జరిగే వేదికకు సురవరం ప్రతాప్‌రెడ్డి వేదికగా నామకరణం చేశారు. దేశ, విదేశాల నుంచి వచ్చే ప్రతినిధులకు సంప్రదాయ వంటకాలతో రుచులు అందించడానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

## లోకం తీరు




## చలికాలం

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| కడప | 17.0 | 33.0 |
| విశాఖపట్నం | 18.8 | 28.8 |
| శ్రీకాకుళం | 20.0 | 29.0 |
| హైదరాబాద్ | 20.6 | 29.2 |
| విజయవాడ | 21.0 | 29.8 |
| నెల్లూరు | 23.0 | 30.5 |

### కోస్తాలో జల్లులు

విశాఖపట్నం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొమరిన్ ప్రాంతం నుంచి దక్షిణ తమిళనాడు వరకు కొనసాగుతున్న ఉపరితల ద్రోణి ప్రభావంతో సముద్రం నుంచి తూర్పుగాలులు వీస్తున్నాయి. దీంతో కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల గురువారం ఉదయం జల్లులు కురిశాయి. రానున్న ఇరవై నాలుగు గంటల్లో కోస్తాలో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురుస్తాయని, రాయలసీమలో పొడి వాతావరణం కొనసాగుతుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. మేఘాలు ఆవరించడంతో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం లేదా ఒకటి, రెండు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతాయని, అయితే చలి వాతావరణం వుంటుందని పేర్కొన్నారు.



### భారత్-చైనా మధ్య మెరుగ్గా సైనిక సంబంధాలు

చైనా, భారత్ సంబంధాలు భేష్. మొత్తంగా చూస్తే సైనిక సంబంధాలే కీలకం. భారత సైన్యంతో మా సంబంధాలు మెరుగుపడుతున్నాయి. ఇందుకు కృషి చేసిన భారత ప్రధాని మోదీకి, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు కృతజ్ఞతలు. వ్యూహాత్మక చర్చలు, ఆచరణాత్మక సహకారం సైనిక సంబంధాలు మరింత మెరుగుపడటానికి దోహదం చేశాయి.

*- కల్నల్ వూ కియాన్, చైనా రక్షణ శాఖ అధికార ప్రతినిధి*



### పాకిస్థాన్‌పై చర్యకు దిగొచ్చు

మోదీ-ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం గురించి ప్రపంచ దేశాలకు నేను ఐదు నెలలుగా చెబుతూనే ఉన్నాను. దేశంలో సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు పాకిస్థాన్‌పై చర్యకు దిగొచ్చు. ఇందుకు ఆ దేశ బలగాలు సిద్ధమవుతున్నాయి.

*- ఇమ్రాన్‌ఖాన్, పాక్ ప్రధాని*

### మూడో వంతు టీనేజర్లకు పొంచి ఉన్న కేన్సర్ ముప్పు

మెల్‌బోర్న్, డిసెంబరు 26: ప్రపంచవ్యాప్తంగా ఉన్న టీనేజర్లలో మూడింట్లో ఒక్కరు తమ వయసు మీద పడుతున్న కొద్దీ గుండె జబ్బులు, మధుమేహం, కేన్సర్ వంటి వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని తాజా అధ్యయనమొకటి హెచ్చరించింది. మారుతున్న జీవన విధానం, ఆహారపు అలవాట్లే దీనికి కారణమని వెల్లడించింది. ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్ వర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు 89 దేశాల్లో 11-17 ఏళ్ల వయస్సున్న 3 లక్షల మంది పిల్లల పైన అధ్యయనం చేసి ఈ వివరాలను వెల్లడించారు.

### కృత్రిమ మేధతో రక్త కేన్సర్ నిర్ధారణ సులువు

న్యూఢిల్లీ, డిసెంబరు 26: కృత్రిమ మేధను ఉపయోగించి పరీక్షలు నిర్వహించడం ద్వారా రక్తకేన్సర్‌ను(ఏఎంఎల్) ప్రాథమిక దశలోనే అత్యంత కచ్చితత్వంతో గుర్తించవచ్చని జర్మనీ శాస్త్రవేత్తలు తెలిపారు. తద్వారా కేన్సర్ మరణాలను అరికట్టవచ్చని వారు చెప్పారు. దాదాపు 12 వేల రక్త నమూనాలపై పరిశోధనలు నిర్వహించి ఈ వివరాలను సైన్స్ జర్నల్‌లో వెల్లడించారు. రక్తకణాల్లోని జన్యువుల పనితీరును విశ్లేషించడం ద్వారా కేన్సర్‌ను గుర్తించడానికి వీలవుతుందన్నారు. ఈ మొత్తం నమూనాల్లో 4,100 నమూనాలు కేన్సర్ ఉన్నవారివి కాగా, మిగతావి ఆరోగ్యవంతులవి. వీటిపై కృత్రిమ మేధ సాయంతో పరీక్షించగా అది కేన్సర్ ఉన్న నమూనాలను, మిగతా నమూనాలు పూర్తిగా వేరు చేసి చూపింది.

## వాణిజ్యం, పరిశ్రమల్లో ఏపీ టాప్

అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సుపరిపాలన సూచికల్లో రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. జార్ఖండ్‌తో సంయుక్తంగా ఈ ర్యాంక్ సాధించింది. సుపరిపాలన దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఈ ర్యాంకులను విడుదల చేసింది. జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్ చెరో 0.94 స్కోరుతో తొలిస్థానాల్లో నిలిచాయి. తెలంగాణ 0.93, ఛత్తీస్‌గఢ్ 0.93 పాయింట్లు పొందాయి. ఆ తర్వాత గుజరాత్, హరియాణా, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్‌లు 0.92 స్కోర్ సాధించాయి. కేంద్రపాలిత ప్రాంతాల్లో 0.33 స్కోరుతో ఢిల్లీ ప్రథమస్థానంలో నిలిచింది.

## రామాయపట్నానికి రూ.10వేల కోట్లు!

అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రకాశంజిల్లా రామాయపట్నంలో నెలకొల్పాలని భావిస్తున్న రామాయపట్నం గ్రీన్‌ఫీల్డ్ నౌకాశ్రయ ప్రాజెక్టుకు రూ.10వేల కోట్ల వరకూ ప్రైవేటు పెట్టుబడులు వచ్చే అవకాశముందని అంచనా వేశారు. కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని నిపుణుల మదింపు కమిటీ నియమించిన ప్రైవేటు కన్సల్టెంట్ సంస్థ రైట్స్ లిమిటెడ్ ఈ మేరకు అంచనా వేసింది. రామాయపట్నంలో నాన్ మేజర్ పోర్టును నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇక్కడ కృత్రిమంగా డీప్‌సీ హార్బర్‌ను నిర్మించాలని కమిటీ అభిప్రాయపడింది. మొదటిదశలో 802 ఎకరాల్లో రామాయపట్నం పోర్టును అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## సంక్రాంతికి 2,350 ప్రత్యేక బస్సులు: ఆర్టీసీ

అమరావతి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని హైదరాబాద్, చెన్నై, బెంగళూరులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఏపీఎస్‌ఆర్టీసీ 2,350 ప్రత్యేక బస్సులు నడపనుంది. హైదరాబాద్‌కు ఇప్పటికే రెగ్యులర్‌గా 527 బస్సులు నడుపుతున్నామని, వీటికి అదనంగా ప్రత్యేక బస్సులు నడుస్తాయని సంస్థ అధికారులు పేర్కొన్నారు. అవసరాన్ని బట్టి వీటి సంఖ్యను పెంచుతామని గురువారం వెల్లడించారు.

## విశాఖలో నాకున్నది ఒక ఫ్లాటే

- ఇతర ఆస్తులు, వ్యాపారాలు లేవు
- నా పేరు చెప్పి కొందరు అక్రమాలకు.. వారిపై క్రిమినల్ కేసులు పెట్టండి: విజయసాయి
- విశాఖ ఉత్సవ్ ఏర్పాట్లపై సమీక్ష.. రేపు సీఎంకు ఘన స్వాగతం

విశాఖపట్నం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో తనకు ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ మాత్రమే ఉందని వైసీపీ ఎంపీ వై.విజయసాయి రెడ్డి చెప్పారు. విశాఖ ఉత్సవ్ ఏర్పాట్లపై గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నగరంలో ఒక్క ఫ్లాట్ తప్ప, తనకుగానీ, తన కుటుంబ సభ్యులు, బంధువులకుగానీ మరే ఇతర ఆస్తులూ లేవని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. వ్యాపారాలు కానీ, ఇతరులతో భాగస్వామ్యం కానీ లేవన్నారు. విశాఖను ఎగ్జిక్యూటివ్ రాజధానిగా ప్రకటించిన తరువాత తన పేరు చెప్పి చాలామంది నగరంలో అధికారులను కలిసి వివాదాస్పద భూముల గురించి మాట్లాడుతున్నట్టు తెలిసిందన్నారు. తన పేరు చెప్పి ఇలా వచ్చిన వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదుచేయాలని సూచించారు. కాగా విశాఖను ఎగ్జిక్యూటివ్ రాజధానిగా ప్రకటించిన తరువాత తొలిసారి సీఎం జగన్ ఈ నెల 28న నగరానికి వస్తున్నందున విమానాశ్రయం నుంచి కైలాసగిరి వరకూ, అక్కడ నుంచి సెంట్రల్‌పార్కు, అక్కడ నుంచి ఆర్కే బీచ్ దాకా మొత్తం 24 కిలోమీటర్ల పొడవునా రోడ్‌కు ఎడమ వైపున నిల్చుని స్వాగతం పలకాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మానవహారంలా కాకుండా ఒకరి పక్కన మరొకరు నిల్చొని స్వాగతం పలికేందుకు తరలి రావాలన్నారు. ఈ సమీక్షలో పర్యాటకశాఖ మంత్రి అవంతి శ్రీనివాసరావు, ఇతర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

### తిరుపతిలో స్కిల్ డెవలప్‌మెంట్ వర్సిటీ

మద్దిలపాలెం: ప్రతి జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుచేయాలనే ఆలోచనతో సీఎం జగన్ ఉన్నారని విజయసాయిరెడ్డి చెప్పారు. నగరంలో ప్రగతి భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీగా ఉన్న ఆయన గురువారం ప్రారంభించారు. తిరుపతిలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటుచేయాలనే యోచనతో ముఖ్యమంత్రి ఉన్నారన్నారు.

# స్థానిక ఎన్నికల్లో పాత కోటానే!

- రిజర్వేషన్లపై సరికొత్త ఫిట్టింగ్
- సుప్రీం ఆదేశాలకు విరుద్ధంగా నిర్ణయం
- అభ్యంతరాలొస్తాయని తెలిసీ ముందుకు!
- ఆర్డినెన్సుపై నేడు కేబినెట్‌లో చర్చ
- ఎన్నికల వాయిదా వ్యూహంతోనేనా..?

అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానికసంస్థల ఎన్నికలు మరింత జాప్యం కానున్నాయా..? జనవరి 10 నుంచి మార్చి లోపు ఎన్నికలు నిర్వహిస్తామని హైకోర్టుకు హామీ ఇచ్చిన ప్రభుత్వం.. ఇంకా ఆలస్యం చేసేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోందా? ఎన్నికలను ఇంకొంత కాలం వాయిదా వేసేందుకు ప్రణాళికలు రూపొందించిందా..? పాత పద్ధతిలో రిజర్వేషన్లు అమలు చేయాలన్న ఉద్దేశం అందులో భాగమేనా..? ప్రస్తుత పరిణామాలు చూస్తే ఇది నిజమనిపిస్తోంది. రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలను కాదని ముందుకెళ్తుండడంతో వెంటనే ఎన్నికలు జరగడం ప్రభుత్వానికి ఇష్టం లేదని స్పష్టమవుతోందని పలువురు విశ్లేషకులు పేర్కొంటున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం దేశంలో ఏ రాష్ట్రంలోనైనా రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని స్పష్టమైన ఆదేశాలున్నాయి. గతేడాది తెలంగాణ ప్రభుత్వం పాత పద్ధతిలో 60.15 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని కోరినా.. సుప్రీం అంగీకరించలేదు. దీంతో 50 శాతం రిజర్వేషన్లు మాత్రమే అమలుచేసి అక్కడ ఎన్నికలు నిర్వహించారు. ఇవన్నీ తెలిసినా మన రాష్ట్ర ప్రభుత్వం పాత పద్ధతిలో 60.15% కోటా అమలుకు ఎందుకు సన్నాహాలు చేస్తుందనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఇందుకోసం తీసుకురావలసిన ఆర్డినెన్సుపై శుక్రవారం కేబినెట్‌లో చర్చించి నిర్ణయించనున్నట్లు సమాచారం.

### రిజర్వేషన్ల మెలిక ఎందుకు..?

పంచాయతీ ఎన్నికలు వెంటనే నిర్వహించాలని ఇప్పటికే హైకోర్టు ప్రభుత్వానికి సూచించింది. ఎన్నికలు సకాలంలో ఎందుకు నిర్వహించలేదని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని (ఎస్‌ఈసీ) ప్రశ్నించింది. రిజర్వేషన్లు ఖరారు చేయకపోవడంతో ఆ ప్రక్రియ ప్రారంభించలేకపోయామని ఎస్‌ఈసీ సమాధానమివ్వడంతో ఆ ప్రక్రియ వెంటనే చేపట్టాలని కోర్టు ప్రభుత్వానికి సూచించింది. ఎన్నికలు జాప్యం చేసేందుకు హైకోర్టు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదని తెలిసే.. రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ల మెలిక తెచ్చినట్లు సమాచారం. రిజర్వేషన్లు 50 శాతానికి కుదిస్తూ అసెంబ్లీలో బిల్లు పెట్టాల్సి ఉన్నా ఇటీవలి శీతాకాల సమావేశాల్లో ఆ పని చేయలేదు. ఆర్డినెన్స్ ద్వారా 50 శాతం రిజర్వేషన్ల అంశం తెస్తారని అందరూ భావిస్తున్న తరుణంలో.. పాత పద్ధతిలోనే 60.15 శాతం రిజర్వేషన్ల అమలుకు సన్నాహాలు చేస్తున్నారని సమాచారం. దీనికి హైకోర్టు గానీ, సుప్రీంకోర్టు గానీ అంగీకరించవని తెలిసీ ముందుకెళ్తుండడం వెనుక.. ఈ కారణంగానైనా కొంత మేర జాప్యం చేయవచ్చన్న వ్యూహం ఉందని ప్రచారం జరుగుతోంది. స్థానిక సంస్థల్లో 50 శాతానికి రిజర్వేషన్లు కుదించడంతో బీసీలకే నష్టం జరుగుతోందని బీసీ సంఘాలు గగ్గోలు పెడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కుదిస్తే బీసీల్లో అసంతృప్తి పెచ్చరిల్లుతుందని వైసీపీ ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. ఎప్పటిలాగా రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించి.. సుప్రీంకోర్టు అభ్యంతరం వ్యక్తం చేస్తే.. కోర్టు ఆదేశాల ప్రకారం చేశామని ప్రచారం చేసుకునేందుకు వ్యూహం పన్నినట్లు తెలుస్తోంది.

### జాప్యమెందుకో..?

వైసీపీ అధికారం చేపట్టగానే వెంటనే స్థానిక ఎన్నికలు నిర్వహిస్తారని సర్వత్రా భావించారు. ఆ ఊపులోనే ఎన్నికలు నిర్వహిస్తే క్లీన్‌స్వీప్ చేయవచ్చనుకున్నారు. అయితే సీఎం జగన్ గ్రామ సచివాలయాల ఏర్పాటు, పలు సంక్షేమ పథకాలను ప్రకటించారు. ఆరు నెలల్లోపు పేదలకు వైసీపీ ప్రభుత్వ మార్కు చూపించి ఎన్నికలకు వెళ్లాలని ఆ పార్టీ నాయకత్వం నిర్ణయించింది. అయితే గ్రామ సచివాలయాల వ్యవస్థ ఇప్పటికీ కొలిక్కి రాకపోవడం.. వివిధ పథకాలు ఇంకా అమలు దశలో ఉండడం, ఇసుక ఇబ్బందులతో పాటు గ్రామీణ, పట్టణ ప్రజల్లో అసంతృప్తి పెల్లుబకడంతో ఇంకొంత కాలం ఆగి స్థానిక ఎన్నికలు నిర్వహించాలని అనుకుంటోంది. అయితే పంచాయతీ ఎన్నికలు నిర్వహించకుండా ఏడాదికి పైగా జాప్యం చేశారని, దీంతో రాష్ట్రానికి రావలసిన 14వ ఆర్థిక సంఘం నిధులు ఆగిపోయాయని తాండవ యోగేశ్, అన్నె వేణుగోపాలకృష్ణమూర్తి తదితరులు హైకోర్టులో పిటిషన్ వేశారు. దరిమిలా పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని పదే పదే హైకోర్టు నిలదీసింది. జనవరిలో నోటిఫికేషన్ ఇస్తామని.. మార్చిలోపు స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. మార్చి 3న ఎన్నికల షెడ్యూల్ సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. మార్చి 3న హైకోర్టుకు స్థానిక ఎన్నికల షెడ్యూల్‌తో పాటు రిజర్వేషన్లు ప్రక్రియ తదితర వివరాలు అందించాల్సి ఉంది.

# బతుకులు నుజ్జునుజ్జు!

- కారును బలంగా ఢీకొన్న ఆర్టీసీ బస్
- ఒకే కుటుంబంలో ఐదుగురు మృతి

కేవీపల్లె/రాయచోటి, పాలకొండ, డిసెంబరు 26: వారంతా ఒకే కుటుంబానికి చెందినవారు. ఇంటి పెద్దాయనకు షుగర్ ఎక్కువై.. కాలి గాయం మానకపోవడంతో కారులో తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు కాలు తీసేయాలని చెప్పారు. ఆ బాధలో ఇంటికి తిరిగొస్తున్న వారిని ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు కబళించింది. చిత్తూరు జిల్లా కేవీ పల్లె మండలం క్రాస్ వద్ద గురువారం జరిగిన ఈ ఘోర రోడ్డు ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. కడప జిల్లా రాయచోటి పట్టణానికి చెందిన గుజిరీ వ్యాపారి మామూన్ రషీద్ (68) కొంతకాలంగా మధుమేహంతో బాధపడుతున్నాడు. భార్య నసీబ్‌జాన్ (60), కుమారుడు హారున్ రషీద్ (22), కోడలు ఖదీరున్ (23), మరో కుమారుడు మహమూద్ ఫరీద్ (25) కలిసి ఆయనను కారులో తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ రషీద్‌ను పరీక్షించిన వైద్యులు కాలు తీసేయాలని చెప్పారు. ఆ బాధలోనే వారంతా తిరుగు ప్రయాణమయ్యారు. మధ్యాహ్నం 3:15 గంటలకు చెన్నై-కర్నూలు జాతీయ రహదారిలోని కేవీపల్లె మండలం మహల్ క్రాస్ వద్దకు రాగానే.. రాయచోటి నుంచి పీలేరు వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఎదురు వెళ్తున్న వరికోత యంత్రాన్ని తప్పించబోయాడు. అదే సమయంలో అటువైపు నుంచి ఎదురుగా వస్తున్న కారును ఈ బస్సు బలంగా ఢీకొట్టింది. కారు నుజ్జునుజ్జయి అందులో ప్రయాణిస్తున్న రషీద్, నసీబ్‌జాన్, హారున్ రషీద్, ఖదీరున్ అక్కడికక్కడే మృతిచెందారు. ఫరీద్‌ను రుయా ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయాడు.





ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు. (ఇన్‌సెట్) ప్రమాదానికి కారణమైన బస్సు

### లారీ ఢీకొని ఇద్దరి దుర్మరణం

టేకు దుంగల లోడుతో వస్తున్న టైరు బండిని లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. శ్రీకాకుళం జిల్లా వీరఘట్టం మండలం మరియగిరి సమీపంలో గురువారం తెల్లవారుజామున ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. నెయిగాపుల నాగభూషణం (30), గొట్టాపు పాదాలు (55) టైరు బండిపై టేకు దుంగలు వేసుకుని వెంకంపేట నుంచి వీరఘట్టానికి బయల్దేరారు. ఈ టైరు బండిని వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో టేకు దుంగలు వారిద్దరిపై పడడంతో వారు చనిపోయారు.

# విశాఖ ప్రాజెక్టులకు 'రాజధాని' మేకప్!

- విశాఖలో రేపు సీఎం శంకుస్థాపనలు
- ఏకంగా పది జీవోలు జారీచేసిన ప్రభుత్వం
- నిధుల్లో ఎక్కువ వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీలవే...

విశాఖపట్నం/అమరావతి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ), మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ)లు గతంలో ప్రతిపాదించిన ప్రాజెక్టులకు 'కార్యనిర్వాహక రాజధాని' ట్యాగ్ తగిలించారు. వాటికి సీఎం జగన్ చేతుల మీదుగా శనివారం శంకుస్థాపనలు చేయించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ఆగమేఘాల మీద శుక్రవారం పది జీవోలు కూడా జారీచేశారు. అయితే ఈ ప్రాజెక్టులకు ప్రభుత్వం ఇచ్చే నిధులు చాలా స్వల్పం. అత్యధికంగా వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ ఇప్పటికే సమకూర్చుకుంటున్నాయి. విశాఖ అభివృద్ధికి వైసీపీ కట్టుబడి ఉందని.. కార్యనిర్వాహక రాజధాని ప్రకటించాకే ఈ ప్రాజెక్టులన్నీ వచ్చాయని వైసీపీ నేతలు ఊదరగొడుతున్నారు. శని, ఆదివారాల్లో నగరంలో విశాఖ ఉత్సవ్ నిర్వహిస్తున్నారు. ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి జగన్‌ను ఆహ్వానించారు. ఆ సందర్భంగా ఆయన చేతుల మీదుగా.. జీవీఎంసీ పరిధిలో రూ.900 కోట్ల పనులకు, వీఎంఆర్‌డీఏ పరిధిలో రూ.300 కోట్ల పనులకు శంకుస్థాపనలు జరగనున్నాయి. గురువారం జీవోలిచ్చిన ప్రాజెక్టులు ఇవీ..

- కైలాసగిరిపై రూ.37 కోట్లతో ప్లానిటోరియం నిర్మాణం. నిధులన్నీ వీఎంఆర్‌డీఏనే భరిస్తుంది.
- సిరిపురం జంక్షన్‌లో 1.3 ఎకరాల్లో మల్టీ లెవెల్ కారు పార్కింగ్, బిజినెస్ కాంప్లెక్స్ నిర్మాణం. దీని వ్యయం రూ.80 కోట్లు. ఇందులో వీఎంఆర్‌డీఏ రూ.60 కోట్లు సమకూర్చుతోంది. జీవీఎంసీ స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో రూ.20 కోట్లు ఇవ్వనుంది.
- కాపులుప్పాడలో నేచురల్ హిస్టరీ పార్క్-మ్యూజియాన్ని రూ.88 కోట్లతో నిర్మించనున్నారు. ఇందుకోసం 15 ఎకరాలు కేటాయించారు. వ్యయంలో రూ.50 కోట్లు వీఎంఆర్‌డీఏ సమకూరుస్తుండగా.. రూ.38 కోట్లు కేంద్ర ప్రభుత్వం ఇస్తుంది.
- చుక్కవానిపాలెం నుంచి నాతయ్యపాలెం జంక్షన్ వరకు మాస్టర్ ప్లాన్ రహదారిని రూ.9 కోట్లతో నిర్మించనున్నారు. ఇవన్నీ వీఎంఆర్‌డీఏ నిధులే.
- ఆర్కే బీచ్‌లో ఇంటిగ్రేటెడ్ మ్యూజియం అండ్ టూరిజం కాంప్లెక్స్‌ను రూ.40 కోట్లతో నిర్మిస్తారు. దీనికి రూ.20 కోట్లు స్మార్ట్ సిటీ నిధుల నుంచి, మరో రూ.20 కోట్లు రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ నుంచి ఇస్తారు.
- ఎన్‌హెచ్-16 నుంచి న్యాయ కళాశాల మీదుగా పెద రుషికొండ ఐటీ సెజ్‌కు రూ.7.5 కోట్లతో 4 కిలోమీటర్ల పొడవున మాస్టర్ ప్లాన్ రహదారి నిర్మిస్తారు. ఈ నిధులన్నీ వీఎంఆర్‌డీఏవే.
- కాపులుప్పాడలో బయో మైనింగ్ ప్రాజెక్టును రూ.22.5 కోట్లతో చేపడుతున్నారు. ఇవి జీవీఎంసీ నిధులు.
- రూ.39 కోట్లతో జీవీఎంసీ పరిధిలోని పద్మనాభపురం రిజర్వాయర్ నుంచి హనుమంతువాకలోని కొమ్మాది పైప్‌లైన్‌కు చెందిన ట్యాపింగ్ పాయింట్ వరకు 900 మిల్లీమీటర్ల వ్యాసార్థమున్న మెయిన్ పైపులైన్.
- రూ.45 కోట్లతో అగనంపూడి రిజర్వాయర్ నుంచి నరవ క్లియర్ వాటర్ సంప్‌నకు కే7 పైపులైన్.
- రూ.32.40 కోట్లతో అగనంపూడి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుంచి అనకాపల్లి హెడ్ వాటర్ వర్క్స్‌కు శుద్ధనీటిని సరఫరా చేసే పైపులైన్.

## వీరభద్రుడి భూమి వక్ఫ్‌బోర్డుకా?

- అడ్డుకోవాలంటూ గవర్నర్‌కు కన్నా వినతి

అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కోర్టు తీర్పును కాదని, వీరభద్రుడి భూమిని వక్ఫ్‌బోర్డుకు ఇస్తామంటూ ముఖ్యమంత్రి జగన్ ప్రకటించడం సరికాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సీఎం ప్రకటన అమల్లోకి రాకుండా అడ్డుకోవాలంటూ గురువారం గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌కు విజ్ఞప్తి చేశారు. కడప జిల్లా రాయచోటిలో 18 ఎకరాలకు పైగా ఉన్న వీరభద్రస్వామి భూమిని అక్కడ హైస్కూల్, జూనియర్ కాలేజీ, అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కేంద్రానికి గత ప్రభుత్వాలు కేటాయించాయని కన్నా తెలిపారు. ఆ భూమిలో విద్యాసంస్థలు నడుస్తుండగా, నాలుగు ఎకరాలు వక్ఫ్‌బోర్డుకు ఇస్తానంటూ సీఎం ఎలా ప్రకటిస్తారని కన్నా నిలదీశారు.

## బడేటి బుజ్జి మృతి తీరని లోటు

- పాడె మోసి, అంతిమయాత్రలో పాల్గొన్న బాబు



పాడె మోస్తున్న చంద్రబాబు

ఏలూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు మాజీ ఎమ్మెల్యే బడేటి కోట రామారావు (బుజ్జి) (56) బుధవారం అర్ధరాత్రి తీవ్రమైన గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందారు. బుజ్జి మరణవార్త తెలియగానే రాష్ట్రం నలుమూలల నుంచి టీడీపీ నేతలు ఏలూరు చేరుకున్నారు. 'నిత్యం జనంతో మమేకమై ఉండే నేత. అమరావతిలోనే రాజధాని ఉండాలని రెండు, మూడు రోజులుగా అందరినీ కూడగట్టి, జేఏసీ ఏర్పాటుకు చర్చిస్తూ క్షణం తీరిక లేకుండా ఉన్న బడేటి బుజ్జి ఆకస్మికంగా మృతి చెందడం కలిచివేసింది. మంచి పోరాట పటిమ కలిగిన నేతను కోల్పోయాం' అని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. టీడీపీ ఏలూరు నియోజకవర్గ కార్యాలయంలో బుజ్జి పార్థివదేహాన్ని గురువారం సందర్శించిన చంద్రబాబు.. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. బుజ్జి మృతదేహంపై పార్టీ పతాకాన్ని ఉంచి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు, పార్టీ నేతలు అచ్చెన్నాయుడు, రామానాయుడు, ఎమ్మెల్సీ సత్యనారాయణరాజు, పార్టీ జిల్లా అధ్యక్షురాలు, ఎంపీ సీతారామలక్ష్మి, మాజీ మంత్రులు పుల్లారావు, పితాని సత్యనారాయణ, పీతల సుజాత, కెఎస్ జవహర్, మాగంటి బాబు, మాజీ జడ్పీచైర్మన్ బాపిరాజు, జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు నివాళులర్పించారు.

## వికృతమాల భూములపై నివేదిక ఇవ్వండి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- ఏర్పేడు తహసీల్దార్‌కు డీఆర్వో ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 26: రేణిగుంట విమానాశ్రయం పక్కనే వికృతమాలలోని రూ.225 కోట్ల విలువైన భూమి వ్యవహారాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో ప్రభుత్వం స్పందించింది. బుధవారం 'వద్దన్నా వినరే!', గురువారం 'బ్లేడుతో చెరిపేశారు' శీర్షికలతో వరుస కథనాలు ప్రచురితమవ్వడంతో ఈ భూ వివాదంపై వెంటనే నివేదిక ఇవ్వాలని ఏర్పేడు తహసీల్దార్‌కు గురువారం జిల్లా రెవెన్యూ అధికారి ఎల్.విజయ్‌చందర్ ఆదేశాలిచ్చారు. ప్రస్తుతం దీనిపై కలెక్టరేట్, రెవెన్యూవర్గాల్లో చర్చ జరుగుతోంది.

## డీఆర్డీవో చైర్మన్ సతీష్‌రెడ్డికి మాతృవియోగం

ఆత్మకూరు, డిసెంబరు 26: డీఆర్డీవో చైర్మన్ గుండ్రా సతీష్‌రెడ్డి తల్లి రంగమ్మ అనారోగ్యంతో గురువారం నెల్లూరులో కన్నుమూశారు. ఆమె పార్థివదేహాన్ని స్వస్థలం ఆత్మకూరు మండలం మహిమలూరుకు తరలించారు. శుక్రవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

## టీడీపీకి రెహమాన్ రాజీనామా

విశాఖపట్నం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ విశాఖ అర్బన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఏ రెహమాన్ తన పదవికి, పార్టీకి గురువారం రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుకు గురువారం ఆయన లేఖ పంపారు. అనంతరం ఆ వివరాలను విలేకరులకు వివరించారు. పౌరసత్వ సవరణ చట్టం, జాతీయ పౌర పట్టికలపై టీడీపీ అనుసరిస్తున్న విధానం ముస్లింల మనోభావాలను దెబ్బతీసిందని ఆరోపించారు. దీంతోపాటు విశాఖలో కార్యనిర్వాహక రాజధాని ఏర్పాటును వ్యతిరేకించాలని పార్టీ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీలో కొనసాగలేక రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు. కాగా, టీడీపీ విశాఖ అర్బన్ జిల్లా అధ్యక్షుడిగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్‌ను పార్టీ నియమించింది. ఈ మేరకు అధిష్ఠానం గురువారం ఉత్తర్వులు జారీచేసింది.

# మాతృభాష మాధుర్యమే వేరు

- తెలుగుభాష కళ్లు..ఆంగ్లం జోడు కళ్లుంటేనే కదా జోడు అవసరం
- నా వ్యాఖ్యలను వివాదం చేయొచ్చు కానీ అంతటా తెలుగు పెరగాలి
- పల్లెలకూ ప్రైవేటు వైద్యం చేరాలి
- డెల్టా హాస్పిటల్స్ ప్రారంభ సభలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



సభలో మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు

రాజమహేంద్రవరం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): "మాతృభాష మాధుర్యమే వేరు. ఏ ప్రాంతవాసులైనా తమ భాషను కొనసాగించాలి. బ్రిటిష్‌వాళ్లు మన దేశానికి వచ్చి మనతో మాట్లాడడానికి మన భాష నేర్చుకోకుండా వాళ్ల భాషనే మనకు నేర్పారు. మన భాషను బలహీనపరిచారు" అని ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. ఇంగ్లీషును ప్రోత్సహించడంతో పాటు మాతృభాషాభిమానాన్నీ కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో గురువారం ఆయన డెల్టా హాస్పిటల్స్‌ను ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. "ఇవాళ ఇంగ్లీషుపై మోజు పెరిగింది. ప్రజల్లోనే కాదు, ప్రభుత్వం కూడా ఇంగ్లీషు లేకపోతే పైకి పోలేమని భావిస్తోంది" అని అన్నారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నారని, ప్రధాన మంత్రి మోదీ కాన్వెంట్‌ను చూడలేదని వివరించారు. శ్రమ, సాధన, అంకితభావంతోనే ఎవరైనా ఎదగగలరని ఆయన తెలిపారు. "ఇంగ్లీషు నేర్చుకోవాల్సిందే. కానీ జనం భాష అవసరం. మాతృభాష కళ్లు లాంటిది. పరాయి భాష కళ్లద్దాల్లాంటిది. కళ్లుంటేనే కళ్లద్దాలతో చూడగలుగుతాం. కళ్లు లేకపోతే రేబాన్ జోడు పెట్టుకున్నా చూడలేం" అని వ్యాఖ్యానించారు. ఏ రాష్ట్రంలోనైనా మాతృభాషే నేర్చుకోవాలన్నారు. "ఇంగ్లీషు అవసరం అనడం వల్ల ప్రభుత్వాన్ని తప్పు పట్టకూడదు. కానీ మన రాష్ట్రం భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన సంగతి మర్చిపోకూడదు" అని అన్నారు. తన మాటలను వివాదం చేసే ప్రయత్నం చేయవచ్చుగానీ, దేశం కోసం, దేశ ప్రజల కోసం మాతృభాషను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆయన ఉద్బోధించారు.

### నీరుతో నిరుపేదరికం దూరం

"గోదావరి నదీమతల్లిని చూస్తే మనస్సు ప్రశాంతమైంది. ఈ నదిని, గోదావరి జిల్లాను చూసినప్పుడు మాజీ ప్రధాని వాజ్‌పేయి నదుల అనుసంధానం కోసం చేసిన ప్రయత్నం గుర్తొచ్చింది. అన్ని రాష్ట్రాలు కలసికట్టుగా ఉండి ఈ విధానాన్ని ముందుకు తీసుకువెళ్లాలి. నీటిని సద్వినియోగం చేసుకుంటే పేదరికం ఉండదు. ప్రకాశం, నెల్లూరు, రాయలసీమకు కూడా నీరందిస్తానని ముఖ్యమంత్రి చెబుతున్నారు. చాలా సంతోషం. ఆ విధానాన్ని ప్రోత్సహించాలి."

### అలా అయితేనే 'ఫిట్'

"నేను రాజకీయం నుంచి పక్కకు వచ్చిన తరువాత పుస్తకాలు చదవడం మొదలుపెట్టాను. అసంక్రమిత వ్యాధులు బాగా పెరిగాయి. ప్రధాని 'ఫిట్ ఇండియా' నినాదాన్ని అందరూ పాటించాలి. మనిషి ఎక్కడా శ్రమించడం లేదు. దాని వల్ల జీవనశైలి మారి.. జబ్బులొస్తున్నాయి. ప్రతి మనిషి ఆరోగ్యం కోసం యోగా చేయాలి."

### తాకితేనే రోగికి స్వాంతన

"భారతదేశంలో 130 కోట్ల మంది జనాభా ఉన్నారు. వారిలో 20 శాతం మంది ఇంకా పేదరికంలోనే ఉన్నారు. వారందరికీ సకాలంలో వైద్యం అందించాలి. ఆస్పత్రికి వచ్చిన వారిని ఆరోగ్యంగా ఇంటికి పంపించాలి. ఇటీవల డాక్టర్లు ఎవరూ తాకడం లేదు. కనీసం చెయ్యి పట్టుకుని చూసి మాట్లాడితేనే రోగికి స్వాంతన దొరుకుతుంది."

### సమస్యలను ప్రభుత్వం పెంచొద్దు

"దేశం ఆర్థికంగా ముందుకు పోతోంది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వచ్చింది. మన సంస్కృతి, సినిమా, సంస్కరణల వల్ల గుర్తింపు వచ్చింది. ఇది ప్రధాని చేసిన సంస్కరణల వల్లే సాధ్యమైంది. ప్రభుత్వం అనవసరమైన సమస్యలు సృష్టించకూడదు. సమస్యలను తగ్గించగలగాలి." అని వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
**కమిషనర్ ప్రింటింగ్, స్టేషనరీ మరియు స్టోర్స్ శాఖ**
నెం.4/హెచ్/2019-20 ఇ-టెండరు ప్రకటన తేది: 24.12.2019
ప్రభుత్వ ముద్రణ, స్టేషనరీ అండ్ స్టోర్స్ పర్చేస్ డిపార్ట్‌మెంట్, విజయవాడ వారు మార్చి-2020 సంవత్సరంకు సంబంధించిన యస్.యస్.సి. ఆన్సర్ షీట్ పేపర్-2020, ప్రింటింగ్ పనులు చేపట్టుటకు మిల్స్/డిస్ట్రిబ్యూటర్ల నుండి వైట్ మ్యాప్ లితో రీల్ పేపర్ 60 జి.ఎస్.యం/61 సి.యం.ఎస్., వైట్ మ్యాప్‌లితో షీట్ పేపర్ 18 x 23 సైజు 60 జి.ఎస్.యం మరియు ప్రింటింగ్‌కు సంబంధించిన మెటీరియల్‌కు ఆన్‌లైన్ ద్వారా టెండర్లు కోరబడుచున్నది. టెండరు షెడ్యూల్ 27.12.2019 నుండి 7.1.2020 వరకు లభించును. టెండర్లు స్వీకరణకు ఆఖరి తేది: 7.1.2020 సా. 4.00 గం. వరకు. టెండర్లు తెరుచు తేది: 8.1.2020 ఉ. 11.00 గం. తదుపరి వివరాలకు ఈ కార్యాలయము నందు సంప్రదించగలరు.
సం/- డిజిపి మరియు కమిషనర్
DIPR RO No.1423/CL/ADVT/1/1/2019-20, తేది:26.12.2019

**దక్షిణ మధ్య రైల్వే**
Follow us on @SCRailwayindia ద.మ. రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును
**డాక్టర్ల నుండి దరఖాస్తులకు ఆహ్వానం**
చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్, రైల్వే హాస్పిటల్, విజయవాడ వారు అనస్థీషియా, అప్తమాలజీ, జనరల్ సర్జరీ, లాప్రోస్కోపిక్ సర్జరీ, యూరాలజీ, అంకో సర్జరీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ సర్జరీ, ఆర్థోపెడిక్స్, గైనకాలజీ, న్యూరాలజీ, పెడియాట్రిక్స్ ENT, రెటీన స్పెషలిస్ట్, డెర్మటాలజిస్ట్, డెంటల్ మరియు సైకియాట్రిస్ట్ వగైరా స్పెషాలిటీలలో ప్రొఫెషనల్ సర్వీసులు ఏర్పాటు కొరకు కేసు టు కేస్ ప్రాతిపదికపై గౌరవనీయ కన్సల్టెంట్స్ పనికి విజయవాడ నగరం వద్ద నివాసులైన డాక్టర్ల నుండి మాత్రమే 17-01-2020న లేదా అలోగా దరఖాస్తులు కోరబడుచున్నవి.
CMS/రైల్వే హాస్పిటల్ విజయవాడ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ కొరకు చివరి తేది 17-01-2020న 15.00 గం. వరకు ఉంటుంది.
చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్, రైల్వే హాస్పిటల్, విజయవాడ
**ఆసక్తి వ్యక్తీకరణ**
చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్, రైల్వే హాస్పిటల్, విజయవాడ వారు దిగువ స్పెషాలిటీల కోసం చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్, రైల్వే హాస్పిటల్, విజయవాడ కార్యాలయంలో 17-01-2020న లేదా అలోగా 15.00 గం.వరకు. వివిధ డయాగ్నోస్టిక్ సెంటర్లు మరియు హాస్పిటల్స్ నుండి దరఖాస్తులు కోరబడుచున్నారు.
రైల్వే హాస్పిటల్, దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ వారు సిటీ/సమీప సిటీ కొరకు CGHS 2014 non NABH/NABL/HYB రేట్ల జాబితాపై రైల్వే రోగులకు ఇన్వెస్టిగేటివ్ సదుపాయాలు పొడిగింపు కొరకు వివిధ డయాగ్నోస్టిక్ కేంద్రాలు మరియు ఆసుపత్రుల నుండి EOI కోరుచున్నారు. సదరు CGHS రేట్లు దిగువ ఇన్వెస్టిగేషన్లు కొరకు లభిస్తాయి.

| 1. CT స్కాన్ | 2. MRI స్కాన్ | 3. న్యూక్లియర్ మెడిసిన్ | 4. USG | 5. "A" స్కాన్ | 6. ల్యాబ్ ఇన్వెస్టిగేషన్లు మరియు వగైరా |
|---|---|---|---|---|---|

CMS/BZA కార్యాలయంలో దరఖాస్తు స్వీకరణకు ఆఖరి తేది: 17.01.2020న 15.00 గం.వరకు.
A2054 చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్, రైల్వే హాస్పిటల్, విజయవాడ

తెలివిగా ఉండండి - క్రొత్తగా ప్రారంభించండి
చివరి గంట వరకు వేచి చూడడం ఎందుకు?
ఈ అవకాశం మీరు వదులుకొన్నచో - మరలా ఇలాంటి అవకాశాన్ని పొందలేరు.



త్వరపడండి, పథక చెల్లుబాటు
31 డిసెంబర్ 2019 వరకు మాత్రమే

SABKA VISHWAS (Legacy Dispute Resolution) SCHEME, 2019
For Service Tax and Central Excise
Make a New Beginning!

సేవా పన్ను & సెంట్రల్ ఎక్సైజ్ వివాద తీర్మానానికి ఏకైక పరిష్కారం

పథకం క్రింద ప్రయోజనాలు

వడ్డీ & అపరాధ రుసుం మొత్తంగా మాఫీ | అభియోగం నుండి విముక్తి

నోటీసు, అప్పీల్, ఎంక్వైరీ, ఇన్వెస్టిగేషన్ మరియు ఆడిట్‌లో అపరిష్కృతంగా ఉన్న కేసులు
ఎ) రూ.50 లక్షల వరకు పన్ను : పన్నులో కేవలం 30 శాతం మాత్రమే చెల్లించాలి
బి) రూ.50 లక్షల కన్నా ఎక్కువ పన్ను : పన్నులో కేవలం 50 శాతం మాత్రమే చెల్లించాలి

పాత బకాయిల విషయంలో:
ఎ) రూ. 50 లక్షల వరకు పన్ను : పన్నులో కేవలం 40 శాతం మాత్రమే చెల్లించాలి
బి) రూ.50 లక్షల కన్నా ఎక్కువ పన్ను : పన్నులో కేవలం 60 శాతం మాత్రమే చెల్లించాలి

మీరు స్వచ్ఛందంగా గతంలోని పన్నులను ప్రకటించినప్పుడు బకాయి మొత్తాన్ని మాత్రమే చెల్లించవచ్చు

ఆర్థిక మంత్రిత్వ శాఖ
భారత ప్రభుత్వం
పథక వివరాలకు దర్శించండి : www.cbic-gst.gov.in
www.cbic.gov.in
davp 15502/13/0016/1920

వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం ఆర్మీచీఫ్ బిపిన్ రావత్‌కు కొత్తేమీ కాదు. రాజకీయపెద్దల మనసెరిగి మాట్లాడే ఈయన ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసి ప్రత్యక్షంగా ప్రజా ఉద్యమాలమీదే పడ్డారు. కొత్త పౌరసత్వ సవరణ, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సాగుతున్న నిరసనలను తీవ్రంగా తప్పుబట్టారు. యూనివర్సిటీల్లోనూ, కాలేజీల్లోనూ జరుగుతున్న ఉద్యమాలు తప్పుదోవన సాగుతున్నాయన్నారు. ఆస్తుల్ని ధ్వంసం చేస్తూ, తగులబెడుతూ ఉద్యమాలు చేయడమేమిటి, నిరసనలు పక్కదోవలు పట్టిస్తున్నవారిని నాయకులని ఎలా అంటామంటూ దుమ్మెత్తిపోశారు. రాజకీయపార్టీలపైనే కాక మేధావి వర్గం మీద కూడా మండిపడ్డారు. స్వెట్టర్లు, టోపీలు ధరించి వచ్చి ధర్నాలు చేస్తున్న వారిని చూస్తుంటే ఆయనకు గడ్డకట్టుకొనిపోయే చలిలో సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న సైనికులు గుర్తుకొస్తున్నారట. రావత్ ఇంకా ఏమన్నారన్నది అటుంచితే, అచ్చం నరేంద్రమోదీ, అమిత్ షాల మాటలే ఈయన నోటా వినపడటం విశేషం.

రావత్ కాబోయే త్రివిధ దళాధిపతి (సీడీఎస్) అంటూ వార్తలు గుప్పుమంటున్నాయి. ఇందుకు ఆయన అర్హుడేనా అంటూ సాగుతున్న విస్తృత చర్చను అటుంచితే, ఇంతటి విధేయుడు మాత్రం మన పాలకులకు మరొకరు దొరకకపోవచ్చు. ప్రభుత్వ పెద్దల ఆదేశాలకు లోబడి దేశరక్షణకు, ప్రజారక్షణకు రంగంలోకి దిగే సైనికాధిపతులను చూశాం కానీ, అవే చిలుకపలుకులు వల్లించేవారు దొరకడం అరుదు. సైన్యంలో పనిచేస్తున్నవారు ఇలా మాట్లాడటమేమిటని మాజీ నౌకాదళాధిపతి అడ్మిరల్ రామ్‌దాస్ వంటి పాతతరం పెద్దలు ఆశ్చర్యపోతున్నారు. సైనికుడు దేశానికి సేవచేయాలి కానీ, రాజకీయ పెద్దలకు కాదని హితవు చెబుతున్నారు. మరికొందరు ఆర్మీచట్టంలోని సెక్షన్ 21 రాజకీయాంశాల జోలికి పోవద్దంటూ ఏయే నిబంధనలు విధించిందో వివరిస్తున్నారు. రాజ్యాంగం విధించిన పరిమితులను రావత్ అతిక్రమించారని రాజకీయపార్టీలు ఆగ్రహిస్తున్నాయి. ప్రజా ఉద్యమాలను అగౌరవపరచిన ఆయన క్షమాపణ చెప్పాలని కొందరు అంటే, మరికొందరికి అచ్చం పాకిస్థాన్ వాతావరణమే ఇక్కడా కనిపిస్తున్నది. నేడు ఇలా గీతదాటనిస్తే, రేపు ఆర్మీ

## రక్షణ–రాజకీయం

మరో అడుగుముందుకేసి రాజకీయాధికారం కూడా తమదేనంటుందని మరికొందరు హెచ్చరించారు. సైన్యంలో ఈ స్థాయికి ఎదిగొచ్చిన రావత్‌కు ఈ పరిమితులు, నిబంధనలు తెలియనివేమీ కావు. తనకు దక్కబోతున్న కొత్తపదవికి మరొకరో ఇద్దరో పోటీలో ఉన్నా, ఈ తరహా వ్యాఖ్యలతో ఎంతమంది పోటీదారులనైనా పక్కకు నెట్టేయగల సమర్థుడు ఆయన. నిరసనలన్నీ హింసాయుతంగానే సాగాయన్నట్టుగా వ్యాఖ్యానించడాన్ని బట్టే ఆయనకు క్షేత్రస్థాయి వాస్తవాలతో నిమిత్తం లేదని అర్థం.

తనవారిని సరైనదిశలో నడిపించేవాడే నాయకుడంటున్న ఈయన రేపు త్రివిధ దళాధిపతి (చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్) అయితే, మూడింటినీ ఇదే తోవలోకి తెచ్చేస్తారేమోనని అనుమానం కలుగుతున్నది. స్వాతంత్ర్యదినోత్సవ ప్రసంగంలో సీడీఎస్ నియామకం గురించి మోదీ చెప్పినప్పుడు దేశం యావత్తూ ఘనంగా స్వాగతించింది. సైన్యం, నావికాదళం, వైమానికదళాలకు ఒక పర్యవేక్షక పెద్దగా ఉంటూ, ఈ మూడు బలాల అవసరాలను గుర్తిస్తూ, వాటి మెరుగుదలకు ప్రణాళికలు రచిస్తూ ప్రభుత్వ పెద్దలకు నేరుగా అందుబాటులో ఉండే స్థానం ఇది. నెహ్రూకాలం నుంచి అనుకుంటూ అనేక అంతర్గత వైరాలు, సమస్యల కారణంగా వాయిదాపడుతూ వచ్చిన కీలకమైన అంశమిది. 1962 చైనా యుద్ధం సహా కొన్ని యుద్ధాలు సీడీఎస్ లేని లోటు తెలియచెప్పినా గత పాలకులు ధైర్యం చేయలేకపోయారు. యుద్ధరీతులు పూర్తిగా మారిపోయి, మూడింటినీ సమన్వయం చేస్తూ నిర్ణయీకరణ స్థానంలో ఒకరు ఉండవలసిన అవసరం మరింత హెచ్చిన కాలంలో మోదీ తీసుకున్న ఈ సాహసోపేతమైన నిర్ణయాన్ని అభినందించవలసిందే. సీడీఎస్ నాయకత్వంలో త్రివిధ దళాల ప్రక్షాళన, పునర్వ్యవస్థీకరణ, ఆధునీకరణ జరుగుతుందని దేశం ఆశిస్తున్నది. దేశం శత్రుదుర్భేద్యమయ్యే దిశగా అడుగులు పడుతున్నందుకు సంతోషిస్తున్నది. ఇంతటి కీలకస్థానంలో ఉన్న వ్యక్తి సమర్థుడు కావడంతో పాటు దేశప్రయోజనాలకే అగ్రప్రాధాన్యం ఇవ్వవలసి ఉంటుంది. బంగ్లాదేశ్ విముక్తి సమరానికి సిద్ధం కమ్మంటూ జనరల్ మానెక్ షాను అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ ఆదేశిస్తే, ఆమెకు ఆగ్రహం కలిగినప్పటికీ, ఇప్పట్లో వీలుపడదంటూ మరిన్ని నెలల తరువాతే ఆయన యుద్ధానికి తరలిన విషయాన్ని దేశం ఇప్పటికీ గుర్తుచేసుకుంటున్నది. సీడీఎస్‌గా ఎవరున్నప్పటికీ రాజకీయపెద్దల అభీష్టాలు, మనోభిప్రాయాలకు తలూపడం కాక, దేశ శ్రేయస్సుకు అనుగుణంగా స్వతంత్రంగా వ్యవహరించడం అవసరం.

## గదర్ వీరుడు, సంఘ సంస్కర్త

ప్రముఖ విప్లవకారుడు, ఉత్తమ దేశభక్తుడు, కుల నిర్మూలనా ఉద్యమకారుడు, సంఘ సంస్కర్త, దక్షిణ భారత తొలి రాజకీయ డిటెన్యూ దర్శి చెంచయ్య. సామాన్య ఆర్యవైశ్య కుటుంబంలో 1890 డిసెంబరు 28న ప్రకాశం జిల్లా కనిగిరిలో జన్మించారు. చిన్నతనంలోనే వీరేశలింగం పంతులు ప్రభావంతో మూఢనమ్మకాలపై ధిక్కారస్వరం వినిపించారు. ఆ రోజులలో ఆర్యవైశ్య విద్యార్థులు కామర్స్ తదితర అంశాలపై చదివేవారు. కానీ, చెంచయ్య కనిగిరి ప్రాంతాన్ని పాడిపంటలతో సస్యశ్యామలం చేయాలని సంకల్పించాడు. వ్యవసాయశాస్త్రాన్ని ఎంచుకుని, ఉన్నత విద్యాభ్యాసం కోసం 1912లో అమెరికా వెళ్ళారు. అక్కడ చదువుకుంటూనే 'గదర్ విప్లవోద్యమం' పార్టీలో వ్యవస్థాపక సభ్యులుగా చేరి ఉద్యమం చేస్తూనే, బి.ఎస్సీ. చదివారు. సాయుధ పోరాటం ద్వారా వలస పాలకులైన బ్రిటిషు వారిని భారత్ నుంచి పారదోలాలని తలంచారు. పాతికేళ్ళ వయస్సులోనే తాను సేకరించిన ఆయుధాలతో అమెరికా నుండి ఓడలో బయలుదేరాడు. కెనడాకు వెళ్ళి అక్కడ నుండి ఫిలిఫైన్స్, బ్యాంకాక్, జపాన్ తీరాల వెబడి పయనిస్తూ బ్రిటన్ నిఘావర్గాల వారికి పట్టుబడి చిత్రహింసలకు గురైనారు. ఆయనపై పెట్టిన ఏ కుట్ర కేసునూ నిరూపించలేని బ్రిటిషర్లు 'డిటెన్యూ'గా విడుదలచేసారు. దానితో దక్షిణ భారతావనిలో తొలి రాజకీయ డిటెన్యూగా దర్శి చెంచయ్య రికార్డులకెక్కారు. స్వాతంత్ర వచ్చాక ఎంతోమందిలా పదవులకోసం వెంపర్లాడలేదు. పతిత జనోద్ధరణకు, వేశ్యావృత్తి నిర్మూలన, స్త్రీ విద్యావ్యాప్తికి ఎనలేని కృషిచేసారు. వితంతు శరణాలయాలు స్థాపించారు. కార్మిక శ్రేయస్సుకు పాటుపడ్డారు. సమాజ సేవకై జీవితాన్నే హారతిపట్టిన స్వాతంత్ర్య సమర సేనాని చెంచయ్య. తన ధైర్యసాహసాలతో బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన ఈ విప్లవమూర్తి జయంతిని దేశం నలు చెరగులా ఘనంగా నిర్వహించాలి.



■ డా. శ్రీనివాస్, బాపట్ల

(డిసెంబర్ 28న దర్శి చెంచయ్య జయంతి)

# జార్ఖండ్.. మోదీ శకాంతం కాదు



■ యోగేంద్ర యాదవ్

జార్ఖండ్ ఎన్నికల పాఠాలు నేర్పుతున్నది ఏమిటి? ఎన్నికలను ఎదుర్కోవడంలోనే పాలక భారతీయ జనతా పార్టీ తప్పు చేయగా, ఎన్నికల ఫలితాలను అర్థం చేసుకోవడంలో ప్రతిపక్షాలు పొరపడుతున్నాయని చెప్పక తప్పదు. ఈ రెండు అంశాలను నిశితంగా పరిశీలించవలసిన అవసరం ఎంతైనా వున్నది.

2019 సార్వత్రిక ఎన్నికలలో తమకు లభించిన ఘన విజయం శాసన సభ ఎన్నికల్లో కూడా తిరుగులేని విజయానికి ఖాయంగా దోహదం చేస్తుందని బీజేపీ శ్రేణులు భావించాయి. కాదు, విశ్వసించాయి. ఇది ఆ పార్టీలో ఒక విధమైన దురహంకార ధోరణికి, ఒక నిర్లక్ష్య వైఖరికి దారి తీసింది. ఫలితమే మిత్రపక్షాలు దూరమవ్వడం, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో దిగ్భ్రాంతికర పరాజయం. బీజేపీ అపజయాన్ని బీజేపీయేతర పార్టీలు తప్పుగా అర్థం చేసుకొంటున్నాయి. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ ఓటమి, అంతిమంగా, తదుపరి సార్వత్రిక ఎన్నికలలో ఆ పార్టీ పరాజయం పాలు కావడానికి దారి తీస్తుందని అవి భావిస్తున్నాయి. ప్రతిపక్షాలను సంతృప్తి పరుస్తున్న ఈ భావన అంతిమంగా వాటికి హానికరంగా పరిణమిస్తుంది. బీజేపీయేతర పక్షాల భవిష్యత్తును అనివార్యంగా దెబ్బతీస్తుంది.

2019 లోక్‌సభ ఎన్నికలలో బ్రహ్మాండమైన విజయం సాధించిన బీజేపీ సహజంగానే భావి శాసనసభ ఎన్నికలలో తమకు ఏ విధంగానూ ఢోకా వుండబోదని విశ్వసించింది. తమ విజయ ప్రస్థానం అప్రతిహతంగా సాగిపోగలదని భావించింది. అయితే జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలలో ఆ పార్టీ కంగుతిన్నది. అయినప్పటికీ బీజేపీకి లభించిన ఓట్లు మరే ఇతర ప్రతిపక్షం కంటే అధికంగా వుండడం గమనార్హం. కేంద్రంలోని పాలక ఎన్డీఏ కూటమికి నేతృత్వం వహిస్తున్న బీజేపీ 2019 లోక్‌సభ ఎన్నికలలో సొంతంగా 303 స్థానాలను గెలుచుకున్నది. సార్వత్రిక ఎన్నికలలో ఇంతగా ఘన విజయం సాధించిన పార్టీకి, దరిమిలా ఆరు నెలల్లో జరిగే శాసనసభా ఎన్నికలలోనూ గెలుపు సుసాధ్యమన్నది ఒక నిర్ధారిత వాస్తవం. 2014 సార్వత్రిక ఎన్నికలలో నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ చరిత్రాత్మక విజయం సాధించిన అనంతరం జరిగిన శాసనసభ ఎన్నికలు ఆ సత్యాన్నే ధ్రువీకరించాయని మరి చెప్పనవసరం లేదు.

అయితే, 2019లో పరిస్థితులు మారిపోయాయి. ఒక స్పష్టమైన మార్పు, గత వేసవిలో లోక్‌సభ ఎన్నికలతో పాటు జరిగిన ఒడిషా శాసనసభా ఎన్నికలలోనే, కన్పించింది. ఆ లోక్‌సభ ఎన్నికలలో ఒడిషాలోని 21 నియోజక వర్గాలలో బీజేపీ ఎనిమిది స్థానాలను గెలుచుకున్నది. మరి, ఆ సార్వత్రిక ఎన్నికలతో పాటు ఏక కాలంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజూ జనతాదళ్ 147 నియోజక వర్గాలలో 113ను కైవసం చేసుకున్నది. బిజూ జనతాదళ్ అసాధారణ విజయం సాధించినప్పటికీ అది ఆ పార్టీకి యాదృచ్ఛికంగా లభించిన విజయంగా పరిశీలకులు భావించారు. అయితే మహారాష్ట్ర, హర్యానా శాసనసభ ఎన్నికల ఫలితాలు అటువంటి విజయాలను ఒక సరికొత్త ధోరణి(కేంద్రంలోని పాలక పార్టీకి పరాజయాన్ని ప్రాప్తింపచేయడం)గా ఖాయపరిచాయి. లోక్‌సభ ఎన్నికలలో ఘన విజయం అనంతరం జరిగిన ఆ రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలోనూ బీజేపీకి లభించిన సీట్లు, ఓట్లు గణనీయంగా తగ్గిపోయాయి. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు ఆ కొత్త ధోరణిని ధ్రువీకరించాయి. నిజానికి 2019 సార్వత్రిక పోరుకు ముందు తొలుత గుజరాత్, కర్ణాటక; ఆ తరువాత తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ శాసన సభలకు జరిగిన ఎన్నికల ఫలితాలు కూడా ఆ తరహాలోనే వున్నాయన్నది విస్మరించలేని సత్యం.

జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ కోల్పోయిన ఓట్ల శాతం, గత అసెంబ్లీ ఎన్నికలలో సాధించుకున్న ఓట్ల శాతంతో పోలిస్తే గణనీయంగా తగ్గ లేదు కానీ లోక్‌సభ ఎన్నికల నాటికీ, శాసనసభా ఎన్నికల నాటికీ వాటి తగ్గుదల ఆశ్చర్యజనకంగా వున్నది. జార్ఖండ్ ఓటర్లపై ఈ సారి మోదీ మ్యాజిక్ పని చేయలేదన్నది స్పష్టం. రాష్ట్ర ప్రభుత్వ పాలనా వైఫల్యాలపై ఓటర్లలో తీవ్ర అసంతృప్తి ఉన్నదని గ్రహించిన బీజేపీ, స్థానిక సమస్యలకుగాక కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి రద్దు, రామ జన్మభూమి, జాతీయ పౌర జాబితా, పౌరసత్వ సవరణ చట్టం మొదలైన జాతీయ అంశాలకు విశేష ప్రాధాన్యమిచ్చింది. జాతీయవాద భావోద్వేగాలను రెచ్చగొట్టింది. అయినప్పటికీ బీజేపీ అధికారాన్ని నిలబెట్టుకోవడంలో విఫలమయింది. జార్ఖండ్ ఎన్నికలు స్పష్టం చేసిన కఠోర వాస్తవాల నుంచి బీజేపీ తగు గుణపాఠాలు నేర్చుకోవల్సిన అవసరం ఎంతైనా వున్నది. ఆ పార్టీ ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల పరీక్ష నెదుర్కోవల్సి వచ్చిన ప్రతిసారీ ప్రజల ఆమోదాన్ని పొందలేకపోతున్నాయి. అధికారాన్ని మళ్ళీ కైవసం చేసుకోలేక పోతున్నాయి. ఇప్పుడు అధికారంలో వున్న ఉత్తర ప్రదేశ్‌లో ప్రబలంగా వున్న ప్రభుత్వ వ్యతిరేకతను సమర్థంగా ఎదుర్కొనేందుకు బీజేపీ కొత్త ఆలోచనలు చేయవలసిన అవసరం ఎంతైనా వున్నది. అలాగే ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో అధికారంలో వున్న శక్తిమంతమైన ప్రత్యర్థులను ఢీ కొనడంలో కూడా బీజేపీ ఏ మాత్రం అజాగ్రత్త వహించకూడదు.




జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ ఓటమి, అంతిమంగా, తదుపరి సార్వత్రిక ఎన్నికలలో ఆ పార్టీ పరాజయంపాలు కావడానికి దారి తీస్తుందని బీజేపీయేతర పార్టీలు భావిస్తున్నాయి. వాస్తవమేమిటంటే జాతీయ రాజకీయాలలో మోదీ ప్రభుత్వాన్ని సమర్థంగా ఎదుర్కోవడానికి రాష్ట్ర స్థాయి ఎన్నికల పోరాటాలలో విజయాలు సరిపోవు. అవి ఏవిధంగాను ప్రత్యామ్నాయ ఫలితాలకు దోహదకారులు కాబోవు.

సరే, జార్ఖండ్ ఓటర్ల తీర్పుకు తక్షణ ప్రతిస్పందనలను నిశితంగా పరిశీలిస్తే బీజేపీ వ్యతిరేక పార్టీలూ తప్పు చేస్తున్నాయని, పాలక పక్షం చేసిన తప్పునకు అది పూర్తిగా విరుద్ధమైన తప్పు అని విశదమవుతున్నది. జార్ఖండ్‌లో బీజేపీ ఓటమి దేశ పాలనలో మోదీ శకం అంతానికి ఆరంభమని ప్రతిపక్ష నాయకులు, మీడియా మేధావులు పలువురు వ్యాఖ్యానించారు. మోదీ ప్రభుత్వ ఆర్థిక విధానాలు, మతతత్వ ఎజెండా, ఇంకా జాతీయ పౌరపట్టిక మొదలైన వాటిపై ప్రజలలో నెలకొన్న అసంతృప్తికి జార్ఖండ్ ఎన్నికల ఫలితాలు అద్దం పట్టాయని పలువురు రాజకీయ నాయకులు గట్టిగా అభిప్రాయపడ్డారు. ఇంతకంటే సత్యదూరమైన విషయం మరొకటి ఉండబోదేమో?!

పార్లమెంటులో పౌరసత్వ సవరణ చట్టంపై జరిగిన చర్చల విషయంలో జార్ఖండ్ గ్రామీణ ఓటర్లు తీవ్రంగా ప్రతిస్పందించడం వల్లే బీజేపీ ఓడిపోయిందని భావించడంలో హేతుబద్ధత ఏమీ లేదు. అది పూర్తిగా ఒక భ్రమాపూరిత భావనే. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ప్రజాదరణ తగ్గిపోయిందని, ఆయన వ్యక్తిగత ఆకర్షణశక్తి గతంలో వలే ప్రభావాన్ని చూపించడం లేదని భావించడం పూర్తిగా అసమంజసం. అలాగే కశ్మీర్ మొదలైన వ్యవహారాలలో ఆయన అమలుపరిచిన విధానాలను ప్రజలు ఎంత మాత్రం ఆమోదించడం లేదనుకోవడం కూడా ఏమాత్రం సరి కాదు. అలాంటి భావనలు రాజకీయంగా ఆత్మహత్యా సదృశమైనవి. పైగా ప్రతిపక్షాలలో ఒక స్తబ్ధతను నెలకొల్పుతాయి. స్తబ్ధతలో పడిన రాజకీయ పక్షాలు తమకు వాటిల్లనున్న ప్రమాదాన్ని గ్రహించగలుగుతాయా? ఇటువంటి పరిస్థితినే రాజనీతి శాస్త్రవేత్తలు 'టిక్కెట్ స్ప్లిట్టింగ్' (పార్లమెంటుకు, శాసనసభకు ఒకే సారి ఎన్నికలు జరిగినప్పుడు ఓటర్లు భిన్న రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థుల వైపు మొగ్గడాన్ని సూచించే పదమిది)అన్నారు. ఇది ఓటర్ల పరిపక్వతను తెలుపుతుంది. స్వతంత్ర భారతదేశ మొదటి రెండు దశాబ్దాల పాటు ఓటర్లు లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలలో ఒకే పార్టీకి అనుకూలంగా తీర్పు ఇచ్చేవారు. ఆ తరువాత రెండు దశాబ్దాలలో (1970లు, 1980లు) అసెంబ్లీ ఎన్నికలలో తాము తమ ప్రధానమంత్రిని ఎంపిక చేసుకొంటున్న రీతిలో ఓటు వేశారు. 1990 దశకంలోనూ, కొత్త శతాబ్దం తొలి దశాబ్దంలోనూ ఈ ధోరణి తలకిందులయింది. లోక్‌సభ ఎన్నికలలో, తమ ముఖ్యమంత్రిని ఎంపిక చేసుకొంటున్న తీరులో వారు ఓటు వేశారు. ఇక ఇప్పుడు పూర్తిగా ఒక కొత్త ధోరణి ప్రారంభమయింది. ఎవరికి ఓటు వేయాలో నిర్ణయం తీసుకునే ముందు ఓటు వేసే ముందు వివిధ అంశాలను సాకల్యంగా పరిశీలిస్తున్నారు; స్థానిక ప్రాధాన్యాలను పరిగణనలోకి తీసుకొంటున్నారు. సాధారణంగా అయితే ఈ పరిణామాన్ని బట్టి భారతీయ ఓటరు సొంతంగా విచక్షణాయుతంగా నిర్ణయం తీసుకొనే పరిణత దశకు చేరాడని చెప్పవచ్చు. అయితే, మనం ఇప్పుడు ఒక అసాధారణ కాలంలో నివసిస్తున్నాము. మన గణతంత్ర రాజ్య వ్యవస్థాగత నిర్మాణం బీటలు వారుతున్న కాలమిది. ఈ నేపథ్యంలో అధికారంలో వున్న ఒక బలమైన ప్రభుత్వం బలహీన పడడమన్నది ఒక ఉపశమనాన్ని కలిగిస్తుంది. అయితే ఈ ఉపశమనం ఒక మిథ్య మాత్రమే.

జాతీయపాలక పక్షానికి రాష్ట్రాల స్థాయిలో ప్రజల మద్దతు అంతకంతకూ తగ్గిపోతున్నది. ఈ పరిస్థితిని నివారించడానికి మోదీ ప్రభుత్వం తప్పక ప్రతిచర్య చేపడుతుంది. జాతీయ స్థాయిలో తమకు లభిస్తున్న మద్దతును నిలబెట్టుకోవడానికి మోదీ సర్కార్ శతథా ప్రయత్నిస్తుంది. అందులో భాగంగా అధికారాలను మరింతగా కేంద్రంలో కేంద్రీకృతమయ్యేట్టు చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలను గొప్ప పురపాలక సంఘాలుగా మాత్రమే మిగిల్చివేస్తుంది! మరి రాష్ట్రాలకు మరింత స్వతంత్ర ప్రతిపత్తిని డిమాండ్ చేసే ప్రాంతీయ పార్టీలు ఆ పరిస్థితిని అంగీకరిస్తాయా? అధికారంలో వున్నవాటితో సహా ప్రాంతీయ పార్టీల సామర్థ్యాలు పటిష్ఠమైనవి కావు. కనుక కేంద్రంలోని అధికార పక్షం తన లక్ష్య సాధనలో పురోగమిస్తూనే వుంటుంది. సంక్షేపించి చెప్పాలంటే జాతీయ రాజకీయాలలో మోదీ ప్రభుత్వాన్ని సమర్థంగా ఎదుర్కోవడానికి రాష్ట్ర స్థాయి ఎన్నికల పోరాటాలలో విజయాలు సరిపోవు. ఆ విజయాలు ఏవిధంగాను ప్రత్యామ్నాయ ఫలితాలకు దోహదకారులు కాబోవు.

*(స్వరాజ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు)*

## ప్రజలను చీల్చేందుకే 'పౌర సవరణ'

దేశమంతటా పెల్లుబుకుతున్న పౌరసత్వ చట్ట సవరణ (సీఏఏ) వ్యతిరేక ఆందోళనల నేపథ్యంలో బీజేపీ అగ్ర నాయకత్వం ఆత్మ రక్షణలో పడింది. 'ఎవ్వరూ భయపడాల్సిన పనిలేదు' అంటూ ప్రజల ఆగ్రహాన్ని చల్లార్చే ప్రయత్నాలు మొదలు పెట్టింది. కేంద్ర సమాచార ప్రసార శాఖామంత్రి ప్రకాష్ జవదేకర్‌తో సహా కేంద్ర మంత్రులు, బీజేపీ నాయకులు చట్ట సవరణను సమర్థిస్తూ వ్యాసాలు రాస్తున్నారు. అంటే, ఇన్నాళ్ల భయపెట్టే రాజకీయాలు చేసి, ఇప్పుడు బుజ్జగించే ఎత్తుగడలకు పూనుకున్నారన్నమాట. చట్ట సవరణను ప్రజలేమీ 'అపార్థం' చేసుకోలేదు. సరిగ్గానే అర్థం చేసుకున్నారు. ఇది జాతిమతాల మధ్య చిచ్చుపెట్టడానికేనని తెలుసి ఆగ్రహానికి గురయ్యారు. జామియా విద్యార్థుల వీరోచిత ప్రతిఘటన దేశానికి ఉత్తేజమిచ్చింది. ప్రభుత్వం దేశమంతటా అప్రకటిత ఎమర్జెన్సీని విధిస్తే, ప్రజానీకం ఆసేతు హిమాచలం బహిరంగ ప్రతిఘటనను ప్రకటించింది.

సంఘ్ పరివార్ గురువు సావర్కర్ 'ద్విజాతి' సిద్ధాంతాన్ని ప్రతిపాదించి భారత జాతిని మతపరంగా విడదీయాలని చెప్పాడు. ఈ సిద్ధాంతానికి బ్రిటిష్ సామ్రాజ్యవాదులు వంత పాడారు. కాంగ్రెస్ కూడా తాళంవేసింది. మత ప్రాతిపదికపై దేశ విభజన జరిగింది. కాందిశీకుల సమస్య వచ్చింది. ప్రాణాలు అరచేత పెట్టుకొని వచ్చిన శరణార్థులందరికీ పౌరసత్వం ఇస్తామని అప్పటి ప్రధాని నెహ్రూ వాగ్దానం చేశారు. 'బహుళత్వంలో ఏకత్వం' అనే భావనను దేశం ఆమోదించింది. అయితే, సావర్కర్ వారసులు పౌరసత్వ సమస్యను లేవనెత్తి మత విద్వేషాలను రగిలించాలని చూస్తున్నారు.




ఎవరు పౌరులో, ఎవరుకాదో నిర్ధారించడానికి లేదా ఎవరికి ఇవ్వాలో లేదో నిర్ణయించడానికి 1955 పౌరసత్వ చట్టం సరిపోతుంది. ఇంకా కావాలంటే అంతర్జాతీయ సూత్రాలు, చట్టాలు ఉన్నాయి. కావున, పౌరసత్వ సమస్యను పరిష్కరించడానికి ఎన్నార్సీగాని, సీఏఏగాని అవసరం లేదు. హిందువులకు మన ఒక్క దేశమే ఉందని, అందుకే సీఏఏ తెచ్చామనే మోసపూరిత ప్రచారంచేస్తూ, పౌరసత్వ సమస్యను మతాల విషయంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోంది. జాతి, మత విద్వేషాల ఆధారంగా తెచ్చిన ఎన్నార్సీ వల్ల అసోంలో పౌరతత్వ సమస్య పరిష్కారం కాకపోగా మరింత జటిలమైంది. ధృవ పత్రాలు లేవనే పేరుతో 19లక్షలమంది పేర్లను జాబితానుండి తొలగించారు. వీరిలో హిందువులు, ముస్లింలతో సహా అన్ని మతాల ప్రజలున్నారు. అక్కడ ప్రస్తుతం వీరిని డిటెన్షన్ క్యాంపులకు తరలిస్తున్నారు. ఈ క్యాంపులు ఫాసిస్టు హిట్లర్ కాలంనాటి కాన్సంట్రేషన్ క్యాంపులను పోలివున్నాయి. ఇలాంటి ప్రమాదకర ఎన్నార్సీని దేశానికంతా అమలుచేస్తామంటూ ప్రభుత్వం సీఏఏని తెచ్చింది. ఇప్పుడు ఎవరైనా తమ పౌరసత్వాన్ని నిరూపించుకుని, జాబితాలో పేరు నమోదు చేసుకోవాలంటే వివిధ రకాల ధృవ పత్రాలను చూపించాలి. పేద రైతులు, వ్యవసాయ కూలీలు, గిరిజన తెగలు, బడుగు, బలహీన వర్గాల ప్రజల వద్ద అలాంటి పత్రాలు ఉండవు. నేడు అసోంలో ఏర్పడిన భయంకర పరిస్థితే రేపు దేశమంతా రాబోతుంది. బీజేపీ, ఆరెస్సెస్‌లు చేస్తున్న తప్పుడు వాదనల సంగతి అలా ఉంచి, ఇంతకీ ఈ సీఏఏను ఎందుకు ఆగమేఘాలమీద తెచ్చారు? అంటే, దేశ ఆర్థిక రంగం అతలాకుతలమైంది. పరిశ్రమలు మూతపడుతున్నాయి. నిరుద్యోగం రికార్డు స్థాయికి చేరింది. అసమానతల అగాధం పెరిగింది. మహిళలకు భద్రత కరువైంది. అన్ని రాజ్యాంగ సంస్థలు అదుపు తప్పాయి. బ్యాంకులు మునిగిపోతున్న పడవలయ్యాయి. దానితో ఎక్కడ చూసినా ప్రజానీకంలో అసంతృప్తి, ఆందోళన, నిరసన, ప్రతిఘటన. ప్రజలలో పెరిగే ఈ అసంతృప్తి పెరగకుండా చేయడం, సంఘటితమై ఉద్యమించకుండా చూడడం.. ఇదే ఈ పాలకుల కుటిల పన్నాగం. అందుకే, పీడిత ప్రజలలో మతం, కులం, జాతి, భాష వ్యత్యాసాలపై విద్వేషాలు రగిలించి ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నారు. కావున, సీఏఏ, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా నేడు దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలను మరింత సంఘటితం చేయవలసిన అవసరం ఉంది.

– ఎస్. గోవింద రాజులు

## తెలుగు కవితా భారతీ! జయోస్తు!!

కల్పవల్లి 'తెలుగు భారతి' మందిరానికి
సువర్ణాక్షరాల మావితోరణాలు కడదాము!
'దేశ భాషలందు తెలుగులెస్స' అని చాటిన
'ఆంధ్రభోజ కృష్ణరాయలకు జయోస్తు!'
పలుకుదాము!!

ప్రపంచ తెలుగు మహాసభల మహోత్సవాల
'తెలుగు భాషా భారతి'కి
'శ్రీతిలకం' దిద్దుదాము!
నన్నయ–తిక్కనాదులకు–పోతన, శ్రీనాథ,
పెద్దనాది మహాకవులకు అక్షరహారతులిద్దాము!!

తెలుగు పద్యానికి
హంస నడకలు నేర్పిన విశ్వనాథ,
తిరుపతి, కరుణశ్రీ, దాశరథి, జాషువా
తుమ్మల, దేవులపల్లికి – నీరాజనాలందిద్దాము!!
గిడుగు, గురజాడ, కందుకూరిని
కీర్తించుదాము!!

పద కవిత కన్నయ్య అన్నమయ్య, రామదాసు,
త్యాగయ్య, మొల్ల, క్షేత్రయ్యల స్తుతించుదాము!
చైతన్య కవితలందించిన–శ్రీశ్రీ, ఆరుద్ర,
సినారె, శంకరంబాడి కవీంద్రులకు
ప్రణమిల్లుదాము!!

తెలుగు పాట కంటె– తీయదనం ఉంటుందా?
అన్నమయ్య పదం కంటె
పరమాన్నం ఉంటుందా?
వేమన– సూక్తి కంటె–
పున్నమి వెలుగు ఉంటుందా?
'ప్రపంచ తెలుగు మహాసభ' కంటె–
పెద్ద పండుగుంటుందా?

అందుకే– నిండు గుండెతో మనమంతా
ఈ ముచ్చటైన– ఈ ప్రపంచ తెలుగు
మహాసభల
సంరంభోత్సవంలో– తెలుగు తల్లిని
కీర్తించుదాం!
తెలుగు కవితా కల్పవల్లికి జయోస్తు
పలుకుదాం!!

తెలుగు అక్షరానికి శ్రీరస్తు!!
పసిడి తెలుగు పద్యానికి– విజయోస్తు!!

– కళ్యాణశ్రీ
జంధ్యాల వేంకట రామశాస్త్రి

*(27, 28, 29 తేదీల్లో విజయవాడలో ప్రపంచ తెలుగు సదస్సు జరుగుతున్నది)*

# వికేంద్రీకరణమా? విచ్ఛిన్నమా?

నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని ఎక్కడ వుండాలి– అనే అంశంపై సూచనలిచ్చేందుకు జి.ఎన్. రావు నేతృత్వంలో నిపుణుల కమిటీని నియమించినప్పటి నుంచే రాజధాని విషయంపై సందేహాలు నెలకొన్నాయి. నేటి పాలకపక్ష నేతలు ఎవ్వరూ అమరావతిలో రాజధాని శంకుస్థాపన నాటి నుంచీ దానిపై వ్యతిరేకత వ్యక్తం చేయలేదు. శాసనసభలో నాటి ప్రతిపక్ష నాయకుడు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి అమరావతిలో రాజధాని ఏర్పాటును ఆమోదించటమేకాక 30 వేల ఎకరాలు అవసరమవుతుందనీ చెప్పారు.

**అమరావతి ప్రాంతంలో రాజధాని పనులను పూర్తి చెయ్యటానికి 50–60 వేల కోట్ల రూపాయలు అవసరం అవుతాయని, విశాఖపట్నం అయితే 'ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్'కు పెద్దగా ఖర్చు చేయవలసిన ఆవశ్యకత వుండదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తూ వుండటం సరికాదు. నవ్యాంధ్రప్రదేశ్‌కు అమరావతి రాజధానిగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఆమోదించింది. పరిపాలనకు, శాసనసభ, మండలిల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటై ఉన్నందున రాజధానిని మార్చవలసిన అవసరం ఎంత మాత్రమూ లేదు. మంత్రులు, శాసనసభ్యులు, ఐ.ఎ.ఎస్., గెజిటెడ్, నాన్–గెజిటెడ్ ఉద్యోగులు అందరికీ, హైకోర్టు న్యాయమూర్తులకు భవనాల నిర్మాణ ప్రక్రియ వివిధ దశలలో వుంది. అంతేకాదు, చట్టసభల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఇప్పటికే వేలకోట్ల రూపాయల ఖర్చుతో జరుగుతున్నందున వేరే నగరంలో వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేసి తిరిగి సెక్రటేరియట్, చట్టసభలను నిర్మించటం ఎంతమాత్రం సమర్థనీయం కాదు.**

అదే విధంగా, అమరావతిలో హైకోర్టు ఏర్పాటు సమయంలోనూ టీడీపీ, వైకాపా నాయకులెవ్వరూ హైకోర్టును అమరావతిలో కాకుండా కర్నూలులో ఏర్పాటు చేయాలని డిమాండ్‌ను గట్టిగా వినిపించలేదు. రాజధానిపై మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటన దరిమిలానే రాజధాని, హైకోర్టు అంశాలపై కొత్త డిమాండ్లు పుట్టుకు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, సెక్షన్ 30(1) ప్రకారం సుప్రీంకోర్టు సిఫార్సును అనుసరించి రాష్ట్రపతి అమరావతిలో రాష్ట్ర హైకోర్టును అనుమతిస్తూ నోటిఫికేషన్ జారీచేశారు. ఇప్పటికే హైకోర్టు పనిచేస్తున్నది. ఈ పరిస్థితులలో హైకోర్టును కర్నూలుకు మార్చాలంటే ఏపీ హైకోర్టు, సుప్రీంకోర్టు, భారత రాష్ట్రపతి ఆమోదించవలసి వుంటుంది. అయితే, కర్నూలులో బెంచ్, విశాఖపట్నం లేక విజయ నగరంలో మరొక బెంచ్ ఏర్పాటుకు యిబ్బందులు వుండవు.

విశాఖపట్నంలో 'ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్'ను ఏర్పాటు చెయ్యాలని, వేసవికాలంలో శాసనసభను నిర్వహించాలని నిపుణుల కమిటీ చేసిన సిఫార్సులో ఎంతమాత్రం హేతుబద్ధత లేదు. రైల్వే, రవాణా, అంతర్జాతీయ విమానాశ్రయం తదితర మౌలిక వసతులున్నందున ఇప్పటికే విశాఖపట్నం 'ఎ.పి. ఫైనాన్షియల్ సిటీ/క్యాపిటల్' స్థాయిని సంతరించుకుంది. ఇక్కడ పరిపాలన రాజధాని/సెక్రటేరియట్ ఉంటేనే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని భావించటం సరికాదు. ఆ ప్రాంతంలో వంశధార, నాగావళి, మహేంద్రతనయ, బహుద మున్నగు నదులు వున్నాయి. ఇప్పటికీ ఈ నదులపై ప్రాజెక్టుల నిర్మాణం కొనసాగుతూ వుండుట వలన ఆ ప్రాంతము నుండి లక్షలాది మంది పేదలు, సన్నకారు రైతులు వలసలు వెళుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా ఈ ఇరిగేషన్ పథకాల పైన దృష్టిని కేంద్రీకరించి, నిధులను సమకూర్చి, శీఘ్రంగా వాటిని పూర్తిచెయ్యటం అవసరం.

విశాఖపట్నం–కాకినాడల మధ్య లోగడ హెచ్.పి.సి.ఎల్., ఒ.ఎన్.జి.సి. రాష్ట్ర ప్రభుత్వం మధ్య భారీ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ నిర్మించేందుకు ఒప్పందం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం పైన ఒత్తిడి తెచ్చి ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకు వెళ్ళగలిగితే వేలాదిమందికి ఉపాధి చేకూరుతుంది. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం అంగీకరిస్తే ఆర్థికంగా స్తోమత వున్న విశాఖపట్నం పోర్టు ట్రస్టు భావనపాడు పోర్టును అభివృద్ధి చేస్తే, ఆ ప్రాంత సత్వర అభివృద్ధికి దోహదపడుతుంది. ఐ.టి., ఫార్మారంగాలు విశాఖపట్నం ప్రాంతంలో మరింతగా అభివృద్ధి చెందేందుకు అవకాశాలు వున్నాయి.

అమరావతి రాజధాని ప్రాంతంలో పనులను పూర్తి చెయ్యటానికి 50–60 వేల కోట్ల రూపాయలు అవసరం అవుతాయని, విశాఖపట్నం అయితే 'ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్'కు పెద్దగా ఖర్చు చేయవలసిన ఆవశ్యకత వుండదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తూ వుండటం సరికాదు. నవ్యాంధ్రప్రదేశ్‌కు అమరావతి రాజధానిగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఆమోదించింది. పరిపాలనకు, శాసనసభ, మండలిల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటై ఉన్నందున రాజధానిని మార్చవలసిన అవసరం ఎంత మాత్రమూ లేదు. మంత్రులు, శాసనసభ్యులు, ఐ.ఎ.ఎస్., గెజిటెడ్, నాన్–గెజిటెడ్ ఉద్యోగులు అందరికీ, హైకోర్టు న్యాయ మూర్తులకు భవనముల నిర్మాణ ప్రక్రియ వివిధ దశలలో వుంది. అంతేకాదు, చట్టసభల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఇప్పటికే వేల కోట్ల రూపాయల ఖర్చుతో జరుగుతున్నందున తిరిగి వేరే నగరంలో వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేసి తిరిగి సెక్రటేరియట్, చట్ట సభలను నిర్మించటం ఎంతమాత్రం సమర్థనీయం కాదు.

కేంద్ర ప్రభుత్వం అమరావతి రాజధానిలో మౌలిక వసతులకు రూ.1,500 కోట్లు, అమరావతిని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయుటకు రూ.368 కోట్లు ఇచ్చివుంది. ప్రధానమంత్రి స్వయంగా శంకుస్థాపన కూడా చేశారు. అభివృద్ధి కార్యక్రమాలను వివిధ జిల్లాలలో




చేపట్టడం ద్వారా ఉపాధి కల్పన, ప్రజల ఆదాయ స్థాయిలను పెంచవచ్చునే తప్ప కేవలం మూడుచోట్ల రాజధానులతో సాధించవచ్చుననే భావన ఎంతమాత్రం సరికాదు. రామయ్యపట్నంలో మేజర్ పోర్టును కేంద్ర ప్రభుత్వంతోనే అభివృద్ధి చేయించటం మంచిది. ప్రకాశం జిల్లా పామూరు వద్ద నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ మాన్యుఫాక్చరింగ్ జోన్‌ను కేంద్ర ప్రభుత్వం సహకారంతో ముందుకు తీసుకువెళ్ళితే వేలాదిమందికి ఉపాధి చేకూరుతుంది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం భూమిని అందచేయవలసి వుంటుంది. ప్రకాశం జిల్లాకే కాక ప్రక్కనే వున్న రాయలసీమ ప్రాంతానికి కూడా మేలు చేకూరుతుంది. దొనకొండ వద్ద దాదాపు 20 వేల ఎకరాల ప్రభుత్వ భూమి వున్నందున పలు పరిశ్రమలు ఏర్పాటు చేయవచ్చు. కర్నూలు జిల్లాలో పెద్దఎత్తున సోలార్ పవర్ ప్లాంటులు ఏర్పాటై ఉన్నందున అనేక పరిశ్రమలు ఈ ప్రాంతంలో ఏర్పాటయ్యేందుకు అవకాశం వుంది. నెల్లూరు జిల్లా లోని శ్రీసిటీ, చిత్తూరు జిల్లా లోని తిరుపతి ప్రాంతాలు చెన్నై నగరానికి సమీపంలో ఉండటం, చెన్నై–బెంగుళూరు ఇండస్ట్రియల్ కారిడార్ వలన బెంగుళూరు నగరానికి అనంతపురం సమీపంలో ఉండటం వలన అనేక పరిశ్రమలు నెలకొల్పేందుకు అవకాశాలు వున్నాయి. గోదావరి జలాలను కృష్ణా డెల్టా, నాగార్జునసాగర్ కుడికాలువ ఆయకట్టులకు అందించటంతోపాటు రాయలసీమ ప్రాంతంలోని ఇరిగేషన్ పథకాలు చెరువుల క్రింద వున్న ఆయకట్టుల అవసరాలను తీర్చటానికి, శ్రీశైలం వద్ద లభ్యమయ్యే నీటితోపాటు గోదావరి జలాలను కూడా వినియోగించుకోగలిగితే రాయలసీమ సస్యశ్యామలమవుతుంది.

శాఖాధిపతుల కార్యాలయాలకు అవసరమైన భవనాల నిర్మాణం ఇంకా మొదలు కానందున వివిధ జిల్లాలలో ఆయా జిల్లాలలోని స్థితిగతులను, వనరులు, అవసరాలను దృష్టిలో వుంచుకొని శాఖాధిపతుల కార్యాలయాలను ఏర్పాటు చెయ్యటం ద్వారా అధికార వికేంద్రీకరణ చేయవచ్చును. అధునాతన ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజి అందుబాటులోకి వచ్చి వున్నందున వివిధ జిల్లాలలోని శాఖాధిపతుల కార్యాలయాల నుండి అమరావతిలో వున్న సెక్రటేరియట్‌కు ఫైళ్ళను చేర్చవచ్చును. ఉదాహరణకు అనంతపురంలో గ్రామీణాభివృద్ధి, సి.ఇ. మైనర్ ఇరిగేషన్, సెరికల్చర్, హార్టికల్చర్ మిషన్, కర్నూలులో హైకోర్టు బెంచ్, నాన్ కన్వెన్షనల్ ఎనర్జీ, ఎ.పి. సీడ్స్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, కడపలో మైనింగ్, మినరల్స్, చిత్తూరులో మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, కాలేజ్ ఎడ్యుకేషన్, ఆయుష్ యోగా వంటివి ఏర్పాటు చేయవచ్చు. అలాగే, నెల్లూరులో పరిశ్రమలు, ప్రకాశం జిల్లాలో పశుసంవర్థక శాఖ, డెయిరీ, గుంటూరులో వ్యవసాయం, రోడ్లుభవనాలు, ఉర్దూ అకాడమి, కృష్ణాలో ఇ.ఎన్.సి. ఇరిగేషన్, వైద్య విధాన పరిషత్, హ్యాండీక్రాఫ్ట్స్, పశ్చిమ గోదావరిలో ఫిషరీస్, పంచాయతీ రాజ్, కాపు సంక్షేమం తూర్పు గోదావరిలో కమీషనర్, యస్.సి. వెల్ఫేర్, హార్టీకల్చర్, పోర్టులు, విజయనగరంలో కమిషనర్, ట్రైబల్ వెల్ఫేర్, స్కూల్ ఎడ్యుకేషన్, విశాఖపట్నంలో ఫార్మా, ఐ.టి., టూరిజం, ఎండోమెంట్ కమిషనర్, శ్రీకాకుళంలో కమిషనర్, బి.సి. వెల్ఫేర్, ఇ.ఎన్.సి. మీడియం ఇరిగేషన్ ఇత్యాదివి ఏర్పాటు చేయవచ్చు. ఇప్పటికే రాష్ట్రప్రభుత్వ ఖజానాపై రూ.2.5 లక్షల కోట్లు పైన రుణ భారం ఉండి, ఆశించిన రాబడి రాక ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి గడ్డుగా ఉన్నందున విశాఖపట్నంలో 'ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్' ఏర్పాటు చెయ్యాలన్న ఆలోచనను విడనాడి అమరావతి లోనే రాజధానిని, శాసనసభలను కొనసాగించుతూ కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేసి, వివిధ జిల్లాలలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ అభివృద్ధి వికేంద్రీకరణతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో ప్రజలందరి జీవనప్రమాణాలు మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి సల్పటం అవసరం.

■ వడ్డే శోభనాద్రీశ్వరరావు

సొగసు

# మ్యాచింగ్ ప్యాచ్‌వర్క్!

రొటీన్‌కు భిన్నంగా కనిపించాలంటే వినూత్నమైన పనితనంతో తయారైన దుస్తులు ఎంచుకోవాలి! ఈ కోవకు చెందినదే 'ప్యాచ్‌వర్క్'! కాంట్రాస్ట్ రంగులు, అందమైన డిజైన్లలో ప్యాచ్‌వర్క్ చేసిన కాటన్ చీరలు చూడముచ్చటగా ఉంటాయి. ఆకర్షణీయమైన ఆ రకం చీరలే ఇవే!



ప్యాచ్‌వర్క్‌ను పోలిన మ్యాచింగ్ బ్లౌజ్ ధరిస్తే, చీరకు అందం వస్తుంది. అయితే చీరకట్టుకు నప్పేలా బ్లౌజ్ నెక్ డిజైన్ జాగ్రత్తగా ఎంచుకోవాలి. ఓవల్, రౌండ్ షేప్ నెక్ డిజైన్లు బాగుంటాయి.

పువ్వులు, లతల డిజైన్లతో నిండిన కాటన్ చీరకు, అంచుల వెంబడి కాంట్రాస్ట్ కలర్ ప్యాచ్‌ను జతచేస్తే ఆ చీర లుక్ పూర్తిగా మారిపోతుంది. చీరకు అదనపు ఆకర్షణ తోడవుతుంది.

ప్లెయిన్ కలర్ చీరకు, కాంట్రాస్ట్ కలర్ అంచు ఒక్కటే సరిపోదు. చీర రంగును పోలిన డిజైను అంచులో ఉండి తీరాలి. అప్పుడే ప్యాచ్‌వర్క్ నలుగురి కళ్లనూ ఆకర్షిస్తుంది.



నగ ధగ

## ఇంపైన 'ఇయర్ రింగ్స్'!

చూడగానే ఆకట్టుకునేవి చెవుల ఆభరణాలే! కాబట్టి వాటిని ఆచితూచి ఎంచుకోవాలి. దుస్తులకు తగిన వాటినే ధరించాలి! ఇయర్ రింగ్స్ ఎంచుకోవడంలో పాటించవలసిన చిట్కాలు ఇవే!

- సల్వార్ సూట్స్‌కు పెద్ద ఇయర్ రింగ్స్ వేస్తేనే అందం. అవి పూర్తి బంగారమైనా సరే! స్టోన్ స్టడెడ్ అయినా సరే!
- ఇలాంటి పెద్ద కమ్మల్లో పనితనానికే ప్రాధాన్యం ఇవ్వాలి. చక్కటి డిజైన్ కళ్లను కట్టి పడేస్తుంది.
- చీరలు, హైకాలర్ బ్లౌజ్‌ల మీద ఫ్యాన్సీ నెక్లెస్ వేయకుండా పెద్ద ఇయర్ రింగ్స్ వేసుకోవాలి. ప్రస్తుత స్టయిల్ స్టేట్‌మెంట్ ఇదే!
- 'చాంద్‌బాలీస్' ఎప్పటికీ ఫ్యాషనే! వేడుకల్లో ధరించటం కోసం ఒక జత కొనిపెట్టుకోవాలి.
- కుందన్‌లో పొడవుగా ఉండే ఇయర్ రింగ్స్‌కు వెనక క్లాగ్స్ ఉండాలి. పెద్ద ఇయర్ రింగ్స్ చెవికి చక్కగా అమరిపోవాలంటే క్లాగ్స్ ఉన్నవి ఎంచుకోవాలి.
- 70 నుంచి 80 గ్రాముల బరువుండే ఇయర్ రింగ్స్ అందంగా ఉన్నా ధరించటంలో కాస్త ఇబ్బంది ఉంటుంది. రెండు, మూడు గంటలకే చెవి నొప్పి మొదలవుతుంది. వాటిని మార్చాలంటే కనీసం 20% నష్టపోతాం. కాబట్టి పెద్ద ఇయర్ రింగ్స్ 30 నుంచి గ్రాములు, లేదంటే మాగ్జిమమ్ 50 గ్రాముల ఇయర్ రింగ్స్‌నే ఎంచుకోవాలి.
- పెద్ద ఇయర్ రింగ్స్....సల్వార్ సూట్స్, చీరలు, పొడవాటి ఫ్రాక్స్.... ఇలా పార్టీవేర్ దేనిమీదకైనా చక్కగా నప్పుతాయి.
- ఒకవేళ పెద్ద ఇయర్ రింగ్స్ ధరించటం ఇష్టం లేకపోతే ఆ లోటును భర్తీ చేయటం కోసం స్టడ్స్‌తోపాటు మాటీలు కూడా పెట్టుకోవాలి.
- అలాగే ఇయర్ రింగ్ బరువుకు చెవి కోసుకుపోకుండా ఉండాలన్నా మాటీలు వేసుకోవాలి.
- 35, 40 ఏళ్లు దాటిన వాళ్ల చెవి తమ్మెలు పలుచబడతాయి. ఎక్కువ బరువును భరించలేవు. కాబట్టి ఈ వయసువాళ్లు 30 గ్రాముల లోపు ఇయర్ రింగ్స్‌ను ఎంచుకుంటే మంచిది!
- ఇప్పుడు స్టడ్స్ ఫ్యాషన్ నడుస్తోంది. కమ్మలనేవి కాక్‌టెయిల్ ఫ్రాక్స్, లాంగ్ ఫ్రాక్స్ మీదకు నప్పుతాయి.
- పట్టు చీరలకు చక్కని మ్యాచింగ్...పెద్ద కమ్మ, దాని కింద చిన్న బుట్ట.





**మంజులా రావు,**
మంజుల జ్యూవెల్స్,
హైదరాబాద్.

## నవయవ్వనంగా...

ఇలా చేయండి!



అరవైలో ఇరవైలా కనిపిస్తే ఫరవాలేదు. ఇరవైలో అరవైలా కనిపిస్తేనే సమస్య. ఇలా కనిపిస్తున్నారంటే, జీవనశైలి అస్తవ్యస్థంగా మారిందని గ్రహించాలి. అలాంటి అలవాట్లను సరిదిద్దుకోవాలి.

**కంటి నిండా నిద్ర:** ఒక్క రాత్రి నిద్ర సరిపోకపోతే, మరుసటి రోజు వాడిపోయినట్టు కనిపిస్తాం. కళ్ల అడుగున నల్లని వలయాలు ఏర్పడతాయి. చర్మం మీద ముడతలు పెరుగుతాయి. నిద్ర తగ్గడం వల్ల కార్టిసాల్ హార్మోన్ స్థాయి పెరిగి, వాపులు, నొప్పులు మొదలవుతాయి. చర్మాన్ని బిగుతుగా ఉంచడానికి తోడ్పడే కొల్లాజన్ పరిమాణం తగ్గుతుంది. వీటన్నిటి ఫలితంగా వయసుకు మించి కనిపిస్తాం. ఇలా జరగకుండా ఉండాలంటే కంటి నిండా నిద్ర తప్పనిసరి.

**చక్కెర పరిమితం:** చక్కెర శరీరంలో కొవ్వు పేరుకునేలా చేస్తుంది. అలాగే చర్మం మీద ముడతలు పడే వేగాన్ని పెంచుతుంది. చర్మం జీవం కోల్పోయి, కళావిహీనంగా మారుతుంది. ఇదంతా చర్మం బిగువుకు తోడ్పడే కొల్లాజెన్ ప్రొటీన్‌ను చక్కెర డ్యామేజ్ చేయడం వల్ల జరుగుతుంది. కాబట్టి తీపి పదార్థాలకు దూరంగా ఉండాలి.

**ఒత్తిడి:** ముఖకవళికలకు తగ్గట్టు ముఖం మీద గీతలు, ముడతలు ఏర్పడతాయి. విపరీతమైన ఒత్తిడి వాతావరణంలో గడిపే వారి ముఖంలో భృకుటి, కళ్ల అడుగున ముడతలు ఏర్పడతాయి. కాబట్టి ఒత్తిడిని తగ్గించుకోవడం కోసం యోగా, ధ్యానం లాంటివి అనుసరించాలి.

## ముత్యాల ముగ్గు



**మైనంపాటి విజయలక్ష్మి**
లాయరుపేట, ఒంగోలు



16 చుక్కలు
2 వరుసలు
2 వచ్చేవరకు, సరిచుక్క





**సి.హెచ్. పుష్పవల్లి**
గొల్లపూడి, కృష్ణా జిల్లా

25 చుక్కలు
1 వచ్చే వరకు
చుక్క విడిచి చుక్క



16 చుక్కలు
4 వరుసలు
ఇటు అటు వదిలి
4 వరకు



**శాంతి నర్వా**
సరూర్‌నగర్, హైదరాబాద్



10 చుక్కలు
10 వరుసలు



**పి. శివజ్యోతి**
కడప

మీ ముత్యాల ముగ్గుతో పాటు మీ ఫొటో, పోస్టల్ అడ్రస్, ఫోన్ నంబర్ కూడా వివరంగా రాయండి.

మా చిరునామా... నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నెంబర్ 70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500033. Email: navya@andhrajyothy.com

తిరుప్పావై

## వినవమ్మా! శ్రీరామ గుణగానం!



ప్రముఖ చిత్రకారుడు బాపు బొమ్మ

### పన్నెండో పాశురం

కనైత్తిళంగత్తెరుమై కన్రు క్కిరంగి
నినైత్తు ములై వరియే నిన్రుపాల్ శోర
ననైత్తు ఇల్లమ్ శేరాక్కుమ్ నర్చెల్వన్ తంగాయ్!
పనిత్తలై వీళ నిన్ వాశల్ కడై ఎత్తి
శిన్తతినాల్ తెన్నిలంగై క్కోమానై చ్చెత్త
మనత్తుక్కు ఇనియానై ప్పాడవుమ్ నీ వాయ్ తిఱవాయ్!
ఇనిత్తాన్ ఎళున్దిరాయ్! ఈతెన్న పేరురక్కమ్!
అనైత్తు ఇల్లత్తారుమ్ అరిన్దు ఏల్ ఓర్ ఎంబావాయ్

**భావం:** ఉదయాన పాలు పితికేవారు లేరు. దూడలను ముందుగా విడిచేవారు లేరు. పాలు చేపడం వల్ల పొదుగు భారమై, దూడలకు దూరంగా ఉన్న బాధతో, వాటి పట్ల వాత్సల్యంతో ఆవులు అరుస్తున్నాయి. దూడలు తమ పొదుగులో మూతి పెట్టినట్టు భావన చేసి, ఏకధారగా అవి పాలు స్రవిస్తున్నాయి. దాంతో ఆ ప్రాంతమంతా తడిసి బురదమయం అయింది. అంతటి గొప్ప పాడి సంపద కలిగిన యజమాని ఇప్పుడు శ్రీకృష్ణుని చెంత కాలం గడుపుతున్నాడు. తన వ్యాపారాన్ని సైతం మరచిపోయాడు. "అంతటి గొప్ప సంపద కలవాని ముద్దుల చెల్లెలా! నీ ఇంటి ముంగిట నిలిచి ఉన్నాం. తలల మీద ఉదయపు మంచు కురుస్తోంది. అలనాడు అందమైన లంకా నగరానికి అధిపతి అయిన రావణుడి వైభవాన్ని క్రోధావేశంతో మట్టి కరిపించి, మనసుల్లో నిలిచిపోయిన శ్రీరామచంద్రుడి గుణగానం చేస్తున్నాం మేము. నీవు మాత్రం నోరు విప్పవేమి? ఇకనైనా నిదుర వీడి, లేచి రావమ్మా! అదేమి మొద్దు నిద్దుర తల్లీ! నీ సంగతి ఊరందరికీ తెలిసిపోయింది. చాలు చాలు! ఇక లేచిరా! ఇది మనం ఆచరించే భవ్యమైన వ్రతం!" అని గోదాదేవి పిలుస్తోంది.

● ఎ. సీతారామారావు

## పోలికలేంటి ?

ఇక్కడ తొమ్మిది బొమ్మలు ఉన్నాయి కదా! వీటిలో ప్రతి మూడు బొమ్మల మధ్య అడ్డం, నిలువు, ఐమూలగా ఉన్న పోలికలను చెప్పగలరా?



## పట్టికలో పదాలను గుర్తించండి?

letter K

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| G | S | A | S | R | U | P | E | O | R | I |
| I | C | E | K | E | T | C | H | U | P | C |
| A | K | U | G | A | S | P | L | I | G | E |
| X | E | C | A | K | I | N | G | C | K | C |
| S | T | S | R | B | L | T | K | E | A | K |
| E | T | E | K | N | I | F | E | T | Y | E |
| S | L | B | I | K | C | R | A | B | A | Y |
| P | E | M | K | I | K | R | U | C | K | M |
| G | I | N | K | I | W | I | O | O | A | D |
| J | I | S | I | D | L | A | K | D | O | I |
| P | L | D | E | O | K | I | T | E | S | P |




## దారి కనుక్కోండి?



## సరైన నీడను కనుక్కోండి?






జత లేని బొమ్మ ఏది?



## 8 తేడాలు గుర్తించండి?

## డైలీ సుడోకు -235

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 2 | 4 | 7 | 9 | | 5 | |
| 3 | | | | | | 9 | | |
| | 1 | 4 | 5 | | 8 | | 7 | |
| | 5 | | | 4 | | 8 | 1 | 2 |
| | 2 | | 3 | | 7 | | 6 | |
| 4 | 6 | 9 | | 1 | | | 3 | |
| | 3 | | 2 | | 5 | 7 | 4 | |
| | | 1 | | | | | | 5 |
| | 9 | | 1 | 6 | 4 | 3 | | |

### సుడోకు - 234 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 8 | 1 | 6 | 7 | 5 | 9 | 3 | 4 |
| 5 | 3 | 7 | 4 | 1 | 9 | 2 | 6 | 8 |
| 4 | 6 | 9 | 2 | 3 | 8 | 5 | 7 | 1 |
| 1 | 7 | 3 | 5 | 2 | 4 | 8 | 9 | 6 |
| 6 | 9 | 4 | 1 | 8 | 3 | 7 | 5 | 2 |
| 8 | 5 | 2 | 9 | 6 | 7 | 1 | 4 | 3 |
| 7 | 2 | 5 | 8 | 4 | 6 | 3 | 1 | 9 |
| 3 | 4 | 8 | 7 | 9 | 1 | 6 | 2 | 5 |
| 9 | 1 | 6 | 3 | 5 | 2 | 4 | 8 | 7 |

**ఎలా పూరించాలి?** ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

విశేషం

# పలికించెడువాడు రామభద్రుండట...

**హృదయంలో పొంగి పొరలిన రసభావాలను వృథాగా పోనీయక బిందువును సముద్రంగా విస్తరింపజేయగల మహత్తర శక్తి పోతన సొంతం. శ్రీకృష్ణ భక్తియోగం పోతన మంత్రం.**




శ్రీ ఆంధ్ర మహా భాగవతం తెలుగువారి పుణ్యాల పేటి. పోతనార్యుని సుధామధుర రసస్యందంలో పద్యం రసవత్తరంగా రూపొంది తెలుగువారి నాలుకలపై నర్తించింది. దశమ స్కంధంలోని శ్రీకృష్ణుని బాల్య లీలా విశేషాలు పలువురికి కంఠస్థమై, దివ్య పద్యాలుగా వర్ధిల్లాయి.

"ముద్దులార భాగవతమున్ రచియించుచు, పంచదారో నద్దితివేమొ గంటము మహా కవిశేఖర..." అంటూ పోతన కవితాశైలిని కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి విశ్లేషించారు. (ఉదయశ్రీ మొదటి భాగం)

పోతన సహజ కవి. 'లలిత స్కంధము' అనే పద్యంలో పోతన 'భాగవత కల్పతరువుకు శ్రీకృష్ణావతారమే మూలం' అని నిర్దేశించి, 'ఆ కృష్ణుడే మహా విష్ణువు' అని స్పష్టంగా ప్రతిపాదించాడు. మోక్షప్రదాలైన శ్రీకృష్ణుని కథలను వినదలచిన శౌనకాది మహామునులకు సూతుడు భాగవత కథనానికి ఉపక్రమించడమే శ్రీకృష్ణ చరిత్ర. భాగవతంలో కృష్ణ చరిత్ర ఉన్న 'దశమస్కంధం' ఈ పురాణం అనే శరీరానికి హృదయ స్థానం.

పోతన గురించి ఆచార్య పింగళి లక్ష్మీకాంతం ఇలా విశ్లేషించారు: "తెలుగు కవులలో శ్రీకృష్ణ నామాత్మకమైన భాగవత తత్త్వ ప్రబోధాన్ని ప్రారంభించిన భక్త కవి యోగి పోతనే! అంతేకాదు, వంగదేశంలో రాధాకృష్ణ మత సాంప్రదాయాన్ని నెలకొల్పి, దేశమంతటా వ్యాపింపజేసిన చైతన్య స్వామి... పోతన తరువాత యాభై సంవత్సరాలకు ఉదయించాడు. కాబట్టి చైతన్యావతారానికి పూర్వమే ఈ ఆంధ్ర భక్త యోగి కృష్ణ తత్త్వాన్ని గాన చేసి, తెలుగువారి మనోలోకంలో ఒక పరివర్తన తెచ్చాడు. ఆ సమయంలోనే అపర ప్రహ్లాదుడు అనదగిన తాళ్ళపాక అన్నమయ్య కూడా (1408-1503) తన సంకీర్తనలతో విష్ణుపారరమ్యాన్ని బోధించడం ఆరంభించాడు. మహా భక్తులు జన్మించిన యుగమది. (ఆంధ్ర సాహిత్య చరిత్ర: పుట 319)

### సాటిలేని ప్రజారంజకత

తెలుగు సాహిత్యంలోని పురాణేతిహాసాలలో ఆంధ్ర మహాభాగవతానికి ఉన్నంత ప్రజానురంజకత్వం మరో గ్రంథానికి లేదు. దానికి ప్రధాన కారణాలు ఇవి:

భాగవతంలో ప్రతిపాదితమైన భక్తి యోగం సర్వప్రాణి సాధారణమైన తారకమంత్రం. ఆపదలు వచ్చినప్పుడు గజేంద్ర మోక్షాన్ని సంజీవనిగా జపిస్తారు.

**లావొక్కింతయు లేదు, ధైర్యము విలోలంబయ్యె**
**ప్రాణంబులున్ / ఠావుల్ తప్పెను; మూర్ఛ వచ్చె,**
**తనువున్ డస్సెన్, శ్రమంబయ్యెడిన్,**
**నీవేతప్ప నితః పరం బెరుగ మన్నింపందగున్**
**దీనునిన్ / రావే ఈశ్వర! కావవే వరద!**
**సంరక్షింపు భద్రాత్మకా!**

'కావవే వరదా!' అని చేసిన ఆక్రోశమే చాలు... వైకుంఠవాసుణ్ణి భూలోకానికి తీసుకురావడానికి! ఇక్కడ గజేంద్రుడి మొర పోతన మొర. 'శ్రీ కైవల్య పదంబు చేరుటకునై చింతించెదన్' అని భాగవత రచనకు ఉపక్రమించిన భక్తి కవియోగి ఆయన.

భాగవత పద్యాలు మధురాతి మధురాలై మందార మకరంద మాధుర్యంలో తేలియాడిస్తాయి. ఈ పద్యాలలోని శ్రుతిలయలకు వాటిన పలికినంతనే మనసుని లోబరచుకొనే శక్తి ఉంది. కవి తాను అనుభవించిన దారిద్ర్యం, దానిని ఎదుర్కొని పోరాడిన ధీరత్వం వల్ల ఆయనపై పఠితలకు పూజ్య భావం కలుగుతుంది.

'కర్ణాట కిరాట కీచకుల కమ్మ త్రిశుద్ధిగ నమ్ము భారతీ' అని శపథం చేసిన కవి పోతన. ఈ సందర్భాన్ని తన 'పోతనచరిత్ర'లో 'నశ్వర రాజ్య సంపదల...' అనే పద్యంలో వానమామలై వరదాచార్యులు ఘనంగా వర్ణించారు. రాజు భాగవతాన్ని అంకితం చేయాలని కోరినప్పుడు, 'రాజాజ్ఞ కన్నా రామాజ్ఞ మిన్న' అని పోతన తెలిపిన ఘట్టం అది.

### భావకవితా ప్రతిభ

పోతన కావ్య శిల్ప మర్యాదలకు కట్టుబడిన కవి కాదు. వాటన్నిటికీ అతీతుడైన భాగవత కవిశేఖరుడు. తిక్కన కవితా ప్రతిభ నాటకీయం అయినట్టే పోతనది భావకవితా ప్రతిభ. ఆయన శైలి కర్ణపేయం. భక్తి శృంగర భావ పరిపోషణలో ఆయన భావలోలుడు. శ్రీకృష్ణుడి బృందావన విహార సమయంలో యమున హర్షాతిరేకంతో ఉప్పొంగినట్టే, పోతన రచనలోని శృంగారాధిక్యతకు భావలోలత ప్రధాన కారణం. అది జీవవేశ్వరైక్య ప్రతిపాదితమైన ఆధ్యాత్మిక శృంగారమైనది, పరమ పవిత్రమైనది.

పోతన అద్వైతే, కానీ విశిష్టాద్వైతి కాదు. ఛందస్సులోంచీ పుట్టిన మాధుర్యం ఆయనకు సహజంగా సిద్ధించింది. కవి స్వేచ్ఛగా పాడుకొనే భక్తిగానాన్నీ, ఆ గానానికి సరిపడే మధురాతి మధురమైన శబ్దాన్నీ, ఆ శబ్ద సంఘానికి మకుటాయమానమైన అంత్య ప్రాస కలిసి... భాగవతం చదివేటప్పుడు తాళ మృదంగాలతో విలసిల్లే ఒక గానసభలా భాసిస్తుంది.

రుక్మిణీ కల్యాణ ఘట్టంలో జగన్మోహనాకారుని రుక్మిణి చూసిన సందర్భం అద్భుత కళా సృష్టి:

**కనియెన్ రుక్మిణి చంద్రమండలముఖు**
**న్ కంఠీరవేంద్రావల / గ్ను నవాంభోజద**
**ళాక్షు, జారుతరవక్షున్, మేఘసంకాశ దే**
**/ హు నగారాతి గజేంద్రహస్త నిభ బాహు**
**న్ చక్రి, పీతాంబరున్ / ఘనభూషాన్వితు,**
**గంబుకంఠు, విజయోత్కంఠున్ జగన్మోహ**
**నున్** (దశమ స్కంధం- 1749)

పోతన కవితా మాధుర్యం భక్తి భావరస సమ్మిళితమై, కృష్ణకథా స్రవంతియై తెలుగు సాహితీ నందనోద్యానంలో కల్పతరువై ఇన్ని శతాబ్దాలుగా పాఠకలోకాన్ని అలరిస్తోంది.

● **డాక్టర్ రేవూరు అనంత పద్మనాభరావు**

*(సాధన సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల విద్యార్థులకు 'పలికెడిది భాగవతం' పేరిట రాష్ట్ర స్థాయి పద్య పఠన పోటీలు జరిగాయి. విజేతలకు ఈనెల 30వ తేదీ మధ్యాహ్నం మూడున్నర గంటలకు హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయంలో బహుమతి ప్రదానం.)*

రమణతత్త్వం

# ఆత్మాన్వేషణలో తొలి మెట్టు



ఈ నెల 30న శ్రీ రమణమహర్షి జయంతి

విశ్వాన్ని నడిపే శక్తి ఒకటి ఉన్నది. అదే 'ఆత్మ'. ఆ ఆత్మకు మరో పేరు శుద్ధ చైతన్యం. జీవులన్నీ ఆ చైతన్యంలోనివే! ఇది గ్రహించినవారు సమస్త సృష్టినీ సమభావంతో చూస్తారు. ఆ సమదృష్టితో అహంకార, మమకారాలు తొలగిపోతాయి. ఆ స్థితికి చేరడమే జ్ఞానం! ఇదే శ్రీ రమణ మహర్షి అందించిన సందేశం.

మానవులకు ఆత్మానుభవం కలుగుతూనే ఉంటుంది. సాధకుడు దాన్ని గమనించుకోగలగాలి. ప్రాణాయామం తీవ్రంగా సాగినప్పుడు మనస్సు అచలం అవుతుంది. మనసు కదలదు గానీ, హృదయం వైపు మాత్రం పయనించదు. వలలో పడిన పక్షి... వల ఎత్తగానే తిరిగి తన ప్రయాణం కొనసాగించే స్థితి లాంటిదే ఇది! మళ్ళీ శ్వాసించడం ప్రారంభించగానే మనస్సు విజృంభిస్తుంది. కోర్కెలు రెక్కలు విప్పుకొని, వాసనలు తిరిగి తలెత్తి సాధకుణ్ణి యథాపూర్వస్థితిలోకి నెట్టివేస్తాయి. మనస్సు, ప్రాణం, శ్వాస... ఇవన్నీ స్థితులే. ఇవి తమ శక్తిని ఆత్మ నుంచి గ్రహిస్తాయి. ఆత్మ అన్నిటినీ కదిలిస్తుందే కాని, తాను కదలదు. వస్తుసముదాయం తన చుట్టూనే ఉన్నా, దేనినీ తనదని భావించడు. ఏమీ లేక పోయినా సార్వభౌమునిలాగా ఉంటాడు.

దేహం జడం! అందులో ఆత్మ చైతన్యంగా ఉంది. ఆలోచనా సమూహమంతా మనసుగా రూపును సంతరించుకుంది. మనసు ఒకసారి నాశనమైతే తిరిగి రాదు. కనుక మనస్సు తన అస్తిత్వాన్నీ, ఉనికినీ, వ్యక్తిత్వాన్నీ, స్వభావాన్నీ శాశ్వతంగా పోగొట్టుకుని, శుద్ధచైతన్యంలో లయిస్తుంది. అంటే దేహాత్మ భావన నుంచీ, మనస్సు ఆత్మలో ఒక భాగమై, చివరకు తాను ఆత్మగా వెలుగుతుంది. అక్కరలేని దానిని పోగొట్టుకుంటేగాని కావలసిన దానిని పొందలేం. హృదయంలో లీనమైన మనస్సు... ఆత్మ గురించిన ఒకే చింతనలో ఉండగలిగితేనే నాశనమవుతుంది.

ఈ స్థితిని తీవ్రసాధన ద్వారా పొందాలి. ఈ చింతన వల్ల మనస్సుకు ఉన్న లక్షణాలన్నీ నశించి, ఆత్మగా సంస్థితమవుతుంది. ద్వైతభావం నశించి 'సమస్తమూ ఆత్మే' అనే భావన మిగిలిపోతుంది. రాగద్వేషాలు, అహంకార మమకారాలు నశిస్తాయి. ఆత్మ మాదిరిగా దివ్య ప్రేమతరంగాలు అంతా ప్రసరిస్తాయి. ఆ స్థితిని అందుకున్న వాడే జ్ఞాని.

అటువంటి జ్ఞానికి చేయాల్సిన కర్మలంటూ ఏమీ ఉండవు. ఉన్నదంతా సాక్షీభూత స్థితే! ఒకవేళ కర్మలను ఆచరించినా, అవి సమస్తలోకాల కల్యాణ నిమిత్తమే! కనుక, అంటేదీ లేదు... అంటించుకునేదీ లేదు. తామరాకు మీద నీటి బిందువుగా ఉంటాడు. కానీ ఆచరిస్తున్న కర్మలన్నిటినీ పూర్ణప్రజ్ఞతో చేస్తాడు.

జ్ఞాని నిత్యసుఖి. ఆనందం ఆకారం ధరించినవాడు. నిర్వికారుడు. నిరామయుడు. నిరంజనుడు. నిర్వికల్పుడు. సమస్త పోయినా సార్వభౌమునిలాగా ఉంటాడు. ఏ కర్మగానీ, ఏ వస్తువుగానీ, ఏ వ్యక్తి గానీ - ఆయనకు ఆనందం కలిగించలేవు. నిజానికి అందరికీ, అన్నిటికీ ఆనందాన్ని ఇవ్వగలిగిన స్థితి జ్ఞానిది.

మనసు ఇంద్రియాల ద్వారా బయట ప్రపంచాన్ని చూడాడానికే ప్రయత్నిస్తుంది. ఆ వాసనను తొలగించుకొని మనస్సు ఆత్మగా నిలకడ చెందిన అనంతరం, పరిపూర్ణ జ్ఞానం సిద్ధిస్తుంది. కనుక ఇక మిగిలింది తత్వదర్శనమే!

ఆందోళనకూ- ఆనందానికీ, బంధనకూ- మోక్షానికీ మనస్సే మూలం! మనస్సు లేకపోతే కథా లేదు, వ్యధా లేదు. ఆ విధంగానే ఈ 'నేను' ఎక్కడ నుండి మొదలవుతున్నదో అన్వేషించడం మొదలుపెడితే దేహపరమైన 'నేను' నశిస్తుంది. ఇదే ఆత్మాన్వేషణలో తొలి మెట్టు.

దేహమే 'నేను' అనుకోవడమే అహంకారం. నేను దేహం మాత్రమే కాదనుకోవడమే అహం స్ఫురణ.

అహం నశించి, అహం స్ఫురణ కలగగానే ఆత్మాన్వేషణ తీవ్రమవుతుంది. అజ్ఞానం, అహంకారం, అస్పష్టత, అవిద్య నశించి పరిపూర్ణమైన శుద్ధాత్మ అనుభవంలోకి వస్తుంది. ఆ పై అనుభవమూ నశిస్తుంది. ఉనికి మాత్రమే మిగులుతుంది. దేహభావం నశించినందున జ్ఞాని లోకాన్ని అభేదంతో, అద్వైతంగా, ఆత్మమయంగా దర్శిస్తాడు. అప్పుడు అన్నీ పోగా ఆత్మ మిగులుతుంది. ఇదే శ్రీరమణుల మార్గంలో దర్శించాలల్సిన తత్త్వం.

● **వి.ఎస్.ఆర్.మూర్తి**

సందేశం

# సంకల్పం మంచిదయితే...

చాలా కాలం క్రితం మాట...

ఒక మంచి మనిషికి అతని అవసరం నిమిత్తం కొంత డబ్బు కావలసి వచ్చింది. తెలిసిన వ్యక్తి దగ్గరకు వెళ్ళాడు. తన బాధను వివరించి, 50 వరహాలు అప్పుగా కావాలని దీనంగా అభ్యర్థించాడు. ఆ వ్యక్తి జమానతు కానీ, సాక్ష్యం కానీ తీసుకురమ్మన్నాడు. అప్పుకోసం అతని దగ్గరకు వెళ్ళిన వ్యక్తి "నేను అల్లాహ్‌ను సాక్షిగా, జమానతుగా పెడుతున్నాను" అని చెబుతూ, విశ్వాసంతో తనకు అప్పు ఇవ్వాల్సిందిగా మరోసారి అభ్యర్థించాడు.

అప్పు ఇచ్చే వ్యక్తి కూడా దైవ భక్తిపరాయణుడే. కాబట్టి అతని మాటను నమ్మి, దైవసాక్షిగా అతనికి కావలసిన 50 వరహాలను అప్పు ఇచ్చాడు. వారిద్దరూ పరస్పర అంగీకారంతో కొన్ని నెలలు గడువు పెట్టుకున్నారు. ఆ వరహాలను తీసుకున్న వ్యక్తి దైవానికి కృతజ్ఞతలు చెప్పుకొంటూ, సంతోషంగా ఇంటికి బయలుదేరాడు.

కొన్ని రోజుల తరువాత మంచి వ్యాపారం చేయాలనే ఆలోచనతో అతను వేరే దేశానికి వెళ్ళిపోయాడు. ఆ తరువాత అప్పు తీర్చాల్సిన సమయం దగ్గర పడింది. దానికి సరిపోయే మొత్తాన్ని సిద్ధం చేసుకొని, స్వదేశానికి బయలుదేరాడు. భూమార్గంలో వెళ్ళాలని మొదట అనుకున్నా, దానికి చాలా రోజులు పడుతుందని గ్రహించి, ఓడలో ప్రయాణించాలని అనుకున్నాడు. అతను సముద్రం దగ్గరకు వెళ్ళేసరికి వాయుగుండం మొదలయింది. అప్పు తీర్చాల్సిన గడువు చివరికి వచ్చింది. అనుకున్న సమయానికి ధనాన్ని తిరిగి ఇవ్వలేకపోతున్నాననీ, వాగ్దానాన్ని నిలబెట్టుకోలేకపోతున్నాననీ బాధ ఒక వైపు... ఏమీ చేయలేని నిస్సహాయత మరోవైపు. కర్తవ్యం ఏమిటో అర్థంకాక తలపట్టుకున్నాడు.



ఈలోగా అతనికి ఒక ఆలోచన వచ్చింది. కలం, కాగితం తీశాడు. తన అప్పు తీర్చాల్సిన వ్యక్తిని ఉద్దేశించి ఉత్తరం రాశాడు. ఒక చెక్క పెట్టెలో ఆ లేఖనూ, 50 వరహాలను ఉంచి, దైవ నామాన్ని స్మరించి, ఆ పెట్టెను సముద్రంలో వదిలిపెట్టాడు.

అతను మంచివాడు, నిజాయితీపరుడు, వాగ్దానాన్ని నిలబెట్టుకొనే వాడు కాబట్టి, అనుకున్న సమయానికి తన ఇంటికి వస్తాడనీ, అతన్ని ఆప్యాయంగా ఆహ్వానిద్దామనీ అప్పు ఇచ్చిన వ్యక్తి కూడా అనుకున్నాడు. కానీ ఎంత సేపు ఎదురుచూసినా అప్పు తీర్చాల్సిన మనిషి రాలేదు. సాయంత్రం అయింది. చేపలు పట్టడానికి ఆ రుణదాత బయలుదేరాడు. అతనికి ఒక పెద్ద చేప దొరికింది. అతను ఇంటికి బయలుదేరుతూ ఉంటే, ఒక చెక్కపెట్టె తీరం వెంబడి కొట్టుకురావడం కనిపించింది. అది దగ్గరకు రాగానే దాన్ని తీసుకొని ఇంటికి వచ్చాడు. దాన్ని తెరిచి చూస్తే అందులో 50 వరహాలతో పాటు తన పేరుతో ఉత్తరం కూడా ఉంది.

కొన్నాళ్ళ తరువాత, అప్పు తీసుకున్న వ్యక్తి వచ్చాడు. అనుకున్న సమయానికి అప్పు తీర్చలేనందుకు సంజాయిషీ చెప్పుకున్నాడు. వాగ్దానం నిలబెట్టుకోలేనందుకు పశ్చాత్తాపం చెందుతూ, 50 వరహాల సంచిని సగౌరవంగా సమర్పించాడు. రుణదాత తనకు చెక్క పెట్టెలో దొరికిన వరహాలనూ, తన పేర రాసిన ఉత్తరాన్నీ చూపించాడు. అతని నిజాయితీనీ, వాగ్దాన పాలన పట్ల అతనికి ఉన్న నిబద్ధతనూ ప్రశంసించాడు. తన పైకం తనకు ముట్టిందనీ, బాకీ తీరిపోయిందనీ చెప్పాడు.

మనసా, వాచా, కర్మణా దైవాన్ని విశ్వసించే వారికి, ఇచ్చిన మాట నెరవేర్చాలనే సత్సంకల్పం ఉన్న వారికి దైవం నుంచి సహాయం తప్పకుండా లభిస్తుంది.

● **మహమ్మద్ వహీదుద్దీన్**

దైవమార్గం

# చింతనతోనే మార్పు!



మరో నాలుగు రోజుల్లో కొత్త సంవత్సరంలోకి ప్రవేశిచబోతున్నాం. చాలా మందికి, కొత్త సంవత్సరం ఒక సెలవు రోజు. కానీ కొద్ది మందికి మాత్రం అది గడచిన రోజుల గురించి విశ్లేషించుకొని, రాబోయే కాలాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలని ఆలోచించడానికి ఒక అవకాశం. కాలం అనేది దేవుడి నుంచి మనకు అందివచ్చిన అపురూపమైన బహుమతి. దాన్ని సద్వినియోగం చేసుకోవాలి. దైవానికి మరింత చేరువ కావడం కోసం లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. అయితే లక్ష్యాలను నిర్ణయించుకోవడానికి ముందు, మనం కోరుకొనే మార్పు మన హృదయాల నుంచి ప్రారంభం కావాలి. దైవ చింతన మంచి ఆలోచనలకు దారితీస్తుంది. దేవుడి వెలుగులో మన పాపాలన్నీ మన కళ్లకు కడతాయి. వాటి నుంచి విముక్తులం అయ్యే మార్గాలు కనిపిస్తాయి. సృష్టిలో ఎవరూ పరిపూర్ణులు కారు. కానీ గతంలో చేసిన పొరపాట్ల నుంచీ పాఠాలను నేర్చుకోవాలి. ఏది ఎప్పుడు చెయ్యాలో దేవుడికి తెలుసు. విశ్వాసి చేయాల్సింది ఆయన కృప కోసం నిరీక్షించడమే!

నవజీవన వేదం

# ఇంద్రియాలను నియంత్రించాలి!



ఇంద్రియాలు ఒక విషయం మీదకు మనసును లాగేస్తున్నప్పుడు మొదట్లోనే జాగ్రత్త పడకపోతే ఆ వ్యామోహంలో పడి ఎలా కొట్టుకుపోతారో శ్రీకృష్ణపరమాత్మ చెబుతున్నాడు.

**ఇంద్రియాణాం హి చరతాం యన్మనోను విధీయతే**
**తదస్య హరతి ప్రజ్ఞాం**
**వాయుర్నావమివాంభసి!**

కళ్లు ఎప్పుడూ ఏదో ఒకటి చూస్తూనే ఉంటాయి. తెరిచే ఉంటాయి కాబట్టి ఏదో ఒకటి చూస్తాయి. చూడకుండా కన్ను ఉండలేదు. వినకుండా చెవి ఉండలేదు. నోరు కాలక్షేపానికి కొన్ని, మొహమాటానికి కొన్ని మాటలు మాట్లాడుతూనే ఉంటుంది. కొన్ని మాటల మీద మనకు దృష్టి ఉండదు. అలా మాట్లాడుతూనే ఉంటాం. ఏం పని లేకపోయినా ఇంట్లో అటూ ఇటూ తిరుగుతూ ఉంటాం. ఐదు నిమిషాలు చేయి కదపకుండా కూర్చోలేం. అయితే మన మనస్సు దాంట్లో లగ్నం కాకుండా చూసుకోవాలి. మనస్సు దాన్ని అనుసరించి నడవడంలోనే ఉంది అసలు ఇబ్బంది! అనుసరించడంలో ఏమవుతుంది? 'తదస్య హరతి ప్రజ్ఞాం'.. అంటే బుద్ధికి ఉండే ప్రజ్ఞను హరిస్తుంది. ఎలా అంటే... 'వాయుర్నావమివాంభసి'...తుపాను గాలిలో చిక్కుకున్న పడవ పరిస్థితిలా అవుతుంది. అలా ఇంద్రియాలు ఒక్కోసారి మనను లాగేస్తాయి. ప్రజ్ఞను కోల్పోయినప్పుడు ఆ పరిస్థితి ఎదురవుతుంది. అందుకే ముందే జాగ్రత్తపడాలి.



● **డా. గరికిపాటి నరసింహారావు**

# రజనీకాంత్ 'దుమ్ దుమ్'


నయనతార, రజనీకాంత్

రజనీకాంత్, నయనతార జంటగా ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహించిన చిత్రం 'దర్బార్'. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై భారీ వ్యయంతో, అత్యున్నత సాంకేతిక విలువలతో ఎ. సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. ఇందులో రజనీకాంత్ కుమార్తెగా నివేదా థామస్ కనిపిస్తారు. సంక్రాంతి కానుకగా జనవరి 9న ఎన్వీ ప్రసాద్ తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. పెళ్లి నేపథ్యంలో కృష్ణకాంత్ రచించిన 'దుమ్ దుమ్' పాటను గురువారం విడుదల చేశారు. గేయ రచయిత కృష్ణకాంత్ మాట్లాడుతూ "ఓ యువ జంటకు పెళ్ళయ్యే సందర్భంలో వచ్చే ఎనర్జిటిక్ సాంగ్ ఇది. పెళ్లికి ముందు, తర్వాత భార్యభర్తలు ఎలా ఉంటారు? అన్న పిలాసఫీతో సాగే ఈ గీతాన్ని తమిళంలో వివేక్ రాశారు. తెలుగులో ఆ అవకాశం నాకు రావడం అదృష్టంగా భావిస్తున్నా. ఇంత త్వరగా రజనీకాంత్ గారి సినిమాలో పాట రాసే అవకాశం వస్తుందని ఊహించలేదు. ఇదొక కలలా ఉంది. సంగీత దర్శకుడు అనిరుద్ రవిచంద్రన్‌తో నాలుగు సినిమాలకు పనిచేశా. నన్ను గుర్తుంచుకుని పిలిచి మరీ అవకాశం ఇచ్చారు" అని తెలిపారు.

## అందంతో చంపేసేలా ఉన్నావే!


సారా అలీఖాన్

బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ గారాలపట్టి సారా అలీఖాన్‌కు సోషల్ మీడియాలో ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె ఖాతా తెరచిన కొన్ని రోజులకే 20 లక్షల మందికి పైగా ఆమెను ఫాలో అయ్యారంటే యూత్‌లో ఆమెకు ఏ రేంజ్ ఫాలోయింగ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. తాజాగా సారా స్నేహితులతో కలిసి విహారయాత్రకు వెళ్లారు. అక్కడ సముద్రం తీరాన బికినీలో హాట్‌హాట్‌గా దిగిన ఫొటోలను ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఆ ఫొటోలు చూసి కుర్రకారు కవిత్వాలు రాశారు. కామెంట్లు మొదలుపెట్టారు. 'నీ అందాలతో చంపేసేలా ఉన్నావే' అని ఒక నెటిజన్ కామెంట్ చేస్తే, 'ఈ భూమ్మీద నీ అంత సెక్సియస్ట్ అమ్మాయి లేదు' అంటూ మరో అభిమాని ఆమె అందాన్ని వర్ణిస్తూ కామెంట్ చేశారు. సారా యాక్ట్ చేసింది రెండు సినిమాల్లోనే. అయినా స్టార్ హీరోయిన్‌కు ఉండాల్సినంత క్రేజ్ ఆమెకు ఉంది. ప్రస్తుతం సారా 'కూలీ నం.1' చిత్రంతోపాటు ఇంతియాజ్ అలీ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు.




## వారి జోక్యం లేదు

- రితేశ్ రానా



"కొత్తవాళ్లకు పేరున్న నిర్మాణ సంస్థలో అవకాశం రావడం అరుదు. మైత్రీ మూవీస్‌లాంటి బ్యానర్‌లో అవకాశం వచ్చింది కాబట్టి మమ్మల్ని మేము నిరూపించుకోవాలని తపనతో పనిచేశాం." అని రితేశ్ రానా అన్నారు. కీరవాణి తనయుడు శ్రీసింహా హీరోగా ఆయన దర్శకత్వం వహించిన 'మత్తు వదలరా' చిత్రం ఇటీవల విడుదలైంది. సినిమాకు వస్తున్న స్పందన గురించి దర్శకుడు రితేశ్ గురువారం విలేకర్లతో మాట్లాడారు. "పదేళ్లుగా లఘు చిత్రాలు చేస్తున్నా. మూడేళ్ల క్రితం చెర్రీకి ఈ కథ చెప్పా. కొత్తవాళ్లమైనా మా మీద నమ్మకంతో ఈ సినిమా బాధ్యత అప్పగించారు. 'హూ డన్ ఇన్' అనే జోనర్‌లో ఈ కథ రాశా. క్రైమ్ చేసిన వ్యక్తిని అన్వేషించే ఉత్కంఠభరిత కథ కావడంతో ప్రేక్షకులు బాగా కనెక్ట్ అయ్యారు. మూడేళ్ల క్రితం కథ అయినా ఎలాంటి మార్పు చేయకుండా తెరకెక్కించే స్వేచ్ఛనిచ్చారు నిర్మాతలు. సినిమాకొస్తున్న స్పందన చూస్తుంటే నిర్మాతలు మాపై ఉంచిన నమ్మకానికి న్యాయం చేశామనిపిస్తుంది. ప్రతి విషయంలో నిజాయతీగా కష్టపడ్డాం కాబట్టే సినిమాకు ఆదరణ బావుంది. సింహా, కాలభైరవ కుటుంబ సభ్యులు ఎవరూ ఈ సినిమా విషయంలో జోక్యం చేసుకోలేదు. ప్రస్తుతం మూడు కథలు సిద్ధంగా ఉన్నాయి. ఎవరితో అన్న విషయంలో ఇంకా క్లారిటీ లేదు" అని చెప్పారు.




## గు గు గు గూఢచారి...

యాదాకృష్ణ టైటిల్ పాత్ర పోషిస్తూ, నిర్మిస్తున్న చిత్రం 'గూఢచారి 786'. రాజ్ సుందర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల రిథమ్ స్టూడియోలో 'గు గు గు గూఢచారి 786' అంటూ సాగే టైటిల్ సాంగ్‌ను రికార్డ్ చేశారు. యాదా కృష్ణ మాట్లాడుతూ "క్రైమ్ డిటెక్టివ్, కామెడీ, ఫ్యామిలీ డ్రామాతో రూపొందుతున్న చిత్రమిది. ఆరు పాటలు, ఐదు పోరాటాలు ఉంటాయి. పాటల రికార్డింగ్ పూర్తి చేసి, జనవరి 30 నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతాం" అని తెలిపారు.


యాదాకృష్ణ

## మంచి సినిమాను అందరికీ చేరవేయాలి

- బన్నీ వాసు

శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగిన యదార్థ సంఘటనలు, పాత్రల ఆధారంగా కరుణ కుమార్ దర్శకత్వం వహించిన చిత్రం 'పలాస 1978'. రక్షిత్, నక్షత్ర జంటగా నటించారు. తమ్మారెడ్డి భరద్వాజ సమర్పణలో ధ్యాన్ అట్లూరి నిర్మించిన ఈ చిత్రాన్ని జీఏ2-యువీ క్రియేషన్స్ సంస్థల ద్వారా విడుదల చేస్తున్నారు. "పలాస' సినిమా మాకు బాగా నచ్చింది. మంచి సినిమాను ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లాలన్న తపనతో ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి ముందుకొచ్చాం" అని బన్నీ వాసు తెలిపారు. జనవరి చివరి వారంలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత ధ్యాన్ అట్లూరి అన్నారు. ఈ చిత్రానికి రఘు కుంచె సంగీతం అందించారు.


నక్షత్ర, రక్షిత్









| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం | వెండి (కిలో) | రూపాయి (ఒక డాలరుకు) | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| 41,163.76 | 12,126.55 | 38,791 | 46,520 | 71.31 | 67.43 |
| 297.50 | 88.00 | 346 | 890 | 4 పైసలు | |

ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)

# టాటా బోర్డుల్లోకి మిస్త్రీ నామినీలు!

న్యూఢిల్లీ: టాటా సన్స్ బోర్డు ఛైర్మన్‌గానే కాదు, బోర్డు సభ్యుడిగానూ బాధ్యతలు చేపట్టేందుకు సైరస్ మిస్త్రీ ఆసక్తిగా లేరని సమాచారం. తన తరఫున నామినీలను బోర్డుల్లో నియమించే అవకాశం ఉంది. తాను నియమించబోయే నామినీ డైరెక్టర్ల ద్వారా బయటి నుంచే టాటా సన్స్ బోర్డు వ్యవహారాలను పర్యవేక్షించాలని మిస్త్రీ భావిస్తున్నట్లు తెలిసింది. 2016 అక్టోబరులో టాటా సన్స్ బోర్డు సైరస్ మిస్త్రీని ఛైర్మన్ పదవి నుంచి తొలగించింది. మిస్త్రీ తొలగింపు తర్వాత టాటా సన్స్ తాత్కాలిక ఛైర్మన్‌గా రతన్ టాటా బాధ్యతలు చేపట్టారు. కొద్ది నెలలకు ఎన్ చంద్రశేఖరన్‌ను టాటా గ్రూపు ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా నియమించారు. అయితే, ఛైర్మన్‌గా తనను తొలగించడాన్ని సవాలు చేస్తూ మిస్త్రీ తొలుత జాతీయ కంపెనీల చట్టం ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)ని ఆశ్రయించారు. ట్రిబ్యునల్ టాటాల నిర్ణయాన్నే సమర్థించడంతో అప్పిలేట్ ట్రిబ్యునల్ గడపతొక్కారు. ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా మిస్త్రీని తిరిగి నియమించాలని, ఎన్ చంద్రశేఖరన్ నియామకం అక్రమమని ఈ నెల 18న ఎన్‌సీఎల్ఏటీ తీర్పు చెప్పింది. అయితే సుప్రీం కోర్టులో అప్పీలు చేసుకునేందుకు వీలుగా ఈ తీర్పు అమలు చేసేందుకు టాటా సన్స్‌కు నాలుగు వారాల సమయం ఇచ్చింది. త్వరలోనే టాటా సన్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ తీర్పును సర్వోన్నత న్యాయస్థానంలో సవాలు చేయవచ్చు. సుప్రీం కోర్టు సైతం అప్పిలేట్ ట్రిబ్యునల్ తీర్పునే సమర్థించినా.. ఆయన మాత్రం టాటా సన్స్ బోర్డు ఛైర్మన్‌గా పగ్గాలు చేపట్టకపోవచ్చని, డైరెక్టర్‌గానూ చేరే అవకాశాలు లేవని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. పైగా బోర్డు ఛైర్మన్‌గా మిస్త్రీ పదవీకాలం మరో 5 నెలల్లో ముగియనుంది.

## గ్రాన్యూల్స్ బోర్డుకు పార్థసారథి రాజీనామా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): గ్రాన్యూల్స్ ఇండియా బోర్డుకు సీ పార్థసారథి రాజీనామా చేశారు. ఇప్పటి వరకూ ఆయన కంపెనీ బోర్డులో స్వతంత్ర డైరెక్టర్‌గా ఉన్నారు. పార్థసారథి కార్వీ గ్రూప్ అధినేత, వ్యవస్థాపకుల్లో ఒకరు. ఖాతాదారుల షేర్లను తాకట్టు పెట్టి నిధులను గ్రూప్ కంపెనీలకు బదిలీ చేసిందని, ఖాతాదారులకు చెల్లింపులు చేయడం లేదన్న ఆరోపణలపై కార్వీ స్టాక్ బ్రోకింగ్ లైసెన్స్‌ను సెబీ సస్పెండ్ చేసింది. కష్టాల నుంచి గట్టెక్కడానికి కార్వీ వివిధ ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో గ్రాన్యూల్స్ బోర్డు నుంచి సీ పార్థ సారథి తప్పుకోవడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. పార్థసారథి రాజీనామాను బోర్డు పరిగణనలోకి తీసుకుందని, డిసెంబరు 26 నుంచి ఆయన రాజీనామా అమలులోకి వస్తుందని గ్రాన్యూల్స్ ఇండియా వెల్లడించింది. రాజీనామా లేఖను 24న పంపారని.. 26న కంపెనీకి అందిందని వివరించింది. గ్రాన్యూల్స్ ఇండియా ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సీ కృష్ణ ప్రసాద్, బోర్డు ఇంత వరకూ తనకు ఇచ్చిన మద్దతుకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు లేఖలో పార్థసారథి పేర్కొన్నారు.

## ప్రధాన మద్దతు 12150

టెక్ వ్యూ

నిఫ్టీ పాజిటివ్‌గా ప్రారంభమైనా 12200 వద్ద విఫలమై కరెక్షన్‌లో పడింది. తదుపరి రోజంతా బలహీనతను కొనసాగిస్తూ చివరికి 85 పాయింట్ల నష్టంతో ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 12150 కన్నా దిగువనే క్లోజయింది. కొద్ది రోజులుగా గరిష్ఠ స్థాయిల నుంచి ఏర్పడిన కరెక్షన్ ట్రెండ్ టెక్నికల్‌గా కొనసాగుతోంది. ఈ స్థాయిలో నిలదొక్కుకోలేకపోవడం వల్ల స్వల్పకాలిక కరెక్షన్‌లో కూడా ప్రవేశించిందని చెప్పవచ్చు. ట్రెండ్‌లో సానుకూలత కోసం బలమైన పునరుజ్జీవం అవసరం. వీక్లీ చార్టుల కోసం సయితం శుక్రవారంనాటి ముగింపు అత్యంత కీలకం.

**శుక్రవారం స్థాయిలివే...**

**నిరోధం : 12160 మద్దతు : 12080**

- రికవరీ బాట పడితే మరింత అప్‌ట్రెండ్ కోసం నిరోధ స్థాయి 12160 కన్నా పైన బలంగా క్లోజ్ కావాలి. ప్రధాన నిరోధం 12230.
- 12150 వద్ద విఫలమైతే మరింత బలహీనతకు ఆస్కారం ఉన్నట్టు సంకేతం ఇస్తుంది. మద్దతు స్థాయి 12080 కన్నా దిగజారితే మరింత బలహీనతలో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 12000. ఇక్కడ రికవరీకి ఆస్కారం ఉంది.

■ వి.సుందర్ రాజా

## మిడ్‌సెషన్ బలం

ఆస్ట్రో వ్యూ

**తిథి:** పుష్య శుక్ల పాడ్యమి; నక్షత్రం: పూర్వాషాఢ

**అప్రమత్తం:** మృగశిర, చిత్త, ధనిష్ఠ నక్షత్ర జాతకులు, మకర, వృషభ రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**ట్రెండ్ మార్పు వేళలు : 11.15**

**ధోరణి:** నిఫ్టీ ఫ్యూచర్స్ నిస్తేజంగా ప్రారంభమై 10.20 వరకు అదే ధోరణిలో ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత 12 గంటల వరకు నిస్తేజంగాను, తదుపరి 1.30 వరకు మెరుగ్గాను ట్రేడయ్యే ఆస్కారం ఉంది. ఆ తర్వాత తిరిగి 3 గంటల వరకు నిలకడగా మారి చివరిలో మరోసారి మెరుగ్గా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

**ట్రేడింగ్ వ్యూహం:** నిఫ్టీ ఫ్యూచర్స్ 10.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 11.45 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 12.15 తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని 1.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

**నిరోధం : 12165, 12200**

**మద్దతు స్థాయిలు : 12085, 12050**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

**గమనిక:** ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinancialastrologer.blogspot.in

# రిలయన్స్ రిటైల్ @ రూ. 2.4 లక్షల కోట్లు

## వాటాదారులకు షేర్ల మార్పిడి పథకం ప్రకటన

### 4 షేర్లకు ఒక ఆర్ఐఎల్ షేరు కేటాయింపు




న్యూఢిల్లీ: ముకేశ్ అంబానీకి చెందిన రిటైల్ వ్యాపార స్టోర్ల నిర్వహణ సంస్థ రిలయన్స్ రిటైల్ తన వాటాదారుల కోసం షేర్ల మార్పిడి పథకాన్ని ప్రకటించింది. ఇందులో భాగంగా రిలయన్స్ రిటైల్ వాటాదారులకు ప్రతి 4 ఈక్విటీ షేర్లకు గాను రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్)కు చెందిన ఒక షేరును కేటాయించనుంది. ఈ షేర్ల మార్పిడి పథకంలో భాగంగా రిలయన్స్ రిటైల్ వ్యాపార విలువను 3,400 కోట్ల డాలర్లు (రూ.2.4 లక్షల కోట్లు)గా లెక్కగట్టారు. ఈ సంస్థ రిలయన్స్ రిటైల్ వెంచర్స్‌కు చెందిన అన్‌లిస్టెడ్ అనుబంధ విభాగం. మాతృసంస్థ ఆర్ఐఎల్‌కు పరోక్ష అనుబంధ విభాగం. గురువారం బీఎస్ఈలో షేరు ధర రూ.1,515.95 వద్ద ముగియడంతో ఆర్ఐఎల్ మార్కెట్ విలువ రూ.9.6 లక్షల కోట్లుగా నమోదైంది.

**దేశంలో అతిపెద్ద రిటైల్ సంస్థ**

రిలయన్స్ రిటైల్ దేశంలోనే అతిపెద్ద రిటైల్ స్టోర్ల నిర్వహణ సంస్థ. ఈ కంపెనీకి దేశవ్యాప్తంగా 10,901 స్టోర్లున్నాయి. గత ఏడాది సంస్థ నికర విక్రయాలు రూ.1.3 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. సెప్టెంబరు త్రైమాసికంలో కంపెనీ ఆదాయం 27 శాతం వృద్ధి చెంది రూ.41,202 కోట్లకు చేరుకుంది. నిర్వహణ లాభం 66.8 శాతం ఎగబాకి రూ.2,322 కోట్లుగా నమోదైంది. డీమార్ట్ పేరుతో దేశంలో అతిపెద్ద గొలుసుకట్టు సూపర్ మార్కెట్లను నిర్వహిస్తోన్న అవెన్యూ సూపర్‌మార్ట్‌తో పోలిస్తే రిలయన్స్ రిటైల్ విలువ రెట్టింపు. బ్రిటన్ రిటైల్ దిగ్గజం టెస్కో మార్కెట్ విలువ (3,200 కోట్ల డాలర్లు)తో పోల్చినా ఎక్కువే.

**వ**చ్చే ఐదేళ్లలో రిలయన్స్ రిటైల్‌ను స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేయాలనుకుంటున్నట్లు ఆగస్టులో జరిగిన ఆర్ఐఎల్ వాటాదారుల వార్షిక సమావేశంలో ముకేశ్ అంబానీ ప్రకటించారు. అయితే స్కీమ్ ఆఫ్ అరేంజ్‌మెంట్ కింద రిలయన్స్ రిటైల్ 2006, 2007 సంవత్సరాల్లో ఉద్యోగులకు స్టాక్ ఆప్షన్లను కేటాయించింది.

**ఈక్విటీ కలిగిన ఉద్యోగులకు ..**

ఇప్పటికే కొంత మంది ఉద్యోగులు ఈ స్టాక్ ఆప్షన్స్‌ను కంపెనీ ఈక్విటీ షేర్లుగా బదలాయించుకున్నారు. వాటిని ద్రవ్య రూపంలోకి మార్చుకునేందుకు వీలుగా ఎగ్జిట్ ఆప్షన్‌ను కల్పించాలని ఉద్యోగుల నుంచి అభ్యర్థనలు అందుతున్నాయని, వారి కోసమే షేర్ల మార్పిడి పథకాన్ని ప్రకటించినట్లు రిలయన్స్ రిటైల్ వెల్లడించింది. ప్రస్తుతం కంపెనీలో రిలయన్స్ రిటైల్ వెంచర్స్‌కు 99.95 శాతం వాటా ఉంది. మిగతా 0.05 శాతం వాటా మాత్రమే ఉద్యోగుల చేతుల్లో ఉంది. షేర్ల మార్పిడి పథకం ద్వారా 0.05 శాతం వాటా కలిగిన ఉద్యోగులకు తమ ఈక్విటీని ఆర్ఐఎల్ షేర్ల రూపంలోకి మార్చుకునే అవకాశం కల్పిస్తోంది.




డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ స్మారక తపాలా స్టాంప్‌ను విడుదల చేస్తున్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

## ప్రభుత్వ బ్యాంకుల సీఈఓలతో రేపు నిర్మలా సీతారామన్ భేటీ

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారంనాడు ప్రభుత్వరంగ బ్యాంకుల సీఈఓలతో భేటీకానున్నారు. ఈ సందర్భంగా బ్యాంకుల ఆర్థిక పనితీరుతోపాటు వ్యాపార వృద్ధి ఏవిధంగా ఉందన్న దానిపై సమీక్ష నిర్వహించనున్నారు. 2020-21 బడ్జెట్ నేపథ్యంలో బ్యాంకుల ఎండీ, సీఈఓలతో ఆర్థిక మంత్రి సమావేశంకానుండటం ప్రాధాన్యం సంతరించుకుంటోంది. సమావేశంలో భాగంగా ఎన్‌సీఎల్‌టీ, నాన్ ఎన్‌సీఎల్‌టీల ద్వారా మొండి పద్దుల రికవరీ ఏవిధంగా ఉందన్న దాని గురించి చర్చ జరగనున్నట్టు అధికారవర్గాల ద్వారా తెలిసింది. గత నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో బ్యాంకులు రూ.4,01,393 కోట్లు రికవరీ చేశాయి. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ.1,56,702 కోట్లు రికవరీ చేయడం విశేషం.

### పీఎన్‌బీ రూ.1,500 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: బాసెల్-3 బాండ్ల జారీ ద్వారా రూ.1,500 కోట్లు సమీకరించినట్లు పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ప్రకటించింది. వ్యాపార విస్తరణకై ఈ నిధులను వినియోగిస్తామని తెలిపింది. ప్రైవేట్ ప్లేస్‌మెంట్ ప్రాతిపదికన ఏడాదికి 8.15 శాతం వడ్డీతో, ఒక్కొక్కటి రూ.10 లక్షల విలువైన 15 వేల బాండ్లను కేటాయించినట్లు తెలిపింది.

### మణప్పురం ఫైనాన్స్ రూ.350కోట్ల సమీకరణ

ప్రైవేట్ ప్లేస్‌మెంట్ ప్రాతిపదికన ఈక్విటీలుగా మార్చేందుకు వీలులేని డిబెంచర్ల (ఎన్‌సీడీ) జారీ ద్వారా రూ.350 కోట్ల వరకూ నిధుల్ని సమీకరించనున్నట్లు మణప్పురం ఫైనాన్స్ తెలిపింది. ఒక్కొక్కటి రూ.10 లక్షల ముఖవిలువ ఉన్న ఎన్‌సీడీలను రూ.350 కోట్ల మేర జారీ చేసేందుకు సంస్థ బోర్డు ఆమోదం తెలిపింది.

## జీఎస్‌టీ ఎగవేత రాకెట్ పట్టివేత

న్యూఢిల్లీ: ఢిల్లీలో రూ.1,600 కోట్ల విలువ గల నకిలీ ఇన్‌వాయిస్‌లు సృష్టించడం ద్వారా రూ.241 కోట్ల జీఎస్‌టీ ఎగవేసిన ఒక రాకెట్ గుట్టురట్టయింది. ఢిల్లీ సౌత్ సీజీఎస్‌టీ కమిషనరేట్ అధికారులు ఈ పన్ను ఎగవేత రాకెట్‌ను గుర్తించారు. వారిలో ప్రధాన నిందితుని పట్టుకుని స్థానిక కోర్టులో హాజరు పరచగా 10 రోజుల జుడీషియల్ కస్టడీకి పంపినట్టు ఆర్థికమంత్రిత్వ శాఖ తెలిపింది. నిందితుడు పలువురు వ్యక్తుల గుర్తింపు డాక్యుమెంట్లను అనధికారికంగా సంపాదించి పలు నకిలీ సంస్థలు సృష్టించినట్టు అధికారుల పరిశీలనలో తేలింది. ఇన్వర్టెడ్ డ్యూటీ స్ట్రక్చర్ కింద నిధుల వాపసు సదుపాయాన్ని అక్రమంగా వినియోగించుకోవడమే లక్ష్యంగా ఈ వ్యవహారం సాగిందంటున్నారు. ఇప్పటివరకు నిందితుడు సృష్టించిన 120 నకిలీ సంస్థలను గుర్తించినట్టు అధికారులు తెలిపారు.

## జాన్సన్ అండ్ జాన్సన్‌కు రూ.230 కోట్ల జరిమానా

న్యూఢిల్లీ: జాన్సన్ అండ్ జాన్సన్ ఇండియాకు జాతీయ యాంటీ-ప్రాఫిటీరింగ్ అథారిటీ (ఎన్ఏఏ) రూ.230.4 కోట్ల భారీ జరిమానా విధించింది. జాన్సన్ అండ్ జాన్సన్ విక్రయించే కొన్ని ఉత్పత్తులపై గతంలో జీఎస్‌టీ తగ్గించినప్పటికీ కంపెనీ మాత్రం వాటి ధరలు తగ్గించకుండా రూ. 230.4 కోట్ల మేర అక్రమ లాభాలు ఆర్జించినట్లు ఎన్ఏఏ గుర్తించింది. ఈ మొత్తాన్ని పెనాల్టీగా 3 నెలల్లో చెల్లించాలని ఆదేశించింది. కంపెనీ ఈ మొత్తానికి ఏటా 18 శాతం వడ్డీ కలిపి వినియోగదారుల సంక్షేమ నిధిలో జమ చేయాలి.

## రేటింగ్ ఏజెన్సీలకు భారీ జరిమానా

న్యూఢిల్లీ: ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన రేటింగ్ ఏజెన్సీలు ఇక్రా, కేర్, ఇండియా రేటింగ్స్‌కు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ జరిమానా విధించింది. ఒక్కో సంస్థకు రూ.25 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ గురువారంనాడు ఆదేశాలు జారీ చేసింది. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ నాన్ కన్వర్టబుల్ డిబెంచర్లకు క్రెడిట్ రేటింగ్ ఇచ్చే సమయంలో క్షుణ్ణంగా పరిశీలన జరపడంలో విఫలమైనందుకు గాను ఈ జరిమానాలను విధిస్తున్నట్టు సెబీ వెల్లడించింది.

# ఐపీఓలకు గడ్డుకాలం




**60% తగ్గిన నిధుల సమీకరణ.. ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న మందగమన ప్రభావం**

దేశ ఆర్థిక వ్యవస్థలో జోరు వృద్ధి నెలకొంటే కంపెనీలు రెట్టించిన ఉత్సాహంతో పెట్టుబడులు పెడుతుంటాయి. డిమాండ్ పెరిగే కొద్దీ ఉత్పత్తి సామర్థ్య విస్తరణ చేపడతాయి. నిధుల సమీకరణ కోసం స్టాక్ మార్కెట్లోకి ప్రవేశిస్తాయి. ఆర్థిక వ్యవస్థలో వృద్ధి నెమ్మదిస్తే మాత్రం కంపెనీలు నిధుల సమీకరణ విషయంలో పునరాలోచనలో పడతాయి. ఆచితూచి వ్యవహరించి తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు వస్తాయి. ఈ ఏడాదిలో చాలా కంపెనీలు ఇదే ధోరణితో వ్యవహరించాయి. అందుకే ప్రైమరీ మార్కెట్లోకి వచ్చిన ఐపీఓలు తక్కువగా ఉన్నాయి. వీటి నిధుల సమీకరణ మొత్తం కూడా ఏమంత గొప్పగా లేదు.

**రూ.12,362 కోట్ల సమీకరణ**

ఆ ఏడాదిలో పబ్లిక్ ఇష్యూల ద్వారా కంపెనీలు కేవలం రూ.12,362 కోట్లు సమీకరించాయి. క్రితం ఏడాది (రూ.30,959 కోట్లు)తో పోల్చితే నిధుల సమీకరణ 60 శాతం తగ్గింది. గత ఏడాదిలో 24 పబ్లిక్ ఇష్యూలు మార్కెట్లోకి వస్తే ఈ ఏడాది మాత్రం కేవలం 16 మాత్రమే వచ్చాయి. దేశ జీడీపీలో వృద్ధి రేటు నిరాశాజనకంగా మారడంతో కంపెనీలు వెనకడుగు వేశాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయ త్రైమాసికంలో వృద్ధి ఏడేళ్ల కనిష్ఠ స్థాయిలో 4.5 శాతంగా నమోదైంది. ఇది పుంజుకునే సంకేతాలు ఏమీ కనిపించడం లేదు. ఈ నేపథ్యంలోనే పబ్లిక్ ఇష్యూ ఆలోచనలను చాలా కంపెనీలు వాయిదా వేసుకున్నాయి. రూ.51,000 కోట్లకు పైగా నిధులను సమీకరించాలన్న లక్ష్యంతో 47 కంపెనీలు తమ ఐపీఓలకు సెబీ నుంచి అనుమతి తీసుకున్నాయి. కానీ క్యాపిటల్ మార్కెట్లోకి వచ్చేందుకు మాత్రం వెనుకడుగు వేశాయి.

- ఇదిలా ఉంటే.. కంపెనీలు నిధుల సమీకరణకు ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాయి. ఆఫర్ ఫర్ సేల్, క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్స్ ద్వారా ఈ ఏడాదిలో రూ.81,174 కోట్లు సమీకరించాయి. గత ఏడాది (రూ.63,651 కోట్లు)తో పోల్చితే ఈ నిధుల సమీకరణ 28 శాతం పెరిగింది. అయితే ఈ మొత్తం 2017 సంవత్సరం (రూ.1,60,032 కోట్లు) తో పోల్చితే మాత్రం 49 శాతం తక్కువ. 2017లో 36 ఐపీఓల ద్వారా కంపెనీలు రూ.67,147 కోట్లు, 2016లో 26 ఐపీఓల ద్వారా రూ.26,494 కోట్లు, 2015లో 15 ఇష్యూల ద్వారా రూ.13,614 కోట్లు, 2014లో 5 ఇష్యూలతో రూ.1,201 కోట్ల నిధులను కంపెనీలు సమీకరించాయి.
- ఇక 2019లో స్టెర్లింగ్ అండ్ విల్సన్ సోలార్ అతిపెద్ద ఐపీఓగా నిలిచింది. ఈ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.2,850 కోట్లు సమీకరించింది. 16 ఐపీఓల్లో కేవలం మూడు ఐపీఓలు మాత్రమే ఇంతకు ముందు పీఈ/వీసీ పెట్టుబడులను పొంది ఉన్నాయి. ఓఎఫ్ఎస్ ద్వారా పీఈ/వీసీ ఇన్వెస్టర్ల నిధుల సమీకరణ రూ.803 కోట్లుగా ఉంది. ఇది మొత్తం ఐపీఓ నిధుల సమీకరణలో కేవలం 6 శాతమే. ఓఎఫ్ఎస్‌తో ప్రమోటర్లు సమీకరించిన సొమ్ము రూ.7,513 కోట్లుగా ఉంది.

**తగ్గిన ఎస్ఎంఈ హడావుడి**

ఈ ఏడాదిలో ఎస్ఎంఈ ఐపీఓల హడావుడి తగ్గిపోయింది. ఐదేళ్ల క్రితం ఎస్ఎంఎస్ఈ ప్లాట్‌ఫామ్ కార్యకలాపాలు ప్రారంభించింది. అప్పటి నుంచి ఈ ఏడాదిలో ఐపీఓలు మొదటిసారి తగ్గాయి. ఈ ఏడాదిలో 50 ఎస్ఎంఈ ఐపీఓల ద్వారా కంపెనీలు రూ.621 కోట్లు సమీకరించాయి. గత ఏడాదిలో 141 ఇష్యూలతో సమీకరించిన మొత్తం రూ.2,287 కోట్లుగా ఉంది. 2017లో 133 ఇష్యూలు రూ.1,679 కోట్లు, 2016లో 67 ఇష్యూలు రూ.537 కోట్లు, 2015లో 43 ఇష్యూలు రూ.260 కోట్లు, 2014లో 40 ఐపీఓలతో రూ.267 కోట్లు సమీకరించాయి.

**ఏడు ఐపీఓలకు బ్రహ్మరథం**

ఈ ఏడాదిలో వచ్చిన ఏడు ఐపీఓలకు ఇన్వెస్టర్లు బ్రహ్మరథం పట్టారు. వీటిలో ఐఆర్‌సీటీసీ (109 రెట్లు అధిక స్పందన), ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ (100 రెట్లు అధిక స్పందన), సీఎస్‌బీ (48 రెట్లు), అఫిల్ (48 రెట్లు), పాలీ క్యాబ్ (36 రెట్లు), నియోజెన్ కెమికల్స్ (29 రెట్లు), ఇండియామార్ట్ ఇంటర్‌మెష్ (20 రెట్లు) ఉన్నాయి. ఒక ఇష్యూ మూడు రెట్లు ఓవర్‌సబ్‌స్క్రైబ్ అయింది. మిగతా ఏడు.. ఒకటి నుంచి మూడు రెట్లు అధిక స్పందనను పొందాయి.

**లిస్టింగ్‌లో జోరు**

15 ఐపీఓలు స్టాక్ మార్కెట్లో నమోదయ్యాయి. లిస్టింగ్ తేదీన ముగిసిన తేదీతో పోల్చితే వీటిలో ఏడు 10 శాతానికి పైగా రిటర్న్‌ను ఇచ్చాయి. ఐఆర్‌సీటీసీ 128 శాతం, సీఎస్‌బీ బ్యాంక్ 54 శాతం, ఉజ్జీవన్ 51 శాతం, ఇండియా మార్ట్ ఇంటర్‌మెష్ 34 శాతం, నియోజెన్ కెమికల్స్ 23 శాతం, పాలీక్యాబ్ 22 శాతం, అఫిల్ 17 శాతం రిటర్న్‌ను అందించాయి. డిసెంబరు 23న ముగిసిన షేర్ల ధరలతో పోల్చితే కేవలం రెండు ఐపీఓల షేర్లు మాత్రమే ఇష్యూ ధరకన్నా దిగువన ట్రేడవుతున్నాయి. మిగతా 13 షేర్లు 21 శాతం నుంచి 170 శాతం వరకు ఇష్యూ ధరకన్నా ఎగువన ట్రేడవుతున్నాయి.

## లోపాలున్న ఇంజన్లను మార్చుతాం

▸▸ గో ఎయిర్ వెల్లడి

న్యూఢిల్లీ: తాను నడిపిస్తున్న ఎయిర్‌బస్ ఏ-320 నియో జెట్‌లైనర్ విమానాల ఇంజన్లలో తరచూ సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో లోపాలున్న ప్రాట్ అండ్ విట్నీ 1100 సీరిస్ ఇంజన్లలో వచ్చే జనవరి 31 వరకు మార్చనున్నట్టు గోఎయిర్ తెలిపింది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) జారీ చేసిన ఆదేశాలకు కట్టుబడి ఉండనున్నట్టు కంపెనీ పేర్కొంది.

## సిటీకార్ప్‌తో అశోక్ లేలాండ్ జట్టు

న్యూఢిల్లీ: వాణిజ్య వాహనాలపై ఫైనాన్స్ సదుపాయం కల్పించేందుకై సిటీకార్ప్ ఫైనాన్స్‌తో జతకట్టినట్లు అశోక్ లేలాండ్ ప్రకటించింది. ఈమేరకు రెండేళ్ల పాటు వ్యూహాత్మక ఫైనాన్సింగ్ భాగస్వామ్యానికి అంగీకరిస్తూ ఇరు సంస్థలు ఎంవోయూపై సంతకం చేశాయని పేర్కొంది. అశోక్ లేలాండ్ ట్రక్కులు, బస్సులు కొనేవారికి వేగవంతమైన రుణ సదుపాయంతో పాటు తమ సంస్థకు చెందిన ఇతర ఆర్థిక సేవలు కూడా ప్రత్యేకంగా అందిస్తామని సిటీకార్ప్ పేర్కొంది.

## అలహాబాద్ బ్యాంక్‌కు రూ. 2,153 కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను అలహాబాద్ బ్యాంక్‌కు ప్రభుత్వం నుంచి రూ.2,153 కోట్ల మూలధనం సమకూరనుంది. ఈమేరకు ఆర్థిక సేవల విభాగం నుంచి తమకు లేఖ అందిందని బ్యాంకు పేర్కొంది. ఈక్విటీ షేర్ల ప్రాధాన్యత కేటాయింపులో భాగంగా కేంద్ర ప్రభుత్వం నుంచి అలహాబాద్ బ్యాంకుకు ఈ సహకారం అందనుంది. ఇండియన్ బ్యాంకుతో విలీనం నేపథ్యంలో ఈ సొమ్ము లభిస్తుండటం విశేషం.

**ఫారం గేటు అమ్మకం ధరలు** ( నెక్100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 26వ తేదీకి.. | | విజయవాడ | 462 |
| హైదరాబాద్ | 445 | విశాఖపట్నం | 475 |
| 27వ తేదీకి.. | | వరంగల్ | 448 |
| చిత్తూరు | 468 | డజను గుడ్లు రూ. 69 | |
| గోదావరి | 462 | | |

**ఫామ్‌గేట్ ధర** (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 100 | విజయవాడ | 100 |
| వరంగల్ | 100 | గుంటూరు | 100 |
| మహబూబ్‌నగర్ | 100 | ఒంగోలు | 102 |
| కరీంనగర్ | 100 | చిత్తూరు | 93 |
| కర్నూలు | 100 | నెల్లూరు | 93 |
| విశాఖపట్నం | 105 | అనంతపురం | 89 |
| గోదావరి | 100 | | |



**బులియన్**

| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 38,910 | 39,150 | 40,040 | 39,250 | 38,770 |
| క్రితం ముగింపు | 38,550 | --- | --- | 39,100 | 38,830 |
| 22 క్యారెట్లు | 37,000 | 36,250 | 36,830 | 36,250 | 36,920 |
| క్రితం ముగింపు | 36,690 | --- | --- | 36,250 | 36,980 |
| వెండి (కిలో) | 46,900 | 48,000 | 47,900 | 47,700 | 50,400 |
| క్రితం ముగింపు | 46,500 | --- | --- | 47,500 | 49,400 |

# వచ్చే ఏడాదీ స్టీల్, సిమెంట్‌కు సవాలే!



**మం**దగమన పరిస్థితుల నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న స్టీల్, సిమెంట్ రంగానికి వచ్చే ఏడాదీ సవాళ్లు ఎదురుకావచ్చని విశ్లేషకులు అంటున్నారు. ఒకవైపు బ్యాంకింగ్ రంగం పరిశ్రమలకు రుణాలిచ్చే విషయంలో ఆచితూచి వ్యవహరిస్తోంది. మరోవైపు ప్రభుత్వం మౌలిక ప్రాజెక్టులపై వ్యయాలను తగ్గించుకుంటోంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఉద్దీపనలతో గత రెండు నెలల్లో స్టీల్, సిమెంట్‌కు డిమాండ్ కాస్త పెరిగింది. దాంతో స్టీల్ ధరలు రెండు దఫాల్లో కలిపి టన్నుకు రూ.3 వేలు పెరిగాయి. జనవరిలో మూడోసారి ధరలు పెంచేందుకు కంపెనీలు సిద్ధమవుతున్నాయి. ఈసారి టన్నుకు రూ.1,000 మేర పెరగనుంది. అంతర్జాతీయంగా స్టీల్ ధరలు పెరుగుతుండటం, దేశీయంగా డిమాండ్ మళ్లీ పెరుగుతుండటం స్టీల్ కంపెనీలకు రేట్లు పెంచే వెసులుబాటు లభించింది. మన దేశంలో స్టీల్ వినియోగంలో వాహన రంగానిదే ప్రధాన వాటా. ఆటో రంగంలో విక్రయాలు నిరాశాజనకంగానే ఉన్నప్పటికీ.. ఈ మధ్యకాలంలో వాహన తయారీదారుల నుంచి స్టీల్‌కు మళ్లీ డిమాండ్ పెరిగింది.

మౌలిక ప్రాజెక్టుల నిర్మాణం మందగించడంతో ఈ ఏడాది సిమెంట్ డిమాండ్ పడిపోయింది. పలు రాష్ట్రాల్లో అతి వర్షపాతం, ద్రవ్య కొరత సమస్యలు కూడా సిమెంట్ గిరాకీపై ప్రభావం చూపాయి. వచ్చే ఏడాదిలో సిమెంట్ డిమాండ్ మళ్లీ పునరుద్ధరణ బాట పట్టవచ్చని, తగ్గిన ఉత్పత్తి వ్యయం కంపెనీలకు కొంత ఊరటనిచ్చే అవకాశం ఉంది.

## మూడో రోజూ కొనసాగిన నష్టాలు




ముంబై: స్టాక్ మార్కెట్ వరుసగా మూడో సెషన్‌లో కూడా నష్టాలతోనే ముగిసింది. మార్కెట్ దిగ్గజాలు రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లలో జరిగిన భారీ అమ్మకాలే ఈ నష్టానికి కారణం. ఇంట్రాడేలో 328 పాయింట్ల మేరకు నష్టపోయిన సెన్సెక్స్ చివరికి 297.50 పాయింట్ల నష్టంతో 41132.89 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 88 పాయింట్ల నష్టంతో 12126.55 వద్ద క్లోజయింది. 2.23 శాతం నష్టంతో భారతి ఎయిర్‌టెల్ సెన్సెక్స్‌లో భారీగా నష్టపోయిన షేరుగా నిలిచింది. రిలయన్స్, ఎల్ అండ్ టీ, సన్ ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతీ, టైటాన్, కోటక్ బ్యాంక్ కూడా నష్టాల్లో ముగిశాయి. ఇందుకు భిన్నంగా ఓఎన్‌జీసీ, ఎన్‌టీపీసీ, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా లాభాల్లో ట్రేడయ్యాయి. డిసెంబరు కాంట్రాక్టుల ముగింపు వల్ల మార్కెట్ భారీ ఆటుపోట్లతో నడిచిందని ట్రేడర్లన్నారు. సంవత్సరాంతపు సెలవు దినాలు కావడం కూడా దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మందకొడి వైఖరి నెలకొనడానికి కారణం. బుధవారం క్రిస్మస్ సెలవు దినం కావడం కూడా ఇందుకు దోహదపడిందంటున్నారు.

ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లు వాణిజ్య ఉద్రిక్తతల భయాలు తొలగడం వల్ల కాస్తంత సౌకర్యవంతంగానే ఉన్నా దేశీయ మార్కెట్ మాత్రం బడ్జెట్ సంకేతాల కోసం ఎదురు చూస్తున్నదని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధన విభాగం హెడ్ వినోద్ నాయర్ అన్నారు.

## అమరావతిలో నేడు బీజేపీ మౌన దీక్ష



అమరావతి, గుంటూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజధాని తరలింపునకు నిరసనగా బీజేపీ శుక్రవారం మౌన దీక్ష చేయనుంది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ గురువారం గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌తో భేటీ తర్వాత రాజ్‌భవన్ ఎదుట విలేకర్లకు ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రధాని మోదీ అమరావతి రాజధాని నిర్మాణానికి ఉద్ధండరాయునిపాలెంలో భూమి పూజ చేసిన ప్రాంతంలోనే శుక్రవారం ఉదయం 8.30 గంటలకు మౌన దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు, నేతలు తరలి రావాలని బీజేపీ రాష్ట్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చింది.



మందడంలో ఎండలో రోడ్డుపై బైఠాయించిన ఆందోళనకారులు

- అరెస్టులు, గృహ నిర్బంధాలతో ఒక్కసారిగా వేడెక్కిన 'రాజధాని'
- వేల బలగాలతో గ్రామాల కట్టడి
- కేబినెట్ జరిగే తాడేపల్లి వైపు వెళ్లారంటూ కస్టడీలోకి రైతులు
- కేశినేని, బుద్దా హౌస్ అరెస్టు
- హైకోర్టు కోసం ఉద్యమించిన లాయర్లు స్టేషన్‌కు తరలింపు



సచివాలయానికి వెళ్లే ప్రధాన కూడలి వద్ద పోలీసుల తనిఖీలు

# కాదంటే కదనమే

**రాజధానిపై నేడు కేబినెట్ భేటీ.. మార్చే తీర్పయితే అగ్నిగుండమే.. హెచ్చరిస్తున్న రైతులు, జేఏసీలు**



మందడంలో జరుగుతున్న ఆందోళన వద్ద మోహరించిన వజ్ర వాహనం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాజధానిపై నేడే తీర్పు! దానికోసమే రాష్ట్ర మంత్రివర్గం శుక్రవారం సమావేశమవుతోంది. ఆ తీర్పు అటూఇటూ అయితే 'అంతే..'నంటూ రాజధాని రైతులు, జేఏసీలు హెచ్చరిస్తుంటే.. కేబినెట్ భేటీ నేపథ్యంలో రాజధాని గ్రామాల్లో అసాధారణరీతిలో పోలీసులు మోహరించారు. ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలకు పాల్పడ్డారు. ఇలాంటి టెన్షన్ వాతావరణంలోనే తొమ్మిదిరోజు రాజధాని 29 గ్రామాల్లో నిరసనలు కొనసాగాయి. మందడంలో టెంటు వేసేందుకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో రైతులు, మహిళలు రోడ్డుకు అడ్డంగా బైఠాయించారు. అరెస్ట్ చేస్తామని పోలీసులు హెచ్చరించినా వెనక్కి తగ్గలేదు. టెంటు వేసుకొని సాయంత్రం దాకా నిరసన కొనసాగించారు. తుళ్లూరు శిబిరంలో ఖాళీ కంచాలను గరిటలతో మోగిస్తూ నిరసన తెలిపారు. అనంతరం సహస్ర లలితనామ పారాయణం చేసి పొంగలిని ప్రసాదంగా అందించారు. ముస్లిం రైతులు రోడ్డుపైనే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యువకులు, పిల్లలు ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాస్కులతో రోడ్డెక్కారు. మూడు రోజుల క్రితం ఎమ్మెల్యే శ్రీదేవి కనిపించటం లేదని ఫిర్యాదు చేస్తే.. ఇప్పటిదాకా ఎందుకు చర్యలు తీసుకోలేదని ఇక్కడి రైతులు.. పోలీసులను నిలదీశారు. ఆమె ఎక్కడా అంటూ తుళ్లూరుకు చెందిన మహిళా రైతులు పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. వెలగపూడిలో రైతులు వరసగా తొమ్మిదో రోజు రిలే దీక్షలు కొనసాగించారు.

### లెఫ్ట్‌నేతల కట్టడి.. ఉద్రిక్తత

రాజధాని రైతులకు మద్దతుగా సీపీఐ, సీపీఎం పార్టీల నేతలు శిబిరాలను సందర్శించారు. వాహనాల్లో వచ్చిన సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. రామకృష్ణ తదితరులను మందడం వద్ద పోలీసులు అడ్డుకొన్నారు. వారి వాహనాలను గ్రామంలోకి అనుమతించలేదు. ఒకదశలో రామకృష్ణతో పోలీసులు దురుసుగా వ్యవహరించారు. అనంతరం వామపక్ష నేతలు నడుకొంటూ మందడంలోని నిరసన శిబిరానికి వెళ్లి తమ మద్దతు తెలిపారు. మరో ఘటనలో 11 మంది సీపీఐ నేతలను ఉండవల్లి వద్ద పోలీసులు అరెస్టు చేశారు. రాజధాని గ్రామాల రైతుల్లో చీలికలు తెచ్చి, వారి ఆందోళనను నీరుగార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం యత్నిస్తోందన్న అనుమానాలను రాజధాని రైతు నేతలు వ్యక్తం చేస్తున్నారు. ఆ మాయలో పడరాదని తోటి రైతులను హెచ్చరిస్తూ వివిధ రూపాల్లో వారికి సందేశాలను పంపుతున్నారు.

### విస్తరిస్తున్న మద్దతు..

రాజధాని అమరావతికి అనుకూలంగా శుక్రవారం ప్రకటన రాకపోతే కృష్ణా, గుంటూరు జిల్లాల వైసీపీ ప్రజా ప్రతినిధులు రాజీనామా చెయాలని అమరావతి పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది. అన్ని జిల్లాల్లో ప్రజలు రోడ్లపైకి రావాలని కోరింది. ఉదయం 10 గంటల నుంచి 12 గంటలవరకు మానవహారాలు నిర్వహించి..ప్రభుత్వానికి నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చింది. అమరావతి పరిరక్షణ సమితి కన్వీనర్ ఎ.శివారెడ్డి తదితర నేతలు గురువారం రాత్రి విజయవాడలో సమావేశమయి ఈ నిర్ణయాలు తీసుకొన్నారు.



టెంటును పోలీసులు తొలగించడంతో రోడ్డుపైనే నిద్రించిన రైతులు

## పని చేయని హైకోర్టు

- విధులను బహిష్కరించిన లాయర్లు

రాజధాని అమరావతిలో ఉండాలి.. అక్కడే హైకోర్టు ఉండాలని హైకోర్టు న్యాయవాదులు డిమాండ్ చేశారు. గురువారం వారు లాయర్ల జేఏసీ పిలుపు మేరకు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. రాజధాని, హైకోర్టు తరలింపును, రాజధాని మూడు ముక్కల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ గుంటూరు న్యాయవాదులు కదం తొక్కారు. గుంటూరు, మంగళగిరి, హైకోర్టు బార్ అసోసియేషన్లకు చెందిన పలువురు న్యాయవాదులు గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ ఛైర్మన్ చిలుకూరు నరేంద్రబాబు ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ నిర్ణయంపై నిరసన వ్యక్తం చేస్తూ, మంగళగిరి మండలం చినకాకాని వై జంక్షన్ సమీపంలో రాస్తారోకో నిర్వహించారు. జాతీయ రహదారిపై నిర్వహించిన ఈ రాస్తారోకోతో కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. దీంతో పోలీసులు న్యాయవాదుల నిరసనను ఆపేందుకు ప్రయత్నించగా న్యాయవాదులు రాజధాని, హైకోర్టు తరలింపును నిలిపివేయాలంటూ నినాదాలు చేశారు. న్యాయవాదులందరిని వ్యానులో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలిసి రైతులు పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. కాగా, తుళ్లూరులో శుక్రవారం గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్, న్యాయవాదుల జేఏసీ సమావేశం నిర్వహిస్తామని బార్ ఫెడరేషన్ ఛైర్మన్ చిలుకూరు నరేంద్రబాబు తెలిపారు. న్యాయపరంగా రాజధాని రైతులకు అండగా ఉంటామని సంకల్పం పూనారు. అమరావతిలోనే హైకోర్టు ఉండాలని మేజర్‌గా న్యాయవాదులు మద్దతు తెలపటంతో తీర్మానం ఆమోదిస్తామని హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వై.వీ రవిప్రసాద్ తెలిపారు. కాగా, రాయల సీమకు చెందిన న్యాయవాదులు కొందరు హైకోర్టు విధులకు హాజరయ్యారు.



మంగళగిరి పోలీసు స్టేషన్ వద్ద గుంటూరు న్యాయవాదుల ఆందోళన

## 'అమరావతి'ని ఆదుకోండి

- గవర్నర్‌కు రాజధాని రైతుల గోడు



గవర్నర్‌కు గోడు వెళ్లబోసుకుంటున్న రైతులు

అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధానిగా అమరావతే కొనసాగేలా చూడాలని, ఈ మేరకు కేంద్రానికి నివేదిక పంపడం ద్వారా తమను ఆదుకోవాలని రాజధాని గ్రామాలకు చెందిన పలువురు రైతులు గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను కోరారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో రాష్ట్ర ప్రథమ పౌరుడిని గురువారం మధ్యాహ్నం సుమారు 40మంది రైతు ప్రతినిధులు కలిసి, తమ గోడును విన్నవించుకున్నారు. వాస్తవానికి వీరికి కేటాయించిన సమయం 5 నిమిషాలే అయినప్పటికీ 15 నిమిషాలకుపైగా గవర్నర్ వారితో గడిపి, రైతు ప్రతినిధులు చెప్పిన అంశాలన్నింటినీ శ్రద్ధాసక్తులతో ఆలకించడం విశేషం! అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య కన్వీనర్ మాదల రాజేంద్ర నేతృత్వంలో 29 గ్రామాలకు చెందిన వివిధ వర్గాల రైతులు గవర్నర్‌ను కలిశారు. 'రాజధానిని 3 ముక్కలుగా చేస్తే అది అమరావతికి మరణ శాసనం మాత్రమే కాకుండా... ఇప్పటికే గత ప్రభుత్వం దానిపై వెచ్చించిన సుమారు రూ.9,000 కోట్లకుపైగా ప్రజా ధనం పూర్తిగా వృథా అయినట్లే. వీటన్నింటిపైనా నిష్పాక్షికంగా పరిశీలన జరిపిస్తే మా వాదన పూర్తిగా వాస్తవమని మీకే తెలుస్తుంది. ఆ మేరకు నివేదికను కేంద్రానికి పంపించి, పూర్తిస్థాయి రాజధానిగా అమరావతి కొనసాగేందుకు తోడ్పడగలరు' అని గవర్నర్‌ను కోరారు.



ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, ఎంపీ కేశినేనిలను గృహనిర్బంధంలో ఉంచిన పోలీసులు

## నియంతలు కాలగర్భంలోకే..

- ప్రజా ఉద్యమాలను అడ్డుకోలేరు
- నీ గొయ్యి నువ్వే తవ్వుకోవద్దు : కేశినేని
- రాష్ట్ర పరిస్థితి ఆనాడే చెప్పాం : బుద్దా
- ఇరువురు నేతల గృహనిర్బంధం

విజయవాడ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అమరావతి ప్రాంతంలో ఆందోళనలు చేస్తున్న రైతులకు గురువారం సంఘీభావం తెలిపేందుకు వెళ్లకుండా టీడీపీ నాయకులు ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నలను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా నాని విలేకరులతో మాట్లాడుతూ ఓ రౌడీనో.. గూండానో.. చూసినట్లు పోలీసులు తనను చూస్తున్నారని ఆరోపించారు. రాజధాని అమరావతి తరలింపు అంశాన్ని పార్లమెంటులో ప్రస్తావిస్తానని చెప్పారు. ట్విటర్‌లోనూ నాని అమరావతి తరలింపుపై స్పందించారు. 'జగన్ అన్నా... ప్రజాగ్రహం ముందు నీలాంటి నియంతలు చాలామంది కాలగర్భంలో కలిసిపోయారు. ప్రజాఉద్యమాలను పోలీసులే కాదు... ఎవరూ అణచలేరు. అమరావతి నుంచి రాజధానిని మార్చి నీ గొయ్యి నువ్వే తవ్వుకోవద్దు' అని ట్వీట్ చేశారు. మరోవైపు బుద్దా వెంకన్న విలేకరులతో మాట్లాడుతూ... రాజధానిపై జగన్‌కు కనీస అవగాహన కూడా లేదని విమర్శించారు. ఆర్థిక నేరాలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చిన జగన్ ముఖ్యమంత్రి అయితే రాష్ట్ర పరిస్థితి ఎలా తయారవుతుందో తాము ఎన్నికల ముందే చెప్పామని, ప్రస్తుతం అదే జరుగుతోందని బుద్దా వెంకన్న పేర్కొన్నారు.

**అమరావతికి సర్వమత సమ్మతి**



తుళ్లూరులో శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం చేస్తున్న హిందువులు, ముస్లింల ప్రార్థనలు, రాజధానికి బౌద్ధ మతస్థుడి మద్దతు





# యుద్ధ వాతావరణం

- భయపెడుతున్న కేబినెట్ బందోబస్తు తీరు
- రాజధాని గ్రామాల్లో రోజంతా టెన్షన్..టెన్షన్
- ఆధార్ ఉంటేనే ఆ గ్రామాల్లోకి అనుమతి
- పోలీసులతో అక్కడక్కడా రైతుల పోరు

రాష్ట్ర మంత్రి మండలి సమావేశం నేపథ్యంలో రాజధాని అమరావతిలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైయింది. రాజధాని గ్రామాలపై అప్రకటిత కర్ఫ్యూను విధించారు. ఇప్పటికే యాంటీ నక్సల్ స్క్వాడ్, స్పెషల్ పార్టీ పోలీసులు రంగలోకి దిగారు. ఇతర జిల్లాల నుంచి దాదాపు 2 వేల మంది పోలీసులు అమరావతిలో మకాం వేశారు. సచివాలయం వైపు వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశాకే అనుమతిస్తున్నారు. ప్రతి వాహనం నంబరు నోట్ చేసుకున్నారు. అనుమానం ఉన్న వారిని ఆపి ఆధార్ కార్డు తనిఖీ చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి రాజధానిలోకి ప్రవేశించే అన్ని రూట్‌లలో చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. అణువణువు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు వెళ్లాయి. శుక్రవారం బయట వ్యక్తులు ఒక్కరు కూడా రాజధానిలోకి అడుగు పెట్టకూడదని ఉన్నతాధికారుల నుంచి క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందికి ఆదేశాలు అందాయి. ఇప్పటికే ఇతర ప్రాంతాల వారికి రాజధాని గ్రామాల్లో ఆశ్రయం ఇవ్వవద్దని పోలీసులు నోటీసులు కూడా జారీ చేశారు. ఆయా గ్రామాల్లో బయట వ్యక్తులు ఎవరైనా ఉన్నారా... ఆయా గ్రామాల్లో తాజా పరిస్థితులు ఏమిటి, శుక్రవారం జరిగే కేబినెట్ సమావేశంలో ప్రభుత్వం మూడు రాజధానులపై ప్రకటన చేస్తే ఏయే గ్రామాల్లో ఏ తరహా ఆందోళనలు తలెత్తే అవకాశం ఉందనేదానిపై నిఘా వర్గాలు పూర్తి సమాచారం సేకరించాయి. దానికి అనుగుణంగా ఆయా గ్రామాలు, ప్రాంతాలను ఎంచుకొని బందోబస్తును కట్టుదిట్టం చేస్తున్నారు. అన్ని ప్రధాన కూడళ్లు, గ్రామాలకు వెళ్లే రోడ్లలో పెద్ద ఎత్తున బారికేడ్లు, ముళ్లకంచెలను ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే టీయర్ గ్యాస్, రబ్బర్ బులెట్‌లు వినియోగించాలని, అవసరమైతే లాఠీఛార్జ్ కూడా చేయాలని కూడా పోలీసులకు ఆదేశాలు అందాయి. దీనిపై స్థానికులు పోలీసులను నిలదీస్తున్నారు. 'మేమేమైనా నక్సలైట్లమా, టెర్రరిస్టులామా' అంటూ మండిపడ్డారు. ఆధార్ కార్డులు దగ్గర పెట్టుకొని తిరగాలా అంటూ తిరగబడ్డారు. తాడేపల్లిలోని సీఎం నివాసం పరిసర ప్రాంతాల్లో పోలీసులు ఆంక్షలు విధించారు. అనుమతి లేని వారిని ఎవరినీ కూడా పరిసర ప్రాంతాల్లోకి రాకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కొంత మంది రైతులు తమ నాయకులను కలిసి తమకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించేందుకు సీఎం క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ వున్న పోలీసు సిబ్బంది వారిని కస్టడీలోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

## రాజధాని రైతు ఆత్మహత్యాయత్నం

తాడేపల్లి, డిసెంబరు 26: మూడు రాజధానుల ప్రకటనను వ్యతిరేకిస్తూ ఓ రైతు ఆత్మహత్య యత్నించాడు. తాడేపల్లి మండలం పెనుమాక గ్రామంలో గురువారం నిరసన కార్యక్రమంలో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన రైతు బొప్పన రమేశ్ గడిచిన 8 రోజులుగా ఆందోళనల్లో పాల్గొంటున్నారు. గురువారం ఆందోళన ముగిసే సమయంలో రమేశ్ వెంట తెచ్చుకున్న డీజిల్‌ను ఒక్కసారిగా ఒంటిమీద పోసుకున్నారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఎస్‌ఐ నారాయణ, రైతులు, నాయకులు గమనించి కాపాడారు. వెంటనే ఆయన ఒంటిపై ఉన్న చొక్కాను తీసివేశారు. రమేష్ రాజధాని కోసం నాలుగు ఎకరాలు పూలింగ్‌కు ఇచ్చారు. రాజధానిని తరలిస్తున్నారన్న ఆందోళనతో మనస్తాపానికి గురయ్యాడని స్థానికులు చెప్పారు. పొలానికి పురుగుల మందు కొట్టే పవర్ స్ప్రేయర్‌లో వాడే డీజిల్‌ను ఆయన బాటిల్‌లో నింపి నిరసన ప్రదేశాన్ని తీసుకొచ్చారు. నిరసన ముగిసే సమయంలో ఆత్మహత్యకు యత్నించారు. రమేశ్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది.

## గంగిరెద్దుల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు: టీడీపీ

అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): "వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు జగన్ చెప్పినట్లు ఆడే గంగిరెద్దుల్లా మారారు. డూడూ అనడం తప్పా, రాజధానికి భూములు త్యాగం చేసిన రైతులు, మహిళలు, యువత గోడు పట్టించుకోవడం లేదు" అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు, టీడీపీఎల్పీ ఉప నాయకులు అచ్చెన్నాయుడు, గౌనివాని శ్రీనివాసులు, డొక్కా మాణిక్యవరప్రసాద్ మండిపడ్డారు. పదవులు శాశ్వతం కాదనేది గుర్తుంచుకోవాలని గురువారం ఒక ప్రకటనలో వారు, వైసీపీ నేతల్ని హెచ్చరించారు. "అసలు ఇప్పుడు రాజధానిని మార్చాల్సిన అవసరం ఏమొచ్చింది? రాజధానిని మార్చే అధికారం మీకెవరిచ్చారు? రూపాయి ఖర్చు లేకుండా సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టుగా అమరావతిలో జరిగే అభివృద్ధికి ఎందుకు అడ్డం పడ్డారు? డబ్బులు లేకపోతే రాజధానిని ఎందుకు మారుస్తున్నారు? అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు అన్నీ సజావుగా నడుస్తుంటే, ఇప్పుడెందుకు గందరగోళం తెచ్చారు? వాటిని మార్చడం ద్వారా ఇంకా ఖర్చు పెంచి ప్రజలపై భారం వేయడం ఏమిటీ?" అంటూ ప్రశ్నలు సంధించారు.

### ప్రభుత్వం తీరు గర్హనీయం

ప్రజా రాజధాని అమరావతి కోసం ఎన్నో త్యాగాలు చేసిన రైతులు, రైతు కూలీల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండిస్తున్నాం. టీడీపీ నాయకులను ఎందుకు గృహ నిర్బంధం చేస్తున్నారో ప్రభుత్వం చెప్పాలి. హౌస్ అరెస్టులు, లాఠీలతో ప్రజా ఉద్యమాన్ని అణచివేయగలమని సీఎం జగన్ అనుకోవడం అవివేకం.

\- నారా లోకేశ్, జాతీయ ప్రధాన కార్యదర్శి, టీడీపీ

## రాజధాని మార్పు చరిత్రాత్మక తప్పిదం: తులసిరెడ్డి

మంగళగిరి క్రైమ్, డిసెంబరు 26: ఏపీ రాజధానిని అమరావతి నుంచి మార్చాలని ఆలోచన చేస్తే అదొక చరిత్రాత్మక తప్పిదమవుతుందని పీసీసీ ఉపాధ్యక్షుడు తులసిరెడ్డి వ్యాఖ్యానించారు. మూడు రాజధానుల ప్రకటనను నిరసిస్తూ గుంటూరు జిల్లా మంగళగిరి మండలం యర్రబాలెం, కృష్ణాయపాలెం గ్రామాల రైతులు గురువారం చేపట్టిన తొమ్మిదో రోజు దీక్షలకు మద్దతుగా ఆయన ప్రసంగించారు. జగన్ అధికారంలోకి వచ్చినప్పుడే రాష్ట్రానికి గ్రహణం పట్టిందన్నారు.

## రాజధాని మార్పు పిచ్చి చేష్ట : సీపీఐ

తిరుపతి సిటీ, గుంటూరు, డిసెంబరు 26: రాజధాని మార్పు పిచ్చి చేష్ట అని సీపీఐ నేతలు మండిపడ్డారు. మార్పు జరిగితే జగన్ పతనం ఆరంభమైనట్లేనని హెచ్చరించారు. తిరుపతిలో జరిగిన సీపీఐ 95వ ఆవిర్భావ దినోత్సవంలో ఆ పార్టీ జాతీయ కార్యదర్శి నారాయణ, గుంటూరులో రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడారు. అసెంబ్లీ ఒకచోట, పాలన వ్యవస్థ మరో చోట ఏర్పాటు చేయడమంటే తల ఒకచోట... మొండెం మరోచోట ఉన్నట్లేనని నారాయణ అన్నారు. హైకోర్టును రాయలసీమకు మార్చడంలో తమకు అభ్యంతరం లేదన్నారు. మరోవైపు రాజధాని రైతుల శిబిరంలో రామకృష్ణ మాట్లాడారు. విపక్షాలన్నీ చంద్రబాబు ట్రాప్‌లో పడ్డాయని మంత్రి కన్నబాబు అనడం సరికాదన్నారు. 1953లోనే విజయవాడ రాజధానిగా ఉండాలని వామపక్షాలు డిమాండ్ చేశాయన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు గొర్రెలుగా, మంత్రులు డూడూ బసవన్నల్లా తయారయ్యారన్నారు.



మహాధర్నాలో వివిధ పార్టీల నేతలు కనకమేడల, దేవినేని ఉమా, బొండా ఉమా, పద్మశ్రీ అభివాదం

కేబినెట్‌లో తప్పుడు నిర్ణయం తీసుకుంటే..

# రాష్ట్రం అగ్నిగుండమే

- ఎలాంటి త్యాగాలకైనా సిద్ధం
- అమరావతి పరిరక్షణ సమితి ధర్నాలో నేతల హెచ్చరిక
- విజయవాడలో 5 రోజుల బంద్‌కు పిలుపు
- నేడు రాష్ట్రమంతటా మానవహారాలు

విజయవాడ, గుంటూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో శుక్రవారం కేబినెట్ సమావేశంలో రాజధాని అమరావతిపై తప్పుడు నిర్ణయం తీసుకుంటే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని అమరావతి పరిరక్షణ సమితి ఐక్యకార్యాచరణ కమిటీ(జేఏసీ) నేతలు హెచ్చరించారు. భావితరాల భవిష్యత్తు కోసం అమరావతిని కాపాడుకునేందుకు పెద్దఎత్తున ప్రజాఉద్యమం వస్తుందన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో గురువారం విజయవాడలోని ధర్నాచౌక్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మహాధర్నా నిర్వహించారు. ధర్నాలో టీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో పిచ్చి తుగ్లక్ పాలన చూస్తున్నామంటూ ధ్వజమెత్తారు. మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విజయవాడలో ఐదు రోజుల బంద్‌కు సన్నద్ధం కావాలని ఆందోళనకారులకు ఆయన పిలుపునిచ్చారు. రాజధానిని మార్చడానికి చట్టం, రాజ్యాంగం ఒప్పుకోవని రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్ర అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, బీజేపీ నాయకుడు వెలగపూడి గోపాలకృష్ణ, జనసేన నాయకుడు పోతిన మహేష్ రాష్ట్ర ప్రభుత్వ తీరును తప్పుబట్టారు. అమరావతి పరిరక్షణ సమితి కన్వీనర్ ఎ.శివారెడ్డి మాట్లాడుతూ శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు లక్షలాదిగా రోడ్ల మీదకు వచ్చి మానవహారాలు నిర్వహించి ప్రభుత్వానికి నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రతినిధి డాక్టర్ గంగాధర్, ఆ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, లోక్‌సత్తా ప్రతినిధి మాధవి, రాజకీయ విశ్లేషకుడు మహ్మద్ రఫీ తదితరులు ధర్నాలో మాట్లాడారు.

### కేబినెట్‌లో ఒత్తిడి తేవాలి..

రాజధానిని అమరావతిలోనే కొనసాగించేలా శుక్రవారం కేబినెట్‌లో ఒత్తిడి చేయాలని హోంమంత్రి సుచరిత, మార్కెటింగ్ మంత్రి మోపిదేవిలకు పొలిటికల్ జేఏసీ నేతలు విజ్ఞప్తి చేశారు. జేఏసీ నేతలు మద్దాళి గిరి(ఎమ్మెల్యే), బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, ఎండీ నసీర్ అహ్మద్ తదితరులు గురువారం మంత్రులకు వినతిపత్రాలు అందజేశారు.

### రేపు రాష్ట్ర బంద్: ప్రత్తిపాటి

కేబినెట్ సమావేశంలో అమరావతికి వ్యతిరేకంగా నిర్ణయం ఉంటే శనివారం రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తామని మాజీ మంత్రి ప్రత్తిపాటి గుంటూరులో చెప్పారు.

సీమ స్వరం



చంద్రగిరిలో ధర్నాలో పాల్గొన్న టీడీపీ నేతలు, శ్రేణులు

# సేవ్ అమరావతి

**రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నిరసనలు**

కడప, చంద్రగిరి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధానిగా అమరావతినే కొనసాగించాలంటూ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో టీడీపీ శ్రేణులు ఆందోళన బాట పట్టాయి. చిత్తూరు జిల్లా చంద్రగిరిలో టవర్ క్లాక్ వద్ద పార్టీ శ్రేణులు బైఠాయించాయి. తిరుపతిలో ఎన్టీఆర్ విగ్రహం నుంచి ఎస్పీ కార్యాలయం వరకూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. సత్యవేడులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. బీ కొత్తకోటలో కాగడాలతో ర్యాలీ నిర్వహించారు. బస్టాండులో ధర్నా చేశారు. కడప వన్‌టౌన్‌లో నేతలు కాగడాలు, కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం, హిందూపురం, గంతకల్లులో టీడీపీ శ్రేణులు నిరసన తెలిపాయి.

## అభివృద్ధే లక్ష్యమైతే సీమలోనే రాజధాని

**అమరావతిని మార్చే అధికారం ఎవరికీ లేదు: బీజేపీ నేత బైరెడ్డి**



కర్నూలు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): "ఆర్థిక రాజధానిగా ఎదిగిన విశాఖపట్నాన్ని నువ్వేంటి అభివృద్ధి చేసేది. రాజధాని నిర్ణయం ఎపుడో ముగిసిపోయిన అంశం. దాన్ని కదిలించి ప్రజల మనోభావాలతో ఆడుకుంటున్నావు. విశాఖలో రాజధానిని పెట్టి ప్రధానితో శంకుస్థాపన చేయించగలవా? ఆ ధైర్యం ఉందా? ప్రధాని శంకుస్థాపన చేసిన అమరావతిని మార్చే అధికారం ఎవరికీ లేదు" అని సీఎం జగన్మోహన్‌రెడ్డిపై బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన కర్నూలులో మీడియాతో మాట్లాడారు. రెడ్డి అండ్ రియల్ ఎస్టేట్ గ్యాంగ్ ఒక స్క్రిప్టు రాసుకున్నాకే, జీఎన్ రావు కమిటీని రంగంలోకి దింపారని ఆరోపించారు. రాష్ట్రంలో రెండు కులాల మధ్య ఘర్షణే రాజధాని తరలింపునకు కారణమైందని చెప్పారు. రాజధాని ప్రకటనతోనే అన్నీ అయిపోయినట్లు కాదని, త్వరలోనే జగన్‌కు కేసుల పరంపర మొదలు కానుందని హెచ్చరించారు.

## సీమలోనే రాజధాని: బొజ్జా దశరథరామిరెడ్డి

నంద్యాల, డిసెంబరు 26: "రాయలసీమలోనే రాజధాని ఏర్పాటు చేయాలి. అధికారంలో ఉండగా చంద్రబాబు రాయలసీమకు చేసిన ద్రోహం తరహాలోనే ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కూడా నయవంచన చేసేందుకు రెడీ అయ్యారు. సీఎం జగన్ రాయలసీమ వాసిగా అన్నీ చేస్తారన్న భ్రమలను సీమ ప్రజలు పెట్టుకోవద్దు" అని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి స్పష్టం చేశారు. రాయలసీమ నీటి హక్కులను పట్టించుకోకుండా గోదావరి నీటిని సీమకు తరలిస్తామని జగన్ చెబుతున్న మాటలను తప్పు పట్టారు. గురువారం కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హైకోర్టును కర్నూలులో ఏర్పాటు చేస్తూ అమరావతి, విశాఖపట్నంలో హైకోర్టు బెంచ్‌లను ఏర్పాటు చేయాలన్న రిపోర్టు రాయలసీమ ప్రజలందరినీ దిగ్భ్రాంతికి గురి చేసిందని అన్నారు. రాయలసీమకు పూర్తిగా న్యాయం జరగాలంటే రాజధానిని ఇక్కడే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

## అమరావతిలో అప్రకటిత ఎమర్జెన్సీ: యనమల

అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): "మంత్రిమండలి సమావేశం పేరుతో అమరావతిలో అప్రకటిత ఎమర్జెన్సీ విధించారు. రాష్ట్రాన్ని పోలీసు రాజ్యంగా మార్చారు. సీఎం జగన్, తనకు ఓట్లేసిన వాళ్లనే కాళ్లతో తొక్కుకుంటూ వెళ్తున్నారు. తన పనితీరును ప్రశ్నిస్తే సహించలేకపోతున్నారు. అణచివేతతో అధికారాన్ని చలాయిస్తున్నారు" అని శాసనమండలిలో ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు విమర్శించారు. ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. వేలాది పోలీసులను నెల్లూరు, ప్రకాశం, రాయలసీమ జిల్లాల నుంచి దించారని ఆరోపించారు. 'ప్రతి కూడలిలో పెద్దఎత్తున పోలీసులను దించి ప్రజలను భయపెడతారా? భూములిచ్చిన రైతులను దొంగలుగా చూస్తారా? వాళ్ల ఇళ్ల తలుపులకు నోటీసులు అంటించే తప్పేం చేశారు?' అని ప్రశ్నించారు.

## బాబు, పవన్‌కు రాజకీయాలే ముఖ్యం: పుష్పశ్రీవాణి

"ప్రతిపక్షనేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు అభివృద్ధి కన్నా రాజకీయాలే ముఖ్యం. ఇప్పటికీ చంద్రబాబు అమరావతి భ్రమలనే ప్రజలకు చూపించాలనుకోవడం, దాని కోసం అబద్ధాలను ప్రచారం చేయాలనుకోవడం దారుణం. విశాఖలో రాజధానితో ఉత్తరాంధ్ర దశ మారబోతుంది" అని ఉప ముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి అన్నారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుకు సీఎం శాశ్వత పరిష్కారం చూపించారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## రాజధాని రైతుల కోసం ఆలోచించాలి: జేడీ

తాడేపల్లిగూడెం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): "రాజధాని రైతులకోసం ప్రభుత్వం ఆలోచించాల్సిన అవసరం ఉంది. తమిళనాడులో ఒక్కో ప్రాంతంలో ఒక్కో రంగం అభివృద్ధి చెందింది. రాష్ట్రంలోనూ ఆ దిశగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి. దానిపై నాయకులు దృష్టి పెట్టాలి. అభివృద్ధి వికేంద్రీకరణతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది" అని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ తాడేపల్లిగూడెంలో సూచించారు. రాజధాని కోసం సేకరించిన 33 వేల ఎకరాల భూమిని ఇప్పుడు తిరిగి ఇచ్చినా అవి ఎందుకూ పనికిరావని అన్నారు.

## రాజధానిని తరలిస్తే సత్తా చూపుతాం: జేఏసీ

అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): "రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవస్థలను విచ్ఛిన్నం చేస్తే చూస్తూ ఊరుకోం. రాష్ట్రానికి గుండెకాయ లాంటి రాజధానిని తరలిస్తే విద్యార్థుల సత్తా చూపుతాం" అని ఏపీ విభజన హక్కుల సాధన కమిటీ, విద్యార్థి జేఏసీ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. రాష్ట్ర విభజన తర్వాత కేంద్రంతో పోరాడి రాష్ట్రానికి నిధులు తెచ్చి, ఇతర రాష్ట్రాలు అసూయపడేలా అమరావతి నిర్మాణాన్ని చేపడుతుంటే, రాజధానిని ముక్కలు చేసేలా ప్రభుత్వ చర్యలు సహేతుకం కాదని పేర్కొన్నారు. రాజధానిని అవహేళన చేసేలా పాలకులు అనుసరిస్తున్న విధానాలు మూడు ప్రాంతాల మధ్య ప్రాంతీయ విద్వేషాలు రగల్చేలా ఉన్నాయని కమిటీలు మండిపడ్డాయి. 'సేవ్ అమరావతి - సేవ్ ఏపీ' పేరుతో జనవరి మొదటి వారంలో 13 జిల్లాల విద్యార్థి, యువత, వర్సిటీల జేఏసీలతో నాగార్జున విశ్వవిద్యాలయంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి, భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని కమిటీ ప్రధాన కార్యదర్శి వల్లూరి కుమారస్వామి, కన్వీనర్ మండూరి వెంకట రమణ తెలిపారు.

## భౌతిక దాడులకు దిగుతాం: శ్రావణ్ హెచ్చరిక

గుంటూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): "రైతుల ఇళ్లకు వెళ్లి పోలీసులు బెదిరిస్తున్నారు. ఇది ఇలానే కొనసాగితే భౌతిక దాడులకు దిగుతాం" అని తాడికొండ మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ పోలీసులను హెచ్చరించారు. గురువారం ఆయన మందడంలో రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. పోలీసుల తీరుతో రాజధాని అమరావతి ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొందన్నారు. రాష్ట్రం కోసం తమ సర్వస్వం త్యాగం చేసిన రైతులపై ఇటువంటి జులుం తగదన్నారు. తీరు మారకపోతే పోలీసులపై వ్యక్తిగత కేసులు పెడతామని శ్రావణ్ కుమార్ స్పష్టం చేశారు.

## ఉత్తరాంధ్రకు న్యాయం

**స్పీకర్ సీతారాం, మంత్రి ధర్మాన కృష్ణదాస్**

శ్రీకాకుళం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు విశాఖపట్టణాన్ని రాజధాని చేస్తే.. ఉత్తరాంధ్రకు న్యాయం జరుగుతుందని స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రి ధర్మాన కృష్ణదాస్ పేర్కొన్నారు. శ్రీకాకుళంలో గురువారం జిల్లాలోని వైసీపీ ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలపై కృతజ్ఞతలు తెలిపేందుకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల ప్రజలు సమాయత్తం కావాలని కోరారు. సీఎంకు కృతజ్ఞతలు చెప్పేందుకు జిల్లా నుంచి భారీ ఎత్తున ప్రజలు ఈ నెల 28న విశాఖకు తరలిరావాలని పిలుపునిచ్చారు



ఇబ్రహీంపట్నంలో టీడీపీ నాయకుల కాగడాల ప్రదర్శన;



తుళ్లూరు నుంచి ఎర్రబాలెంకు రైతుల మోటర్ సైకిళ్ల ర్యాలీ; (ఇన్‌సెట్) అడ్డుకున్న పోలీసులు;



ఎర్రబాలెం సెంటరులో బైఠాయించిన రైతులు

# సచివాలయం విశాఖకే!!

## రాజధానులపై నేడే నిర్ణయం!.. జీఎన్ రావు నివేదికకు పూర్తి ఆమోదం

- నేటి కేబినెట్ భేటీలో ఆ దిశగా తీర్మానం
- మర్నాడే విశాఖలో సీఎం జగన్ పర్యటన
- వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం
- అమరావతి తరలింపుపై పార్టీల్లో ఆగ్రహం
- రైతుల ఉసురుపోసుకోవద్దని హితవు
- రాజధాని పరిధిలో నిరసనలు, ఉద్రిక్తత
- హైకోర్టుపై రాయలసీమలో పెదవి విరుపు
- రాజధాని కోసం పెరుగుతున్న డిమాండ్
- ఉత్తరాంధ్ర వాసుల్లోనూ భయాందోళనలు

అమరావతి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి మూడు రాజధానుల ఏర్పాటుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం శుక్రవారం కీలక నిర్ణయం తీసుకోనుంది. రాజధాని మార్పు, 13 జిల్లాల సమగ్రాభివృద్ధిపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జీఎన్ రావు సారథ్యంలోని కమిటీ సమర్పించిన నివేదికను సచివాలయంలో జరిగే కేబినెట్ సమావేశంలో సంపూర్ణంగా ఆమోదించనున్నారు. అంటే అమరావతి నగరం నుంచి కార్యనిర్వాహక రాజధానిని విశాఖపట్నానికి తరలించడంపై తీర్మానం చేస్తుందన్నమాట. ఈ నేపథ్యంలో విశాఖకు రాజధాని తరలింపు లాంఛనం మాత్రమే. కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్న మర్నాడే అంటే శనివారమే సీఎం విశాఖ పర్యటనకు వెళ్తున్నారు. అక్కడ ప్రతిపాదిత రాజధాని ప్రాంత పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టబోతున్నారు.

### ఒక్కో ప్రాంతంలో..

శాసనసభ శీతాకాల సమావేశాల్లో మూడు రాజధానుల మాట సీఎం జగన్ నోటి నుంచి వెలువడగానే రాష్ట్రం దిగ్భ్రాంతి చెందింది. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా మిశ్రమ స్పందన వ్యక్తమైంది. ఉత్తరాంధ్ర జిల్లాలు ఆయన ప్రకటనను ఆచితూచి స్వాగతిస్తున్నాయి. రాయలసీమ జిల్లాలు కర్నూలులో హైకోర్టు ప్రకటనపై తొలుత సానుకూలంగా స్పందించాయి. అయితే.. రాష్ట్రంలో మూడు రాజధానులుండే అవకాశమే లేదని.. పరిపాలన విశాఖ నుంచే జరుగుతుందని సీఎం, మంత్రుల వ్యాఖ్యలను బట్టి తేలిపోయింది. దీంతో అమరావతి నగరంతోపాటు రాయలసీమ ప్రాంతంలోనూ ఆందోళనలు మొదలయ్యాయి. అమరావతి సచివాలయానికి రావడానికే ఇబ్బంది పడుతున్నామని.. ఇప్పుడు సుదూరంగా విశాఖకు దానిని తరలిస్తే సీమవాసులు తీవ్ర ఇక్కట్లకు లోనవుతారని.. కర్నూలులో హైకోర్టు ఏర్పాటుతో తమ ప్రాంతానికి ఒరిగేదేమీ లేదని.. అమరావతి, విశాఖల్లో బెంచ్‌లు ఏర్పాటు చేయాలని జీఎన్ రావు కమిటీ సిఫారసు చేసినందున.. దీనికి పెద్దగా ప్రాధాన్యం ఉండదని రాయలసీమ మేధావులు అభిప్రాయపడుతున్నారు. మద్రాసు నుంచి విడిపోయి ఆంధ్ర రాష్ట్రంగా అవతరించినప్పుడు రాజధానిగా ఏర్పడిన కర్నూలునే.. అవశేష ఆంధ్రప్రదేశ్‌కూ రాజధానిగా ప్రకటించాలన్న డిమాండ్ ఇప్పుడు క్రమంగా పెరుగుతోంది. మరోవంక.. రాజధాని నగరంగా ప్రకటించనున్న విశాఖలో, ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఒక్కసారిగా భూముల ధరలు ఆకాశాన్నంటడం.. భూకబ్జాల పర్వానికి పెద్దఎత్తున తెరలేవడంతో ఈ ప్రాంత వాసుల్లో భయం ఆవహిస్తోంది. ఇప్పటికే విశాఖలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చుక్కలనంటింది. రాజధాని ప్రకటనతో.. ఇప్పుడు ఒక్కసారిగా పెరిగిన 'బూమ్' సామాన్యునికి నిలువ నీడ దక్కనంత ఎత్తుకు ఎగబాకింది. ఈ ఆరేడు నెలల్లో 4 వేల ఎకరాలకుపైగా కబ్జా చేసినట్లు వస్తున్న వార్తలు ప్రజలను మరింత కలవరపరుస్తున్నాయి.

### ఒక్కటవుతున్న గళాలు..

అమరావతినే రాజధానిగా కొనసాగించాలన్న ఏకాభిప్రాయానికి ఇప్పుడిప్పుడే రాజకీయ పక్షాలన్నీ వస్తున్నాయి. శాసనసభలో సీఎం జగన్ ప్రకటన చేసినప్పుడు కాస్త గందరగోళంలో పడ్డ పార్టీలు.. తొలుత అభివృద్ధి వికేంద్రీకరణను స్వాగతించాయి. కానీ అది పాలన వికేంద్రీకరణేనని అర్థం కావడంతో అమరావతినే కొనసాగించాలని పట్టుబడుతున్నాయి. ప్రధానంగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అమరావతిని రాజధానిగా కొనసాగించాలన్నదే తమ నిర్ణయమని ఇప్పటికే ప్రకటించింది. అమరావతి వల్ల ఏం ఇబ్బందులు, ప్రతిబంధకాలు, సమస్యలు ఉన్నాయో ప్రజలకు వివరించకుండా.. ఏకపక్షంగా తరలింపు నిర్ణయం తీసుకోవడం ఏమిటని నిలదీస్తోంది. తన నిర్ణయానికి అందరూ శిరసావహించాలన్న ధోరణిలో ముఖ్యమంత్రి ఉన్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఆక్షేపిస్తున్నారు. తన సార్వభౌమాధికారాన్ని గురించి ఆలోచిస్తున్న జగన్.. ప్రజాస్వామ్యంలో దేశ సార్వభౌమాధికారాన్ని.. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకోవడం లేదని అంటున్నారు. అమరావతి నగరం నుంచి పరిపాలనను తరలించడాన్ని టీడీపీ తొలి నుంచీ టీడీపీ వ్యతిరేకిస్తోంది. రైతులు, రాజధాని ప్రాంత వాసుల ఆందోళనకు ప్రత్యక్షంగా మద్దతిస్తోంది. జనసేన, వామపక్షాలు కూడా వారికి దన్నుగా నిలుస్తున్నాయి.

### అమరావతి ప్రాంతంలో నిరసనలు..

అమరావతి నుంచి సచివాలయాన్ని, తరలిస్తామని ప్రభుత్వం ప్రకటించిన నాటి నుంచి ఈ ప్రాంత రైతులు ఆందోళనకు దిగారు. వారం రోజులుగా రాజధాని నగర ప్రాంత పరిధిలోని 29 గ్రామాల ప్రజలు ధర్నాలు.. రాస్తారోకోలతో హోరెత్తిస్తున్నారు. వాటిని అణచివేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక బలగాలను రంగంలోకి దించింది. సచివాలయం, హైకోర్టుకు వెళ్లే దారిలో భద్రతను పెంచారు. ఉద్రిక్తతల నేపథ్యంలోనే శుక్రవారం కేబినెట్ సమావేశం జరుగనుంది. ఈ భేటీ సచివాలయంలో జరుగుతుందా లేదా అనే మీమాంస నెలకొంది. రాష్ట్ర మంత్రి మండలి సమావేశం విశాఖలో జరుగుతుందంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కూడా జరిగింది. ఈ ప్రచారాన్ని మంత్రులు ఖండించారు. సచివాలయంలోనే కేబినెట్ సమావేశం జరుగుతుందని స్పష్టం చేశారు.

### రైతుల్లో చీలికకు యత్నాలు

రాజధాని రైతుల నిరసనలు ఉధృతమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం వారి మధ్య చీలిక తెచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. పెద్ద రైతు, పేద రైతు అనే విభజన తెచ్చేందుకు యత్నిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెద్ద రైతులకు ఒక నిబంధన.. చిన్న రైతులకు మరో నియమావళిని అమలు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోందని అంటున్నారు.

### కేంద్రం వైపు చూపు..

రాజధాని మార్పుపై సీఎం జగన్ అసెంబ్లీలో ప్రకటన చేశాక.. చకచకా నిర్ణయాలు అమలు జరుగుతున్నాయి. విశాఖను రాజధానిగా ప్రకటించినందున ఈ నెల 28న అక్కడకు రానున్న సీఎం జగన్‌కు ఘనస్వాగతం పలుకబోతున్నామని వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయి రెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాజధాని మార్పును అడ్డుకోనే శక్తి కేంద్రానికి .. ప్రధానంగా ప్రధాని మోదీ.. హోం మంత్రి అమిత్ షాలకు మాత్రమే ఉందన్న అభిప్రాయం రాష్ట్ర ప్రజల్లో ఉంది. దీంతో.. ఇప్పుడు కేంద్రం వైఖరి ఎలా ఉంటుందోనన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

### కాపులుప్పాడ భూములు వెనక్కి

ఇంకోవైపు.. పరిపాలనా రాజధానిని విశాఖకు తరలించడం ఖాయమైన నేపథ్యంలో ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. విశాఖ కాపులుప్పాడలో ఏపీఐఐసీ వద్ద 1286 ఎకరాల భూమి ఉంది. అక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే పారిశ్రామిక సంస్థలు, ఐటీ కంపెనీలకు కేటాయించేందుకు ప్రభుత్వం ఆ భూములను ఏపీఐఐసీకి అప్పగించింది. ఇప్పుడు పరిపాలనా రాజధాని కోసం వాటిని వెనక్కి తీసుకునే ప్రతిపాదన సిద్ధమవుతున్నట్లు సమాచారం. కేబినెట్ భేటీలో దీనిపైనా చర్చించనున్నట్లు తెలిసింది.

**నియోజకవర్గాల్లో..**

# తిరగలేకపోతున్నాం

- ప్రజల్లో నిరసన తీవ్రమవుతోంది
- రాజధాని రైతులకు న్యాయం చేయాలి
- అమరావతిలో విద్యా సంస్థలు రావాలి
- ఐటీ రంగాన్ని విస్తృత పరచాలి
- పరిశ్రమలూ ఏర్పాటు చేయాలి
- వైసీపీ ప్రజాప్రతినిధుల డిమాండ్
- సీఎం క్యాంపు ఆఫీసులో మంత్రులతో భేటీ
- ఖర్చంతా ఇక్కడే పెడితే మిగతా ప్రాంతాల మాటేంటి: మంత్రులు
- రాజధాని రైతులతో చర్చలకు ఉపసంఘం!

అమరావతి/తాడేపల్లి టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పరిపాలనా రాజధానిని అమరావతి నుంచి విశాఖకు తరలించాలన్న సీఎం జగన్ నిర్ణయం కారణంగా నియోజకవర్గంలో తలెత్తుకుని తిరగలేకపోతున్నామని రాజధాని అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) పరిధిలోని వైసీపీ ప్రజాప్రతినిధులు వాపోయినట్లు సమాచారం. ప్రజల నుంచి తీవ్ర స్థాయిలో నిరసనలు వెల్లువెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తంచేసినట్లు తెలిసింది. రాజధాని నగర ప్రాంత రైతులకు సంపూర్ణ న్యాయం చేయాలని .. అదే సమయంలో అమరావతి ప్రాంతాన్ని పరిశ్రమలు, విద్యా సంస్థలు, ఇతర వాణిజ్య సముదాయాలతో అభివృద్ధి చేయాలని వారు మంత్రులను డిమాండ్ చేశారు. రాజధాని మార్పు.. ఉధృతమవుతున్న రైతుల ఆందోళనలు.. తదనంతర పరిణామాలపై మంత్రులు, వైసీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నేతలు గురువారమిక్కడ తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ చర్చల్లో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, మేకపాటి సుచరిత, కొడాలి శ్రీవెంకటేశ్వరరావు, పేర్ని వెంకట్రామయ్య, శ్రీరంగనాథరాజు, మోపిదేవి వెంకటరమణారావు, వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు ఉండవల్లి శ్రీదేవి, ఆళ్ల రామకృష్ణారెడ్డి, రజని, ముస్తాఫా, పార్థసారథి, శివకుమార్, వసంత కృష్ణప్రసాద్, మల్లాది విష్ణు, అంబటి రాంబాబు, ముఖ్య నేతలు లేళ్ల అప్పిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, మర్రి రాజశేఖర్, బొప్పన భవకుమార్, దేవినేని అవినాశ్ తదితరులు పాల్గొన్నారు.



క్యాంపు ఆఫీసు వద్ద మాట్లాడుతున్న వైసీపీ ఎమ్మెల్యేలు

### సమాంతర అభివృద్ధి జరగాల్సిందే..

విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. మూడు రాజధానుల వ్యవహారంలో ఎమ్మెల్యేలుగా తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను వైసీపీ ప్రజాప్రతినిధులు మంత్రులకు వివరించారు. రాజధాని ప్రాంతంలో విద్యా సంస్థలు, పరిశ్రమలూ ఏర్పాటు చేయాలని.. ప్రధానంగా ఐటీ రంగాన్ని విస్తృత పరచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశ్రమలకు పెద్దఎత్తున రాయితీలివ్వాలని, లేదంటే అవి అమరావతికి రావన్నారు. విశాఖతో సమాంతరంగా అమరావతిని అభివృద్ధి చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఉద్దేశం కూడా రాష్ట్రమంతటా సమాంతర అభివృద్ధి జరగాలన్నదేనని మంత్రులు తెలిపారు. అందులో భాగంగానే.. పరిపాలనా రాజధానిని విశాఖకు తరలిస్తున్నారని.. హైకోర్టును కర్నూలులో ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. అమరావతిలో రాజధాని నిర్మాణానికి రూ.1.10 లక్షల కోట్లు కావాలని.. ఇంత పెద్ద మొత్తం ఒక్క అమరావతికే కేటాయిస్తే.. వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. మిగిలిన జిల్లాలను విస్మరించినందునే చంద్రబాబు ఎన్నికల్లో ఘోర ఓటమిపాలయ్యారని చెప్పారు. అమరావతి పేరిట భూ సేకరణలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని.. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అసెంబ్లీలో స్పష్టంగా వెల్లడించారని అన్నారు. రాజధాని ప్రాంత రైతులతో సంప్రదింపులకు ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమిస్తుందని కూడా చెప్పారు. మంత్రుల సమాధానంతో.. ప్రజాప్రతినిధులు సంపూర్ణంగా సంతృప్తి చెందలేదు. విశాఖతో సమాంతరంగా అమరావతిని అభివృద్ధి చేయాల్సిందేనని పట్టుబట్టారు.

### రైతులను సంతోషపరిచేలా: పార్థసారథి

రాత్రికి సీఎంతో భేటీ అనంతరం వైసీపీ ప్రజాప్రతినిధులు విలేకరులతో మాట్లాడారు. కులం, మతం, ప్రాంతం మీద వ్యతిరేకతతో రాజధాని మార్పు జరగడం లేదని, రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా, అవసరమైతే చర్చించి ప్లాట్ల అభివృద్ధి, కౌలు విషయంలో వారికి ప్రభుత్వం చేదోడు వాదోడుగా ఉంటుందని తెలిపారు. 'మూడు ప్రాంతాల్లో రాజధానులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఉపాధి కోసం హబ్ సహా పరిశ్రమల ద్వారా ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తోంది. రైతులను సంతోషపరిచేలా చర్యలు తీసుకుంటుందని భావిస్తున్నాం' అని ఎమ్మెల్యే పార్థసారథి చెప్పారు. తక్కువ ఖర్చుతో రాజధానిని నిర్మించేందుకు జీఎన్ రావు కమిటీ నివేదికను అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోందని ఎమ్మెల్యే అంబటి రాంబాబు అన్నారు. మంత్రివర్గ సమావేశంలో తీసుకునే నిర్ణయానికి తాము కట్టుబడి ఉంటామన్నారు.

**ఆ నివేదిక అమలును**

# అడ్డుకోండి

- అమరావతిలోనే హైకోర్టు, రాజధాని, అసెంబ్లీ ఉండేలా చూడండి
- హైకోర్టులో 'రాజధాని రైతు పరిరక్షణ సమితి' అనుబంధ పిటిషన్ల దాఖలు
- విచారణ సోమవారానికి వాయిదా



అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజధాని అంశానికి సంబంధించి జీఎన్ రావు కమిటీ ఇచ్చిన నివేదికపై శుక్రవారం మంత్రిమండలి చర్చించనున్న నేపథ్యంలో ఆ నివేదికను అమలు చేయకుండా అడ్డుకోవాలని అభ్యర్థిస్తూ 'రాజధాని రైతు పరిరక్షణ సమితి' కార్యదర్శి డి.రామారావు హైకోర్టులో అనుబంధ పిటిషన్లు దాఖలు చేశారు. రాజధాని అభివృద్ధి పనులు కొనసాగించేలా ఆదేశించాలని, జీఎన్ రావు కమిటీని ఏర్పాటు చేస్తూ జారీ చేసిన జీవో 585ను రద్దు చేయాలని కోరుతూ ఇప్పటికే హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన రామారావు.. తాజాగా రెండు అనుబంధ పిటిషన్లు దాఖలు చేశారు. కమిటీ సమర్పించిన నివేదికను ప్రభుత్వం అమలు చేయకుండా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థిస్తూ ఒక అనుబంధ పిటిషన్, అమరావతిలోనే రాజధాని, అసెంబ్లీ, హైకోర్టు ఉండేలా చూడాలని కోరుతూ మరో అనుబంధ పిటిషన్ వేశారు. జీఎన్ రావు కమిటీకి అసలు చట్టబద్ధతే లేనందున ఆ కమిటీ ఇచ్చిన నివేదికకు కూడా ఎలాంటి విలువా ఉండదని పిటిషన్లలో పేర్కొన్నారు. రాష్ట్రానికి మూడు రాజధానులంటూ ఆ కమిటీ చేసిన సిఫారసులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని వివరించారు. కేబినెట్ సమావేశంలో జీఎన్ రావు కమిటీ సిఫారసులను ఆమోదిస్తే రాజధాని కోసం వేల ఎకరాల భూములు ఇచ్చిన రైతులకు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు. అందువల్ల ఆ కమిటీ నివేదిక అమలు కాకుండా అడ్డుకోవాలని అభ్యర్థించారు. వీటిని అత్యవసరంగా విచారించాలని ఆయన తరఫు న్యాయవాది గురువారం చీఫ్ జస్టిస్ జేకే మహేశ్వరి నేతృత్వంలోని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. అందుకు ధర్మాసనం నిరాకరిస్తూ సోమవారం విచారణ జరుపుతామని స్పష్టం చేసింది.

# రాజధాని ఏదో నేడు చెబుతాం

- అమరావతి భూములను అభివృద్ధి చేస్తాం
- వికేంద్రీకరణ జరగాలని వెంకయ్యా అన్నారు
- విశాఖలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ అవాస్తవం: బొత్స

అమరావతి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజధాని ఏదో శుక్రవారం చెబుతామని పురపాలక మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. రాష్ట్రంలోని 5 కోట్ల మంది ప్రజల్లో రాజధానిగా అమరావతి నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులూ ఉన్నారని.. మిగిలినవారి మాదిరిగానే వారి సంక్షేమం, శ్రేయస్సు కోసం కూడా తమ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. విజయవాడలోని సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో గురువారం రాత్రి మంత్రులు పేర్ని నాని, కొడాలి నానితో కలసి బొత్స విలేకరులతో మాట్లాడారు. రాజధాని ప్రాంతానికి చెందిన వైసీపీ నేతలు, ప్రజాప్రతినిధులతో సమావేశమై అమరావతి అభివృద్ధి గురించి చర్చించామని, రైతులకు అన్యాయం చేయబోమని చెప్పారు. రాజధాని రైతులు సంయమనం పాటించాలని, ఆందోళనలు విరమించాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఊసరవెల్లి రాజకీయాల వలలో పడి నష్టపోవద్దని సూచించారు. శుక్రవారం కేబినెట్ సమావేశంలో రాజధాని ఏర్పాటుపై కూలంకషంగా చర్చించి, అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలను తీసుకుంటామని బొత్స తెలిపారు. తొందరపాటుతో ఏ కొద్ది మందికో మాత్రమే మేలు చేసే నిర్ణయాలు తీసుకోబోమన్నారు. 'కేబినెట్ భేటీ తర్వాత రాష్ట్రంలో ఎక్కడెక్కడ ఏమేం చేస్తామో ప్రకటిస్తాం. రాజధానికి రైతులిచ్చిన భూములను పూర్తిస్థాయిలో అభివృద్ధి పరచడమే కాకుండా విశాఖపట్నం తరహాలో ఇక్కడ కూడా ఐటీ హబ్ నెలకొల్పుతాం, అమరావతిని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతాం. 3 చోట్ల రాజధానుల ఏర్పాటుకు ఎంత ఖర్చవుతుందో కేబినెట్ సమావేశంలో చర్చించి, తగు నిర్ణయం తీసుకుంటాం' అని వెల్లడించారు. విశాఖలో వైసీపీకి చెందిన పలువురు నేతలు అక్కడ భారీఎత్తున భూములను కొనుగోలు చేసి, ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. అమరావతి అంశంపై ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు ఇటీవల చేసిన వ్యాఖ్యలపై స్పందించబోనంటూనే అధికార వికేంద్రీకరణను ఆయన కూడా సమర్థించారు కదా అని బొత్స వ్యాఖ్యానించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ కూడా.. రాజధాని వికేంద్రీకరణపై ముఖ్యమంత్రి జగన్ ప్రకటించిన వెంటనే స్వాగతించారని తెలిపారు. మంత్రి కొడాలి జోక్యం చేసుకుని.. ఇప్పటికే ఈ అంశంపై ఎక్కువగా మాట్లాడానన్న అభిప్రాయంతోనే శుక్రవారం కన్నా మౌన దీక్ష చేస్తున్నారేమోనని ఎద్దేవాచేశారు.





1,00,000

పదేళ్లలో మృతిచెందిన/గాయపడిన అఫ్ఘానిస్థాన్ పౌరుల సంఖ్య. అఫ్ఘాన్‌లో 18 ఏళ్ల యుద్ధానికి తెర దించాలని ఐక్యరాజ్యసమితి మళ్లీ పిలుపునిచ్చింది.

## రైళ్లలో ‘ఉద్దెర’ ప్రయాణాలు



న్యూఢిల్లీ, డిసెంబరు 26: భారతీయ రైల్వేలో ఇకపై ‘ఉద్దెర’ ప్రయాణాలు చేయవచ్చు. అంటే.. రిజర్వేషన్ సమయంలో కాకుండా.. ప్రయాణాన్ని పూర్తిచేసుకుని, ఆ తర్వాత టికెట్ డబ్బులు చెల్లించవచ్చు. ఈ మేరకు భారతీయ రైల్వే కేటరింగ్, పర్యాటక సేవల సంస్థ (ఐఆర్‌సీటీసీ) ‘ఈ-పే లేటర్’ పేరుతో కొత్త సదుపాయాన్ని కల్పిస్తోంది.

## యూపీఎస్సీ ద్వారా రైల్వేలో నియామకాలు

న్యూఢిల్లీ, డిసెంబరు 26: రైల్వేలో ఇకపై నియామకాలన్నీ యూపీఎస్సీ పరీక్షల ద్వారా చేపడతామని రైల్వే బోర్డు చైర్మన్ వీకే యాదవ్ తెలిపారు. ఇటీవలే తన ఎనిమిది సేవలను ‘ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్’ గా (ఐఆర్ఎంఎస్) కేంద్ర కేబినెట్ మార్చిందని ఆయన చెప్పారు. అభ్యర్థులు యూపీఎస్సీ పరీక్షలకు హాజరైనట్లుగానే రైల్వేలోనూ మొదట ప్రిలిమ్స్ పరీక్ష రాయవలసి ఉంటుందని, అనంతరం ఐఆర్ఎంఎస్ పరీక్షకు హాజరయ్యేందుకు అభ్యర్థులకు ఆప్షన్లు ఇస్తామని వివరించారు. కాగా, ప్రయాణ, రవాణా చార్జీలను హేతుబద్ధీకరించే యోచనలో ఉన్నట్టు వీకే యాదవ్ వెల్లడించారు. ఆదాయం పెంపునకు ఎన్నో చర్యలు చేపట్టామన్నారు. కాగా, రైల్వే సర్వీసుల విలీనం ప్రభావం తమ సీనియారిటీపై పడుతుందేమోనన్న ఆందోళనలో ఉన్న అధికారులకు రైల్వే మంత్రి పీయూష్ గోయెల్ అభయమిచ్చారు. 8400 మంది అధికారుల సీనియారిటీ, పదోన్నతికి రక్షణ కల్పించేలా తమ వద్ద ప్రత్యామ్నాయాలు ఉన్నాయని అన్నారు.

## వరవరరావు ఇంట్లోంచి హార్డ్ డిస్కుల స్వాధీనం

- దేటా బయటకు తీసేందుకు ఎఫ్‌బీఐ సహకారం

పుణె, డిసెంబరు 26: భీమా కోరెగాం కేసు దర్యాప్తులో భాగంగా విరసం నేత వరవరరావు నివాసంలో స్వాధీనం చేసుకున్న కొన్ని హార్డ్ డిస్కుల్లో డేటాను బయటకు తీసేందుకు ఎఫ్‌బీఐ సహకారం తీసుకోవాలని పుణె పోలీసులు నిర్ణయించారు. ఈ హార్డ్ డిస్కులను ఫార్మాటింగ్ చేశామని, డేటా వెలికి తీయడానికి నిపుణుల సహాయం అవసరమని పోలీసు వర్గాలు తెలిపాయి. ఈ హార్డ్ డిస్కుల్లోనే విలువైన సమాచారం ఉందని, దర్యాప్తులో ఇది అత్యంత కీలకం కానుందని ఆ వర్గాలంటున్నాయి. ఎఫ్‌బీఐ సహకారంతో వాటిని బయటకు తీసేందుకు త్వరలోనే పుణె పోలీసులు, ఎన్ఐఏకు చెందిన భద్రతా నిపుణుల బృందం అమెరికా వెళ్లనుంది. వరవరరావు సహా హక్కుల నేతలంతా మావోయిస్టు సానుభూతిపరులనీ, నక్సల్స్‌తో కలిసి ప్రధాని మోదీ హత్యకు కుట్ర పన్నారనీ పోలీసులు అభియోగం మోపారు.

## అఖిల్ గొగోయ్ మళ్లీ అరెస్టు

గువాహటి, డిసెంబరు 26: అసోంలో రైతు కూలీ నేత, హక్కుల కార్యకర్త అఖిల్ గొగోయ్‌ను ఎన్ఐఏ బృందాలు అదుపులోకి తీసుకున్నాయి. డిసెంబరు 12న ఢిల్లీలో పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా తీసిన ర్యాలీలో పాల్గొన్నపుడు ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. ఆ కస్టడీ 27న ముగియాల్సిన సమయంలో ఈసారి ఎన్ఐఏ అరెస్టు చేసింది. కృషక్ ముక్తి సంగ్రామ్ సమితి పేరిట ఓ సంస్థను నడుపుతున్న ఆయన తన సంస్థను మావోయిస్టు పార్టీలో విలీనం చేశారని పోలీసులు చెప్పారు. నక్సల్స్‌తో ఆయనకు సంబంధాలున్నాయని, ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఎన్ఐఏ ఆరోపిస్తోంది. స్థానిక కోర్టులో ప్రవేశపెట్టినపుడు న్యాయమూర్తి ఆయనకు 14 రోజులపాటు జుడీషియల్ కస్టడీలో ఉంచాల్సిందిగా ఆదేశించారు.

## ప్రధాని పెన్షన్‌కు ఆధార్ తప్పనిసరి

న్యూఢిల్లీ, డిసెంబరు 26: వృద్ధులకు పెన్షన్ ఇచ్చే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి వయ వందన యోజన (పీఎంవీవీవై) లబ్ధిదారులు తమ ఖాతాలను తప్పనిసరిగా ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుంది. కేంద్ర ఆర్థిక శాఖ ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది.

## నారీ శక్తి అవార్డులకు ఆహ్వానం

న్యూఢిల్లీ, డిసెంబరు 26: మహిళా సాధికారత కోసం అవిరళ కృషి చేసిన మహిళలకు, వివిధ సంస్థలకు మొత్తం 40 మందికి ప్రభుత్వం నారీ శక్తి జాతీయ పురస్కారాలు ఇవ్వనున్నది. అర్హులైన వారినుంచి కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ దరఖాస్తులు కోరింది. వచ్చే ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ అవార్డులు ప్రదానం చేయనున్నారు.

## చట్ట ప్రకారమే నిర్బంధ కేంద్రాలు

న్యూఢిల్లీ, డిసెంబరు 26: దేశంలోని నిర్బంధ కేంద్రాలు చట్ట ప్రకారమే ఏర్పాటయ్యాయని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. వివిధ ప్రాంతాల్లో ఉన్న ఆ కేంద్రాల గురించి సుప్రీంకోర్టుకు సమాచారం ఉందని కూడా పేర్కొన్నాయి. దశాబ్దాలుగా మనుగడలో ఆ కేంద్రాలు/శిబిరాలకు జాతీయ పౌరుల జాబితా (ఎన్ఆర్సీ) తో ఎలాంటి సంబంధం లేదని ఆ వర్గాలు వివరించాయి. అక్రమంగా దేశంలోకి వచ్చిన విదేశీయులను ఈ కేంద్రాలకు తరలిస్తుంటారు. అలాంటి వారి కదలికలపై ఆంక్షలు విధించే అధికారం విదేశీయుల చట్టం 1946 కింద కేంద్రానికి దఖలు పడింది. అలాగే సరైన పాస్‌పోర్టు, ప్రయాణపత్రాలు లేనివారు ఎవరినైనా దేశం నుంచి వెళ్లగొట్టే అధికారాన్ని పాస్‌పోర్టు చట్టం (దేశంలోకి ప్రవేశం) 1920 కల్పిస్తోంది.

## లద్దాఖ్‌లో సొరంగాలు నిర్మిస్తున్న చైనా

న్యూఢిల్లీ, డిసెంబరు 26: లద్దాఖ్‌లోని ఫింగర్-8 శిఖరం వద్ద చైనా కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. అక్కడ పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ) కోసం సొరంగాలు నిర్మిస్తోంది. ఉత్తర పాంగోంగ్ సరస్సు వద్ద గుడారాలు వేసుకుని మరీ, ఈ పనులను చేపట్టిందని రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) ప్రకారం ఆ ప్రాంతమంతా భారత భూభాగంలో ఉంది. 134 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న పాంగోంగ్ సరస్సు వద్ద ఫింగర్-5 నుంచి ఫింగర్-8 శిఖరాల మధ్య తరచూ చైనా బలగాలకు, భారత సైన్యానికి మధ్య ఉద్రిక్తతలు చోటుచేసుకుంటున్నాయి.

## వివేకానంద జీవితం స్ఫూర్తిదాయకం: రాష్ట్రపతి



చెన్నై/హైదరాబాద్/మేడ్చల్ అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఒక సన్యాసి నుంచి జగద్గురుగా స్వామి వివేకానంద భారత ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పారని, ఆయన జీవితం భావి తరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. కన్యాకుమారిలో వివేకానంద మెమోరియల్‌ను రాష్ట్రపతి సందర్శించారు. వివేకానంద 1892లో ఇక్కడ ధ్యానం చేసిన విషయాన్ని కోవింద్ గుర్తుచేశారు. వివేకానంద బోధనలను పాటించడం ప్రపంచానికి ఎంతో అవసరమన్నారు. అనంతరం తిరువళ్లువర్ విగ్రహాన్ని సందర్శించారు.

### నేడు రాష్ట్రపతి నిలయంలో ఎట్ హోం

రాష్ట్రపతి నిలయంలో శుక్రవారం ఎట్ హోం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఇచ్చే ఈ ఆతిథ్యానికి గవర్నర్ తమిళిసై, సీఎం కేసీఆర్, మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరు కానున్నారు.

# అరుణం.. అద్భుతం!



(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

పాక్షిక సూర్య గ్రహణం దేశంలో సంపూర్ణంగా కనువిందు చేసింది. వివిధ ప్రాంతాల్లో ప్రజలు ఆసక్తిగా, ఉత్సాహంగా చూశారు. గ్రహణ సూర్యుడిని నేరుగా చూస్తే కంటికి ప్రమాదమన్న నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకుని వీక్షించారు. సోలార్ ఫిల్టర్ కళ్లజోళ్లు, బైనాక్యులర్ల సహాయంతో తిలకించారు. గ్రహణంలో భాగంగా ఏర్పడిన ‘రింగ్ ఆఫ్ ఫైర్’ను చూసినప్పుడు ఆనందంతో కేరింతలు కొట్టారు. తెలంగాణలో ఉదయం 8.04 గంటలకు మొదలైన గ్రహణం.. అద్భుతంగా కొనసాగి ఉదయం 9.24 గంటలకు శిఖరాగ్ర స్థాయికి చేరుకుంది. సరిగ్గా 9.26 గంటలకు సంపూర్ణ సూర్యగ్రహణం ఏర్పడింది. పగలే చీకటి అలముకుంది. సూర్యుడికి సరిగ్గా మధ్యలోకి చందమామ వెళ్లడంతో సూర్యుడు రింగ్ ఆఫ్ ఫైర్‌లా కనిపించాడు. ఈ అద్భుత దృశ్యాన్ని చూసినవారు పులకించిపోయారు. ఆ తర్వాత 9.27 గంటలకు మళ్లీ చందమామ సూర్యుడి నుంచి పక్కకు జరగడం మొదలైంది. 11.05 గంటలకు సూర్యగ్రహణం ముగిసింది. గ్రహణం సందర్భంగా పట్టు, విడుపు స్నానాలు చేశారు. బాసర గోదావరి తీరంలో భక్తులు పెద్ద సంఖ్యలో గ్రహణ దోష పూజలు చేశారు. మంత్రానుష్ఠానాలు ఉన్నవారు జప తపాదులు చేశారు. గ్రహణ దోషాలు ఉన్నవారు గ్రహణం అనంతరం బ్రాహ్మణులకు దానాలు ఇచ్చారు. శివాలయాలకు వెళ్లి పూజలు చేశారు. గంగ, యమున, గోదావరి, కృష్ణ.. ఇలా దేశవ్యాప్తంగా ఉన్న అన్ని పుణ్య నదుల్లో, హరియాణాలోని కురుక్షేత్రలో ఉన్న బ్రహ్మ సరోవరంలో ప్రజలు గ్రహణ స్నానాలు చేశారు. ఇక, గ్రహణం సందర్భంగా ఆలయాలన్నింటినీ మూసివేశారు. విడుపు తర్వాత శుద్ధి, సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతించారు. జన విజ్ఞాన వేదిక ఎక్కడికక్కడ గ్రహణం వీక్షణానికి ఏర్పాట్లు చేసింది. గ్రహణాలపై అవగాహన కల్పించింది. గ్రహణ సమయంలో తింటే ఏమీ కాదంటూ సూర్యాపేట జిల్లా కోదాడలో నేస్తం సామాజిక వేదిక సభ్యులు రహదారిపై టిఫిన్ చేసే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.



కోయంబత్తూరులో సూర్యగ్రహణాన్ని వీక్షిస్తున్న ప్రజలు

### అభిషేకాలు

శ్రీకాళహస్తి, డిసెంబరు 26: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం శాస్త్రోక్తంగా గ్రహణ కాల అభిషేకం నిర్వహించారు. సూర్య గ్రహణం సందర్భంగా దేశవ్యాప్తంగా అన్ని ప్రధానాలయాలను మూసివేసినా.. శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని మాత్రం తెరిచే ఉంచారు. ఉదయం నుంచే పూజలు కొనసాగడంతో ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తారు. రికార్డుస్థాయిలో రాహు-కేతు సర్ప దోష నివారణ పూజలు జరిగాయి.

### నిలబడిన రోకలి

పాలకుర్తి, డిసెంబరు 26: జనగామ జిల్లాలోని పాలకుర్తి గౌడ కాలనీలో గురువారం సూర్య గ్రహణం సందర్భంగా రోకలి నిలబడింది. తాంబాలంలో నీళ్లు పోసి ఏ ఆధారం లేకుండానే రోకలిని నిలబెట్టారు. సూర్య గ్రహణం ప్రభావంతోనే రోకలి నిటారుగా నిలబడిందని స్థానికులు విశ్వసిస్తున్నారు. దానిని వీక్షించడానికి పెద్దఎత్తున వచ్చారు.



### గొంతుదాకా పూడ్చితే

## కాళ్లొస్తాయని..!

**దివ్యాంగులను మట్టిలో పాతిపెట్టిన వైనం**

బెంగళూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): టెక్నాలజీ ఎంతగా అభివృద్ధి చెందినా ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో మూఢ నమ్మకాలు కొనసాగుతూనే ఉన్నాయి. సూర్య గ్రహణం సందర్భంగా ఉత్తర కర్ణాటకలో వెలుగు చూసిన ఘటనే దీనికి నిదర్శనం. అంగ వైకల్యం ఉన్నవారిని మట్టిలో గొంతుదాకా పూడ్చిపెడితే వారి అవయవాలు బాగు పడతాయనే నమ్మకంతో దివ్యాంగ చిన్నారులను మట్టిలో పాతిపెట్టిన వింత ఘటన కర్ణాటకలో చోటుచేసుకుంది. కలబురిగి జిల్లాలోని తాజ్ సుల్తాన్‌పుర గ్రామంలో తల్లిదండ్రులు ఇద్దరు చిన్నారులను దిబ్బలో గొంతుదాకా పూడ్చిపెట్టారు. విజయపుర జిల్లా ఇండి తాలూకా అర్జుణగిలో దివ్యాంగుడైన కుతుబుద్దీన్ ముల్లా (22) అనే యువకుడిని కూడా కుటుంబ సభ్యులు మట్టిలో గొంతు వరకూ పాతిపెట్టారు.

## ఈ కళ్లద్దాల ధర రూ.1.4 లక్షలట



“దురదృష్టవశాత్తూ మేఘాలు కమ్ముకోవడం వల్ల గ్రహణాన్ని వీక్షించలేకపోయాను. కానీ.. ప్రత్యక్ష ప్రసారం ద్వారా కోజికోడ్, ఇతర ప్రాంతాల్లో గ్రహణ దృశ్యాలను చూడగలిగాను” అని ప్రధాని ట్వీట్ చేశారు. ఆ సమయంలో దిగిన ఫొటోలనూ పెట్టారు. గ్రహణాన్ని చూడ్డానికి ఉపయోగించే ప్రత్యేక కళ్లద్దాలను చేత్తో పట్టుకుని, నల్ల కళ్లద్దాలు ధరించిన మోదీ ఫొటోతో చాలా మంది మీమ్స్ తయారు చేశారు. “జీతం కోసం నేను ప్రతి నెలా ఇలాగే ఎదురుచూస్తా” అంటూ ఒక నెటిజన్ జోక్ వేశారు. మోదీపై వస్తున్న మీమ్స్‌కు ఓ నెటిజన్ ప్రధానిని ట్యాగ్ చేయగా.. “మోస్ట్ వెల్‌కమ్, ఎంజాయ్ :)” అని మోదీ బదులిచ్చారు. మోదీని ‘నిజంగా కూలెస్ట్ పీఎం’గా పేర్కొంటూ.. “మోదీ చాలా కూల్. దేశం తగలబడిపోతుంటే, ఆయన ఉదాసీనంగా ఉంటారు” అని కాంగ్రెస్ ఎద్దేవా చేసింది. మోదీ ట్వీట్ చేసిన ఫొటోల ప్రకారం ఆయన ధరించిన కళ్లజోడు మేబాక్ కంపెనీదని.. దాని విలువ దాదాపు రూ.1.4 లక్షలని కాంగ్రెస్ నేత ఒకరు విమర్శించారు. “జరిగే ఘటనల క్రమాన్ని అర్థం చేసుకోండి. మొదట.. సూర్య గ్రహణం ఏర్పడుతుంది. దాన్ని నేను 1995 డాలర్ల విలువైన మేబాక్ చలువ కళ్లద్దాలతో చూస్తాను. అప్పుడు అర్బన్ నక్సల్ నుంచి తీవ్ర నిరసన వెల్లువెత్తుతుంది. చివరగా నేను నా కళ్లద్దాలను వేలం వేస్తాను. వాటిని గుజరాత్‌లో నా ఆశ్రితుడొకడు కొంటాడు. మేం చాలా పేదవాళ్లం” అని మోదీ చెప్పినట్టుగా ఆయన ట్వీట్ చేశారు.

# ఎన్‌పీఆర్ ఎంత కఠినం?

## అత్యంత ప్రమాదకరం.. 2010లో యూపీఏ పెట్టిన బిల్లు వేరే: చిదంబరం

న్యూఢిల్లీ, డిసెంబరు 26: పౌరసత్వ చట్టం, జాతీయ పౌరసత్వ రిజిస్టర్‌పై రాజుకున్న చిచ్చు చల్లారక ముందే జాతీయ జనాభా చిట్టా(ఎన్‌పీఆర్) వివాదాస్పదమైంది. ఇది 2010లో కాంగ్రెస్ తెచ్చిన జాతీయ జనాభా చిట్టా లాంటిది కాదని, ఇందులో అత్యంత ప్రమాదకర మార్పులు చేశారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కేవలం తల్లిదండ్రుల జన్మస్థలం అదనంగా అడిగామని, అంతకు మించి కాంగ్రెస్ ఎన్‌పీఆర్‌కు దీనికి మధ్య తేడా ఏమీ లేదని బీజేపీ చెబుతోంది. మార్చిన రూపంలో ఎన్‌పీఆర్ అత్యంత ప్రమాదకారి అని కాంగ్రెస్ నేత చిదంబరం అన్నారు. బీజేపీ సర్కారుకు కుట్ర పూరిత ఎజెండా ఉందని ఆరోపించారు. బీజేపీ సర్కారు సదుద్దేశంతోనే ఎన్‌పీఆర్‌ను చేపట్టి ఉంటే, 2010 నాటి ఎన్‌పీఆర్‌నే తుచ తప్పకుండా అమలు చేస్తామని, ఎన్ఆర్‌సీతో లింక్ చేయబోమని ప్రకటించాలని డిమాండ్ చేశారు. 2010 ఎన్‌పీఆర్‌లో తాము కేవలం సాధారణ నివాసితులను మాత్రమే లెక్కించామని, అందులో నివాసం గురించే తప్ప పౌరసత్వం ప్రస్తావన లేదని చెప్పారు. శాంతియుతంగా సమావేశమయ్యే రాజ్యాంగ హక్కును కాలరాస్తూ ప్రభుత్వం ఎక్కడికక్కడ శాంతియుతంగా నిరసన ప్రదర్శనలు చేస్తున్న వారిపై వందల కేసులు పెడుతోందని మండిపడ్డారు.

### వ్యూహాత్మక వెనుకడుగు: పీకే

బీజేపీది వ్యూహాత్మక వెనకడుగు మాత్రమేనని జనతాదళ్(యు) ఉపాధ్యక్షుడు ప్రశాంత్ కిశోర్ అన్నారు. పౌరసత్వ చట్టానికి, ఎన్నార్సీకి వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమం ఉధృతం కావడంతో ప్రభుత్వం తాత్కాలికంగా వెనక్కి తగ్గిందని చెప్పారు. ఎన్నార్సీ అమలుకు ఉత్తరప్రదేశ్ షియా వక్ఫ్‌బోర్డు మద్దతు తెలిపింది. దానివల్ల భారతీయ ముస్లిములకు ఎలాంటి ముప్పు లేదని బోర్డు అధ్యక్షుడు వసీం రిజ్వి అన్నారు. ఎన్‌పీఆర్ సమాచారం కాస్తా ఎన్నార్సీకి ఉపయోగ పడుతుంది కాబట్టి, ఎన్‌పీఆర్‌కు తప్పుడు డేటా ఇవ్వండని అరుంధతీ రాయ్ ఇచ్చిన పిలుపును బీజేపీ, కాంగ్రెస్‌లో తీవ్రంగా తప్పుబట్టాయి. సమాచారం ఇవ్వకుండా సహాయ నిరాకరణ చేయండని చెప్పి ఉంటే బాగుండేదని కాంగ్రెస్ నేత షమా మహ్మద్ వ్యాఖ్యానించారు. కాగా, ఎన్నార్సీకి వ్యతిరేకంగా బిహార్‌లోని కిషన్‌గంజ్‌లో ఎంఐఎం ఆదివారం భారీ సభను నిర్వహిస్తోంది. ముస్లిములు అధికంగా ఉండే నగరంలో జరిగే ఈ సభకు మాజీ ముఖ్యమంత్రి జతిన్‌రాం మాంజీ హాజరవుతున్నారు. మరోపక్క జనవరి 1 నుంచి వామపక్షాలు పౌరసత్వ చట్టం, ఎన్నార్సీ, ఎన్‌పీఆర్‌పై దేశవ్యాప్త నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని నిర్ణయించాయి. జనవరి 8న భారత్ బంద్‌కు పిలుపునిచ్చాయి.



మైసూరులో సీఏఏ, ఎన్నార్సీకి వ్యతిరేకంగా భారీ ప్రదర్శన

### జన్మస్థలం అడిగామంతే: కిషన్‌రెడ్డి

ఎన్నార్సీకి, ఎన్‌పీఆర్‌కు ఎలాంటి సంబంధం లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నార్సీకి ఎన్‌పీఆర్ తొలి మెట్టని అసదుద్దీన్ చేస్తున్న ఆరోపణల్లో ఆధారం లేదని చెప్పారు. పౌరసత్వ సవరణ చట్టం మీద తాము వెనక్కి తగ్గలేదని, సుప్రీం తీర్పు వచ్చాక ముందుకు వెళతామన్నారు. 2010 ఎన్‌పీఆర్‌కు ఇప్పటి ఎన్‌పీఆర్‌కు తేడా.. తల్లిదండ్రుల జన్మస్థలం కూడా అడుగుతుండటమే అన్నారు.

## యూపీ అల్లర్లలో బంగ్లాదేశీలు

- కశ్మీరీ యువకుల పాత్ర కూడా..
- 150 మంది జామియాలో పాగా
- తీవ్రంగా ఖండించిన యూపీ ఎంఐఎం

లఖ్‌నవూ, డిసెంబరు 26: సీఏఏకు వ్యతిరేకంగా అల్లర్లకు పాల్పడిన వారిపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఇప్పటికే 1,113 మందిని అరెస్టు చేసింది. మరో 5,558 మందిని నిర్బంధంలోకి తీసుకుంది. మొత్తం 19 మంది మరణించినట్లు పోలీసులు ధ్రువీకరించారు. అల్లర్ల వెనుక కశ్మీర్, బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వ్యక్తుల ప్రమేయం ఉందని చెబుతున్నారు. ప్రభుత్వ ఆస్తుల విధ్వంసానికి పరిహారం చెల్లించాలంటూ 26 మందికి సంభాల్ జిల్లా యంత్రాంగం నోటీసులు పంపింది. మరోవైపు ముస్లిం మెజారిటీ ఉన్న ఆరు జిల్లాల్లో శుక్రవారం తాత్కాలికంగా ఇంటర్నెట్ నిలిపివేయనున్నారు.

### 150 మంది జామియాలో పాగా

సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా, పాప్యులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) కేంద్ర కార్యాలయం వద్దే జామియా వర్సిటీలో అల్లర్లు జరిగాయని పోలీసులు నిర్ధారించారు. ఆ సంస్థకు చెందిన ఇతర ప్రాంతాల కార్యకర్తలు 150 మంది డిసెంబరు 13 వరకు జామియాలో తలదాచుకొని, గొడవల్లో రాళ్లు రువ్వారని పోలీసులు చెబుతున్నారు. అల్లర్లలో ఈ రెండు రాజకీయ, విద్యా సంస్థల పాత్రలను యూపీ ఎంఐఎం తీవ్రంగా ఖండించింది. వారు గాడ్సే వారసులేనని వ్యాఖ్యానించింది. శాంతియుత నిరసనలను హింసాత్మకంగా మార్చారని మండిపడింది.

# తుక్‌డే తుక్‌డే గ్యాంగ్!

- కాంగ్రెస్ నేతృత్వంలో పని చేస్తోంది
- శిక్షించాల్సిన సమయం వచ్చింది: అమిత్ షా



న్యూఢిల్లీ, డిసెంబరు 26: పౌరసత్వ సవరణ చట్టంపై కాంగ్రెస్, ఇతర విపక్షాలు అసత్య ప్రచారంతో గందరగోళం సృష్టిస్తున్నాయని కేంద్ర హోంమంత్రి, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా మండిపడ్డారు. ఢిల్లీలో అల్లర్లకు కాంగ్రెస్ నేతృత్వంలోని ‘తుక్‌డే తుక్‌డే గ్యాంగ్’ కారణమని ధ్వజమెత్తారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముహూర్తం దగ్గరవుతున్న నేపథ్యంలో గురువారం ఢిల్లీ అభివృద్ధి అథారిటీ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో షా ప్రసంగించారు. “సీఏఏ వ్యతిరేక ఆందోళనల పేరిట కాంగ్రెస్ ఢిల్లీల్లో విధ్వంసాన్ని ప్రేరేపిస్తోంది. హింసను ప్రోత్సహించిన తుక్‌డే తుక్‌డే గ్యాంగ్‌కు కాంగ్రెస్ సారథ్యం వహిస్తోంది. ఆ పార్టీకి బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చింది. ఢిల్లీ ప్రజలు ఈ గ్యాంగ్‌ను శిక్షించాలి” అని పిలుపునిచ్చారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందన్న విశ్వాసం వ్యక్తంచేశారు. ఆప్ అధినేత కేజ్రీవాల్ ప్రభుత్వం పనైపోయిందన్నారు. మరోవైపు... యూపీలో హింసాకాండ వెనుక కశ్మీరుకు చెందిన రాళ్లు విసిరే గ్యాంగులున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఆరోపించారు. ఆ మూకలను కశ్మీర్ నుంచి పిలిపించారని సమస్తిపూర్‌లో చెప్పారు. అంతర్యుద్ధం సృష్టించి, దేశాన్ని విభజించాలని కాంగ్రెస్‌తోపాటు తుక్‌డే గ్యాంగ్ కోరుకుంటోందని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ధ్వజమెత్తారు.

### రాహుల్ తప్పుడు ప్రచారం: బీజేపీ

రాఫెల్ ఒప్పందంలో భారీ స్కాం జరిగిందని అబద్ధాలు చెప్పి సుప్రీంకోర్టుకు క్షమాపణ చెప్పిన రాహుల్‌గాంధీ.. ఇప్పుడు ప్రధాని మోదీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీజేపీ మండిపడింది. దేశప్రధానిపై కాంగ్రెస్ నాయకుడు అభ్యంతరకర భాష ఉపయోగిస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా గురువారం దుయ్యబట్టారు.

## ఓసీఐ కార్డు లోపాలు సరిదిద్దాలి: ఎన్ఆర్ఐ




వాషింగ్టన్, డిసెంబరు 26: ఓసీఐ కార్డు లోపాలు సరిదిద్దాలని అమెరికాలోని ప్రముఖ ప్రవాసుడు ప్రేమ్ భండారి భారత ప్రభుత్వానికి సూచించారు. ఆ లోపాల వల్లే అమెరికా నుంచి భారత్‌కు ప్రయాణించే సమయంలో విమానాశ్రయాల్లో అనేకమంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని తెలిపారు. ఓసీఐ కార్డును ‘బహుళ ప్రయోజన జీవితకాల వీసా’గా పరిగణించరాదన్నారు. నిబంధనల ప్రకారం వయసు 20 ఏళ్ల లోపు, లేదా 50 ఏళ్ల దాటినవారికి ఓసీఐ కార్డు జీవితకాల వీసాగా పనిచేస్తుంది. అయితే పాస్‌పోర్టు రెన్యువల్ చేసిన ప్రతిసారీ ఓసీఐ కార్డునూ రెన్యువల్ చేయాలి. ఇలా ఎందుకు చేయాలని కొందరు ప్రశ్నిస్తున్నారని, ఈ కన్ఫ్యూజన్‌ను ప్రభుత్వం తొలగించాలని ప్రేమ్ భండారి కోరారు.

# వాళ్లు నాయకులే కాదు!

**‘నిరసనల’పై ఆర్మీ చీఫ్ తీవ్ర వ్యాఖ్యలు**



న్యూఢిల్లీ, డిసెంబరు 26: జాతీయ పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్న తరుణంలో ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ కీలక వ్యాఖ్యలు చేశారు. హింస, విధ్వంసాన్ని ప్రేరేపిస్తూ.. విద్యార్థులను, ప్రజలను రెచ్చగొట్టేలా వ్యవహరించేవారు నాయకులే కాదని సూటిగా చెప్పారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఒక ఆరోగ్య సదస్సులో ఆయన ప్రసంగించారు. ‘నాయకత్వం అంత సులభం కాదు. నాయకుడి అడుగుల్లో మరో నలుగురు నడుస్తారు. జన సమూహంలో నుంచే నాయకులు పుడతారు. ఆ జనాన్ని సరైన దిశలో నడిపించేవాడే నాయకుడు. తప్పుదారి పట్టించేవాడు నాయకుడు కానేకాదు. నాయకుడు సరైన సలహాలివ్వాలి. సరైన దారిలో నడిపించాలి. ఆదర్శంగా ఉండాలి’ అన్నారు.

### మండిపడ్డ విపక్షాలు

హింసాత్మక ఆందోళనలపై ప్రధాని మోదీ విమర్శలు గుప్పించిన మరుసటిరోజునే... ఆర్మీ చీఫ్ రావత్ చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. రావత్‌పై విపక్షాలు మండిపడ్డాయి. “ఇప్పుడు రాజకీయాల గురించి మాట్లాడిన వ్యక్తి... భవిష్యత్తులో సైన్యం ద్వారా టేకోవర్ చేసేందుకూ ప్రయత్నిస్తారు” అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి బ్రిజేశ్ కాలప్ప వ్యాఖ్యానించారు. “మీ వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నాను జనరల్ సాహెబ్! మరి... తమ అనుచరులతో మత హింసతో సామూహిక హత్యలు చేయించే వారి మాటేమిటి?” అని కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ ప్రశ్నించారు. రాజకీయ అంశాలతో సైన్యాధిపతికేంపని అని ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. పౌరుల విషయాలో ఆర్మీ చీఫ్ ఎందుకు జోక్యం చేసుకుంటున్నారని నిలదీశారు. ‘మోదీ హయాంలో పరిస్థితి ఎలా దిగజారిందో చెప్పేందుకు రావత్ వ్యాఖ్యలే నిదర్శనం’ అని సీపీఎం నేత సీతారాం ఏచూరి విమర్శించారు. నిరసనలపై ఆ ర్మీ చీఫ్ వ్యాఖ్యలు ‘తప్పు’ అని నేవీ మాజీ చీఫ్ అడ్మిరల్ ఎల్.రామ్‌దాస్ సూటిగా చెప్పారు. నిబంధనల ప్రకారం ఆయన రాజకీయ వ్యాఖ్య లు చేయరాదన్నారు. మరోవైపు.. ఎవరైనా నిరసనలు చేయవచ్చు కానీ, హింసకు దిగడం సరికాదన్నదే రావత్ ఉద్దేశమని కేంద్ర మంత్రి అథవాలే అన్నారు.

**ఆ వ్యాఖ్యలు కశ్మీర్‌పైనే: ఆర్మీ**

బిపిన్ రావత్ కశ్మీర్‌లో పరిస్థితి గురించే ప్రస్తావించారని సైనిక వర్గాలు తెలిపాయి. “ఆయన తన ప్రసంగంలో సీఏఏ, ఎన్ఆర్సీ గురించి ప్రస్తావించలేదు. కశ్మీర్‌లో రాజకీయ పరిస్థితి గురించే మాట్లాడారు. యువతకు సరైన దారి చూపించడం ఆయన బాధ్యత” అని ఆ వర్గాలు తెలిపాయి.

# విరాట్.. విజ్డెన్ 'దశాబ్ది క్రికెటర్'



**లండన్:** అన్ని ఫార్మాట్లలో ఈ దశాబ్దంలో నభూతో అన్న ప్రదర్శన చేసిన టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీకి అరుదైన గౌరవం దక్కింది. విజ్డెన్ క్రికెటర్స్ అల్మనాక్ ఈ దశాబ్ద క్రికెటర్లుగా ప్రకటించిన వారిలో విరాట్‌కు చోటు లభించింది. కోహ్లీతోపాటు సౌతాఫ్రికా క్రికెటర్లు స్టెయిన్, డివిల్లీర్స్, ఆస్ట్రేలియాకు చెందిన స్టీవ్ స్మిత్, ఆ దేశ మహిళా జట్టు ఆల్‌రౌండర్ ఎలిస్ పెర్రీ ఈ ఐదుగురు ఆటగాళ్ల జాబితాలో ఉన్నారు. గత పదేళ్లలో మరే ఆటగాడికీ సాధ్యంకాని రీతిలో అంతర్జాతీయంగా 5,775కిపైగా రన్స్ చేసిన కోహ్లీ.. నిస్సందేహంగా ఈ దశాబ్ది బ్యాట్స్‌మన్‌గా నిరూపించుకున్నాడు. 31 ఏళ్ల విరాట్‌ను తాము ప్రకటించిన దశాబ్ది టెస్ట్ జట్టుకు సారథిగా, అలాగే వన్డే జట్టు సభ్యుడిగా విజ్డెన్ ఎంపిక చేయడం విశేషం. 'సవాళ్లను ఎప్పటికప్పుడు ఎదుర్కొంటూ తనను తాను తీర్చిదిద్దుకుంటున్న విరాట్ జీనియస్. 2014లో ఇంగ్లండ్ టూర్ చివరి నుంచి గత నవంబరులో కోల్‌కతాలో బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో టెస్ట్ వరకు కోహ్లీ సగటు 63. ఇందులో 21 సెంచరీలు, 13 హాఫ్ సెంచరీలున్నాయి' అని విజ్డెన్ ప్రశంసించింది.

## పాక్ క్రికెట్ జట్టులో హిందువు కనేరియాపై వివక్ష

**షోయబ్ అక్తర్ వెల్లడి**

**కరాచీ/న్యూఢిల్లీ:** తమ జట్టులో హిందువు అయిన స్పిన్నర్ డానిష్ కనేరియాపట్ల పాకిస్థాన్ జట్టులోని కొందరు క్రికెటర్లు తీవ్ర వివక్ష చూపారని షోయబ్ అక్తర్ వెల్లడించాడు. అతడితో కలిసి భోజనం చేసేందుకూ వారు నిరాకరించారని తెలిపాడు. 'నేను ఆడే సమయంలో జట్టులో ఇద్దరు ముగ్గురు ఆటగాళ్లు ప్రాంతీయతత్వం ప్రదర్శించేవారు. ఎవరు కరాచీ, ఎవరు పంజాబీ, ఎవరు పెషావర్ అని మాట్లాడేవారు. వీరిపై ఎంతో పోరాడా. పాకిస్థానీయుల గురించే అలా మాట్లాడేవారంటే ఇక జట్టులో హిందువు పరిస్థితి ఎలా ఉండేదో ఆలోచించండి. కనేరియా మాకు ఎన్నో విజయాలు అందించాడు. కానీ అతడిని ప్రశంసించడానికి బదులు.. కనేరియా ఈ దేశంలో ఎలా జీవిస్తున్నాడు అని మా జట్టులోని ఆటగాళ్లు తప్పుపట్టేవారు' అని అక్తర్ వెల్లడించాడు. తనపై వివక్ష నిజమేనని కనేరియా చెప్పాడు. 'నేనాడే రోజుల్లో నాపై వివక్షపై మాట్లాడేందుకు సాహసించలేదు. ఇప్పుడు షోయబ్ చెప్పిన విషయాలు నిజమే' అని 61 టెస్ట్‌ల్లో 261 వికెట్లు పడగొట్టిన కనేరియా అన్నాడు.






## దక్షిణాఫ్రికా 277/9

**ఇంగ్లండ్‌తో తొలి టెస్ట్**

**సెంచూరియన్:** క్వింటన్ డికాక్ (95) రాణించడంతో దక్షిణాఫ్రికా తడబడి నిలిచింది. ఇంగ్లండ్‌తో నాలుగు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం మొదలైన తొలి టెస్ట్‌లో ఆతిథ్య దక్షిణాఫ్రికా ఆట ముగిసేసరికి మొదటి ఇన్నింగ్స్‌లో 277/9 స్కోరు చేసింది. 111/5తో కష్టాల్లో పడిన దక్షిణాఫ్రికాకు ప్రిటోరియస్ (33), డికాక్ ఆరో వికెట్‌కు 87 రన్స్ జోడించి ఆదుకున్నారు. ఫిలాండర్ (28) క్రీజులో ఉన్నాడు. సామ్ కర్రాన్ (4/57), బ్రాడ్ (3/52) సౌతాఫ్రికాను వణికించారు.

### ఆండర్సన్ @150



ఈ మ్యాచ్‌తో ఇంగ్లండ్ పేసర్ జేమ్స్ ఆండర్సన్ 150 టెస్ట్‌లు ఆడిన తొలి ఫాస్ట్‌బౌలర్‌గా రికార్డు సృష్టించాడు. ఈ జాబితాలో స్టువర్ట్ బ్రాడ్ (135), వాల్ష్ (132), కపిల్ దేవ్ (131)ను వెనక్కి నెట్టిన ఆండర్సన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. కాగా, 142 ఏళ్ల టెస్ట్ క్రికెట్‌లో 150 టెస్ట్‌లు ఆడిన 9వ ఆటగాడిగా నిలిచాడు. ఈ జాబితాలో సచిన్ (200), పాంటింగ్ (168), స్టీవ్ వా (168), కలిస్ (166), చంద్రపాల్ (164), ద్రావిడ్ (164), అలిస్టెర్ కుక్ (161), అలెన్ బోర్డర్ (156) ముందున్నారు.

## ఆస్ట్రేలియా 257/4

### న్యూజిలాండ్‌తో రెండో టెస్ట్



స్మిత్

**మెల్‌బోర్న్:** స్టీవ్ స్మిత్ (77 బ్యాటింగ్) అజేయ అర్ధ శతకంతో క్రీజులో నిలవడంతో న్యూజిలాండ్‌తో రెండో టెస్ట్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియా భారీ స్కోరు దిశగా సాగుతోంది. గురువారం మొదలైన ఈ బాక్సింగ్ డే టెస్ట్‌లో తొలిరోజు ఆట ముగిసేసరికి ఆసీస్ మొదటి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లకు 257 పరుగులు చేసింది. స్మిత్‌తోపాటు ట్రావిస్ హెడ్ (25) క్రీజులో ఉన్నాడు. గ్రాండ్‌హోమ్ 2 వికెట్లు తీశాడు. ఓపెనర్ జొ బర్న్స్ డకౌటవగా.. వార్నర్ 41, లబుషేన్ 63, మాథ్యూ వేడ్ 38 రన్స్ చేశారు. నాలుగో నెంబర్‌లో వచ్చిన స్మిత్.. లబుషేన్‌తో కలసి మూడో వికెట్‌కు 83 పరుగులు జోడించాడు.

## మెరిసిన శశికాంత్, స్టీఫెన్

**బెంగాల్ 289 ఆలౌట్ ● ఆంధ్రతో రంజీ**



క్యాచ్ పడుతున్న విహారి

**కోల్‌కతా:** ఆంధ్రతో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో ఆతిథ్య బెంగాల్ తక్కువ స్కోరుకు పరిమితమైంది. పేసర్లు శశికాంత్ (4/64), స్టీఫెన్ (4/78) విజృంభణతో.. ఓవర్‌నైట్ స్కోరు 241/4తో రెండోరోజైన గురువారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బెంగాల్ 289 రన్స్‌కు ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మెన్ అభిషేక్ రమణ్ (112), శ్రీవాత్స్ గోస్వామి (25)లను శశికాంత్ అవుట్ చేశాడు. స్టీఫెన్ దెబ్బకు టెయిలెండర్లు షాబాజ్ (7), అమిత్ (8) సింగిల్ డిజిట్‌కే వెను దిరిగారు. ఆకాశ్‌దీప్ (0) డకౌటయ్యాడు. షోయబ్ ఖాన్, పృథ్వీరాజ్ చెరో వికెట్ తీశారు. వెలుతురు మందగించడంతో లంచ్ బ్రేక్ తర్వాత ఆటను రద్దు చేశారు. దీంతో ఆంధ్రకు బ్యాటింగ్ అవకాశం రాలేదు. ప్రతికూల వాతావరణం కారణంగా రెండోరోజు 21 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది.

## రాణించిన తిలక్ వర్మ

**తొలి వన్డేలో సఫారీలపై యువ భారత్ గెలుపు**

**ఈస్ట్ లండన్ (దక్షిణాఫ్రికా):** ఓపెనర్లు దివ్యాంశ్ సక్సేనా (86), తిలక్ వర్మ (59) అదరగొట్టడంతో దక్షిణాఫ్రికా టూర్‌ను భారత అండర్-19 జట్టు విజయంతో ఆరంభించింది. యూత్ వన్డే సిరీస్‌లో భాగంగా గురువారం జరిగిన మొదటి మ్యాచ్‌లో ఆతిథ్య దక్షిణాఫ్రికాను భారత్ 9 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. తొలుత దక్షిణాఫ్రికా 48.3 ఓవర్లలో 187 పరుగులకు ఆలౌటైంది. రవి బిష్ణోయ్ మూడు వికెట్లు పడగొట్టాడు. అనంతరం భారత్ 42.3 ఓవర్లలో వికెట్ నష్టానికి 190 రన్స్ చేసి లక్ష్యాన్ని ఛేదించింది. సక్సేనా, వర్మ తొలి వికెట్‌కు 127 పరుగులు జత చేశారు.

### ఐఎస్‌ఎల్‌లో గోవా గెలుపు

**చెన్నై:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్)లో గురువారం జరిగిన మ్యాచ్‌లో ఎఫ్‌సీ గోవా 4-3తో చెన్నయిన్ ఎఫ్‌సీపై గెలిచింది. గోవా తరఫున అహ్మద్ జొహో (26వ), ఫెర్నాండెజ్ (41వ), హ్యూగో (46వ), ఫెర్రన్ కొరోమినాస్ (63వ) గోల్స్ సాధించగా.. చెన్నై ఆటగాళ్లు రాఫెల్ క్రివెల్లరో (59వ, 90వ), ఆంద్రే స్కెంబ్రీ (57వ) గోల్స్ చేశారు.



### సాంగ్వాన్‌పై ఏడాది సస్పెన్షన్

**న్యూఢిల్లీ:** భారత బాక్సర్ సుమిత్ సాంగ్వాన్ డోప్ పరీక్షలో విఫలమయ్యాడు. ఈ ఏడాది అక్టోబరు 10న నిర్వహించిన డోప్ పరీక్షలో సుమిత్ నిషేధిత ఉత్ప్రేరకం వాడినట్లు తేలింది. దీంతో అతనిపై ఏడాదిపాటు సస్పెన్షన్ విధిస్తున్నట్టు జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) డీజీ నవీన్ అగర్వాల్ గురువారం వెల్లడించారు. ఈ సస్పెన్షన్ తక్షణమే అమల్లోకి వస్తుందని తెలిపారు. ఫలితంగా సుమిత్.. త్వరలో జరగనున్న ఒలింపిక్ క్వాలిఫయర్ ట్రయల్స్‌లో పాల్గొనే అవకాశాన్ని కోల్పోయాడు.





















Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.